fb/prajasakti, www.prajasakti.com

ప్రజాశక్తి

సిటీ◆

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 27 | విజయవాడ, ఆదివారం 28 జనవరి 2018 | 12 + 12 పేజీలు వేల : 5.00

రేపటి నుంచి పార్లమెంట్ సమావేశాలు

- ఫిబ్రవరి 1న వార్షిక బడ్జెట్... • జనవరి 31న ఆర్థిక సర్వే
- సాధారణ ఎన్నికలకు ముందు చివరి పూర్తిస్థాయి బడ్జెట్



8

కాబూల్‌లో భారీ పేలుడు



- 95 మంది మృతి, 158 మందికి గాయాలు
- తామే కారణమన్న తాలిబన్

కాబూల్ : ఆఫ్ఘన్ రాజధాని కాబూల్‌లో శనివారం జరిగిన భారీ పేలుడులో 95 మంది మరణించారు. 158మంది గాయపడ్డారని అధికారులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కాబూల్‌లో రద్దీగా వుండే ప్రాంతంలో పేలుడు పదార్థాలతో నిండిన అంబులెన్సును ఆత్మాహుతి బాంబర్ పేల్చివేయడంతో ఈ దుర్ఘటన చోటు మిగతా 8లో

పద్మావత్ ప్రదర్శిస్తున్న
థియేటర్‌పై బాంబు దాడి



చెన్నై : తమిళనాడులో పద్మావత్ సినిమా ప్రదర్శించే థియేటర్‌పై పెట్రోల్ బాంబు విసిరిన సంఘటన సంచలనం కలిగించింది. కాగా ఈ ప్రమాదంలో ఎవరికి గాయలు కాలేదని పోలీసులు పేర్కొన్నారు. సేలం జిల్లాలో కొత్త బస్టాండుకు సమీపంలో ఉన్న థియేటర్ల సముదాయంలోని ఒక హాల్లో పద్మావత్ చిత్రాన్ని ప్రదర్శిస్తున్నారు. ఆసమయంలో బైకులపై వచ్చిన నలుగురు వ్యక్తులు పెట్రోల్ బాంబు విసిరారు. వెంటనే అప్రమత్తమైన మిగతా 8లో

ఇష్టం లేకుంటే..
నమస్కారం పెట్టి పోవచ్చు

- బిజెపి విమర్శలపై చంద్రబాబు వ్యాఖ్య
- త్వరలో కొత్త సేద్య సాంకేతికత
- విశాఖలో 2 వేల ఎకరాల్లో మెడ్‌టెక్ ఇన్నోవేషన్ సెంటర్ జోన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'నేను మా వాళ్లను అదుపుచేస్తున్నాను. వారు మాత్రం ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతూనే ఉన్నారు. ఇష్టం లేకపోతే నమస్కారం పెట్టి పక్కకు పోవచ్చు' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో బిజెపి చేస్తున్న విమర్శలపై ముఖ్యమంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు కలకలం రేపాయి. బిజెపి ఎంఎల్‌ఏ విష్ణుకుమార్ రాజు, మిగతా 9లో



మూలపాడులో ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ ఆఫీసర్స్ క్రికెట్ టోర్నమెంటును ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు వార్త 12లో

తేల్చుకోవాల్సింది మీరే



- మిత్ర ధర్మంపై సిఎం వ్యాఖ్యలు సమంజసం కాదు
- బిజెపి నేత పురందేశ్వరి

ప్రజాశక్తి - వన్‌టౌన్/అమరావతి బ్యూరో

బిజెపి మిత్రధర్మం పాటించడం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అనడం సరికాదని, తమతో కలిసి ఉంటారో లేదో టిడిపినే తేల్చుకోవాలని మాజీ కేంద్ర మంత్రి, బిజెపి నేత పురందేశ్వరి అన్నారు. శనివారం విజయవాడలోని పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందిస్తూ రెండు పార్టీ అధ్యక్షులు కలిసి మాట్లాడుకుని పొత్తుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలనే టిడిపి సర్కారు పేరుగా మార్చి తనదిగా చెప్పుకుంటుందని అన్నారు. పంచాయతీలకు కేంద్రం నుంచి నిధులు నేరుగా అందుతున్నాయని చెప్పారు. ఫిరాయింపు నేతలపై చర్యలు తీసుకోవాలని బిజెపి అధ్యక్షులు అమిత్‌షాకు లేఖ రాసినట్లు తెలిపారు. ఎన్టీఆర్ హయాంలో టిడిపిలోకి ఎవరైనా వస్తే రాజీనామా చేసి రావాల్సిందిగా సూచించినట్లు చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లు పాస్ చేయించుకోవాల్సిన బాధ్యత అన్ని పార్టీలపై ఉందని, త్రిపుల్ తలాక్ విషయంలో మోడీ ప్రభుత్వ నిర్ణయం ముస్లిం మహిళలకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు.

కొణతాల రైలు దీక్ష ప్రారంభం



విజయవాడ రైల్వే స్టేషన్‌లో కొణతాల రామకృష్ణకు మద్దతు తెలుపుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

- విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-డాబాగార్డెన్స్, విశాఖ

విభజన హామీల చట్టంలో రాష్ట్రానికి ఇస్తామన్న ప్రత్యేకహోదా, విశాఖ రైల్వేజోన్, ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీలు, విశాఖలో ఎయిమ్స్, గిరిజన విశ్వవిద్యాలయం తదితర హామీలన్నింటినీ నెరవేర్చాలని కోరుతూ ఎపి ఎక్స్‌ప్రెస్‌లో మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ శనివారం దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు సిపిఎం నాయకులు సిహెచ్.నర్సింగరావు, డాక్టర్ బి.గంగారావు, సిపిఐ నాయకులు జెవి.సత్యనారాయణమూర్తి, లోక్‌సత్తా నాయకులు భీశెట్టి బాబ్జి, కాంగ్రెస్ నాయకులు ద్రోణంరాజు శ్రీనివాస్, వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, విద్యార్థులు పెద్ద ఎత్తున రైల్వే స్టేషన్‌కు వెళ్లి ఆయనకు మద్దతు తెలిపారు. అనంతరం మిగతా 9లో

సేద్యానికి ప్రత్యేక చట్టం చేయాలి

సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు




ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రత్యేక చట్టం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు డిమాండ్ చేశారు. పంట ఉత్పత్తికి వెచ్చించిన ఖర్చు కంటే ఒకటిన్నర రెట్లు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో నిర్వహిస్తున్న సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో పాల్గొన్న ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోడీ తీసుకున్న నోట్ల రద్దు, జిఎస్‌టి కారణంగా ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని రాఘవులు విమర్శించారు. వ్యవసాయానికి కేటాయింపులను కత్తిరించినందున ఈ రంగం సంక్షోభంలో కూరుకొని పోయిందన్నారు. వ్యవసాయాన్ని మిగతా 9లో

పార్టీలకు కాదు.. పాలసీలకు వ్యతిరేకం

- రైతులకు అండగా ఉండే పార్టీలకు మద్దతిస్తాం
- రాయలసీమ అభివృద్ధి జనసేన బాధ్యత
- 'అనంత' పర్యటనలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్



ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

జనసేన ఇతర పార్టీలకు వ్యతిరేకం కాదని, అవి అవలంభించే ప్రజా వ్యతిరేక పాలసీలకే వ్యతిరేకమని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. మూడురోజుల పర్యటనలో భాగంగా శనివారం ఆయన అనంతపురం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. తొలుత జిల్లా కేంద్రంలోని గుత్తి రోడ్డు వద్ద రెండెకరాల్లో నిర్మించనున్న జనసేన పార్టీ కార్యాలయం పనులకు భూమిపూజ చేశారు.సాయంత్రం కెటిఆర్ ఫంక్షన్ హాల్లో రైతులు, వ్యవసాయ రంగ నిపుణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ప్రజలు, అభిమానులనుద్దేశించి పవన్ ప్రసంగించారు. తనపై అభిమానం చూపిస్తున్న ప్రజల కోసం మిగతా 9లో



విత్తన సంస్థల మూసివేత కారణంగా నష్టపోతున్న పత్తి రైతులను కాపాడాలని కోరుతూ శనివారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏపి రైతు సంఘం వార్త 7లో

ఫిబ్రవరి 21 నుంచి టెట్ పరీక్షలు

మార్చి 16న ఫలితాలు
తాజాగా కొత్త షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లకు తాజా షెడ్యూల్ విడుదలయింది. ఇప్పటికే రెండు సార్లు ఈ షెడ్యూల్ మార్చిన ప్రభుత్వం ముచ్చటగా మూడోసారి మార్చింది. అభ్యర్థుల కోరికపై 16 రోజుల పాటు ప్రభుత్వం ఈ పరీక్షలను వాయిదా వేసింది. ఫిబ్రవరి 5 నుంచి 15 వరకు నిర్వహించాల్సిన ఈ పరీక్షలను ఫిబ్రవరి 21 నుంచి మార్చి 3 వరకు నిర్వహి స్తామని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు మిగతా 9లో

తాజా షెడ్యూల్

హెల్ప్ డెస్క్	మార్చి 3 వరకు
ఫిర్యాదుల స్వీకరణ	ఫిబ్రవరి 17 వరకు
మాక్‌టెస్ట్ ఆన్‌లైన్‌లో	ఫిబ్రవరి 9
హాల్‌టికెట్ డౌన్‌లోడ్	ఫిబ్రవరి 10
పరీక్ష తేదీలు	ఫిబ్రవరి21 నుంచి మార్చి 3
ప్రాథమిక కీ	మార్చి 4
'కీ'పై అభ్యంతరాల స్వీకరణ	మార్చి 4 నుంచి 9వరకు
చివరి 'కీ' విడుదల	మార్చి 12
ఫలితాలు విడుదల	మార్చి 16

టెండర్ల తకరారు..!

- పంట కుంటల లైనింగ్ పనులు ఉత్పత్తిదారులకేనట
- కొత్త షరతుతో డీలాపడ్డ డీలర్లు
- సుమారు 500 కోట్ల టెండర్ ప్రక్రియపై అనుమానాలు
- ముఖ్యమంత్రికీ అందిన ఫిర్యాదులు



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా అమలు చేయనున్న ఫారం పాండ్స్ (పంట సంజీవని) లైనింగ్‌కు టెండర్లు వివాదాస్పదమవుతున్నాయి. వర్షపు నీటిని నిల్వ చేసేందుకు తవ్విన చెరువుల్లో లైనింగ్ షీట్ల అమర్చేందుకు గతంలో డీలర్లకు కూడా టెండర్ దాఖలు చేసే హక్కు ఉండగా, తాజాగా ఆయా ఉత్పత్తి సంస్థలకు మాత్రమే పరిమితం చేయాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం వివాదానికి కారణమవుతోంది. కేవలం కొందరి ఒత్తిళ్ల వల్లనే ఈ నిర్ణయం తీసుకున్నారన్న ఆరోపణలు బాహాటంగానే వ్యక్తమవుతున్నాయి. ఈ వివాదం ముఖ్యమంత్రి పేషీ దృష్టికి వెళ్లడంతో తెర వెనుక శక్తుల హస్తంపై ఆరా తీస్తున్నారు. రాష్ట్రంలో నిర్మిస్తున్న ఫారంపాండ్స్‌లో నీరు భూమిలోకి ఇంకి పోకుండా ప్రత్యేకంగా లైనింగ్ చేయించాలని నిర్ణయించారు. ఈనెల 9న అందుకు టెండర్లు పిలిచారు. కేవలం లైనింగ్ మెటీరియల్‌ను ఉత్పత్తి చేసే సంస్థలు మాత్రమే ఈ టెండర్లలో పాల్గొనాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. వాస్తవానికి అలాంటి లైనింగ్ షీట్లు ఉత్పత్తి చేసే సంస్థ ఒక్కటీ రాష్ట్రంలో లేదు. లైనింగ్ పనులకు స్థానిక డీలర్లే టెండర్లు వేయడం, వారే ఆ పనులు పూర్తి చేస్తుండేవారు. తాజా టెండర్ నోటిఫికేషన్‌లో మిగతా 9లో

దావోస్‌లో పెట్టుబడులు ఎన్ని వచ్చాయి? : వైసిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దావోస్ పర్యటనలో ఎన్ని పెట్టుబడులు వచ్చాయో ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలకు తెలపాలని వైసిపి అధికార ప్రతినిధి జోగి రమేష్ డిమాండ్ చేశారు. విజయవాడ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పర్యటనల పేరుతో సిఎం సొంత వ్యవహారాలను చక్కబెట్టుకుంటున్నారని విమర్శించారు. దావోస్ పర్యటన మోజులో చంద్రబాబు గణతంత్ర వేడుకలకు హాజరుకాకపోవడం దారుణమన్నారు. సూర్య నమస్కారం చేయడం అనాదిగా వస్తోన్న సాంప్రదాయమని, ఈ పాత విషయాన్ని దావోస్‌లో తెలుసుకున్నట్లుగా చంద్రబాబు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు.

ప్రతిభ

విజయవాడలోని విఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 19 మంది విద్యార్థులు తయారు చేసిన గోకార్ట్ కారుతో విద్యార్థులు



గోకార్ట్ కారు తయారీలో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పెనమలూరు (విజయవాడ)

విఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 19 మంది విద్యార్థులు గోకార్ట్ కారును తయారు చేసి జాతీయ స్థాయిలో పాల్గొనడంతోపాటు బెస్ట్ ఫ్యూయల్ ఎకానమీ కేటగిరిలో మొదటి బహుమతి పొందారు. ఈ మేరకు తమ కళాశాలకు పేరు ప్రతిష్టలు తీసుకువచ్చారని సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ పి.లక్ష్మణరావు తెలిపారు. శనివారం కళాశాలలో గోకార్టు కారును విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొసైటీ ఆఫ్ మెకానికల్ అండ్ ఆటోమెటివ్ ఇంజినీర్ సంస్థ ఆధ్వర్యంలో స్టూడెంట్ కార్ట్ డిజైన్ ఛాలెంజ్ పోటీలు జరిగాయన్నారు. ఈ గోకార్ట్ కారు 125 సిసి ఇంజిన్‌తో రెండు నెలల వ్యవధిలో తయారు చేశారని పేర్కొన్నారు. దీని గరిష్ట వేగం గంటలకు 89 కిలోమీటర్లు, సగటు వేగం గంటకు 59 కిలోమీటర్లు ఉంటుందన్నారు. బ్రేక్ టెస్ట్ యాక్సిలరేషన్ టెస్ట్, స్కిడ్ పాడ్ టెస్ట్, ఆటో క్రాస్ మొదలగు పోటీలలో అర్హత పొంది చివరి పోటీలకు సన్నద్ధమయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల కన్వీనర్ ఎం.రాజయ్య, జాయింట్ సెక్రటరీ నిమ్మగడ్డ లలిత ప్రసాద్, ప్రిన్సిపల్ ఎవి.రత్నప్రసాద్ తదితరులు అభినందించారు.



పొడి వాతావరణం

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రంలో వాతావరణం పొడిగా కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. శనివారం కోస్తాలో అక్కడక్కడా పొగమంచు కురిసిందని తెలిపింది. రాబోయే మూడు రోజులపాటు కోస్తా, సీమల్లో సాధారణంగా ఉంటుందని వివరించింది. దక్షిణ బంగాళాఖాతంలో భూమధ్య రేఖా ప్రాంతానికి ఆనుకుని అల్పపీడన ద్రోణి, దానికి ఆనుబంధంగా 2.1 కి.మీ ఎత్తులో ఆవర్తనం కొనసాగుతోందని తెలిపింది. మరోవైపు నైరుతి బంగాళాఖాతంలో తమిళనాడు తీరానికి ఆనుకుని ఆవర్తనం కొనసాగుతోందని భారత వాతావరణ శాఖ పేర్కొంది.

క్షమాభిక్ష ఎప్పుడు?



- ఈ ఏడాదింకా విడుదలకు నోచుకొని అర్హులైన ఖైదీలు
- వచ్చే ఉగాదికి అవకాశం..?

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వాళ్లంతా ఒకప్పుడు కరడుగట్టిన నేరగాళ్లు. తెలిసో తెలియకో భయంకరమైన నేరాలు చేసి జీవిత ఖైదు పడి ఏళ్ల తరబడి జైలు జీవితం అనుభవిస్తున్న వారు. వారిలో కొందరు సత్ప్రవర్తనతో గణతంత్ర దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవం వంటి జాతీయ పర్వ దినాల్లో క్షమాభిక్ష కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తుంటారు. అటువంటి వారి క్షమాభిక్ష కోసం రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు సిఫారసులు చేస్తుంటాయి. కుటుంబ సభ్యులూ కోరుకుంటుంటారు. ఎవరూ లేని వారిని కొన్నిసార్లు ప్రభుత్వాధికారులే సుమోటోగా విడుదల చేస్తుంటారు. ఏటా లేదా రెండేళ్లకోసారి ఖైదీల సంఖ్య, ప్రభుత్వ వెసులుబాటును బట్టి ఈ ప్రక్రియ సాగుతుంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా నవంబర్ 1వ తేదీన గతంలో ఒకసారి కొందరు ఖైదీలకు క్షమాభిక్ష ప్రకటించి విడుదల చేశారు. రాష్ట్రం విడిపోయిన తరువాత మొదటిసారి 2016లో గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని సుమారు 400 మంది ఖైదీలకు క్షమాభిక్ష లభించింది. 2016 ఖైదీల విడుదలకు సుమారు రెండు నెలల ముందుగానే 2015 నవంబర్ 18వ తేదీన ఈ జీవో విడుదల చేశారు. ఈ జీవోలోని మార్గదర్శకాల ప్రకారమే ఖైదీల విడుదల కార్యక్రమం చేపట్టారు. అప్పట్లో క్షమాభిక్షతో బయటకు వచ్చిన కొందరి ఖైదీల విడుదల పట్ల విమర్శలూ వచ్చాయి. రాజకీయ కారణాలతోనే విడుదల చేసినట్లు ప్రతిపక్షాలు ఆరోపించాయి.

ఈ ఏడాదింకా జైలు గోడల మధ్యనే

ఈ ఏడాదీ కొందరు ఖైదీలకు క్షమాభిక్ష ప్రకటించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విధివిధానాల రూపకల్పనకు సంబంధించి ఒక కమిటీనీ ఏర్పాటు చేసింది. హోం శాఖ ముఖ్య కార్యదర్శి ఛైర్మన్‌గా న్యాయశాఖ కార్యదర్శి, రాష్ట్ర డిజిపి, సిఐడి ముఖ్య న్యాయ సలహాదారు, ఇంటిలిజెన్స్ అదనపు డిజి, జైళ్ల శాఖ డిజి సభ్యులుగా ఉన్న కమిటీ ప్రభుత్వ విధి విదానాల ప్రకారం అర్హులైన ఖైదీల ఎంపికను ఖరారు చేయాలి. మొత్తం ప్రక్రియ పూర్తయి జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఖైదీలు విడుదలవ్వాల్సి ఉన్నా ప్రభుత్వ నిర్లక్ష్యంతో అర్హులైన వారు ఇంకా నాలుగు గోడల మధ్య జైళ్లలోనే మగ్గుతున్నారు. అర్హులు స్వేచ్ఛ కోసం ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది జనవరి 23న ఖైదీల విడుదలకు సంబంధించిన మార్గదర్శకాలతో కమిటీ నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ ఖైదీలను ఎంపిక చేయడానికి కనీసం రెండు నెలలు పట్టే అవకాశం ఉంది. వచ్చే ఉగాది సమయానికి జాబితాను ఖరారు చేసి ఖైదీలను విడుదల చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. రాజకీయ కారణాలతోనే కొందరు అధికార పార్టీ నేతలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తమ అనుకూలమైన ఖైదీలను క్షమాభిక్ష పేరుతో బయటకు తెచ్చుకోవడానికే ప్రక్రియను ఆలస్యం చేయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. క్షమాభిక్షకు ఎంపికైన తుది జాబితాలో అన్ని అర్హతలున్న తమవారి పేర్లు ఉండవేమోనని కొందరు ఖైదీల బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖైదీల విడుదలపై ప్రభుత్వం కూడా ప్రత్యేక దృష్టి సారించి పారదర్శకంగా జాబితా రూపొందే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వేరుశనగను కొనుగోలు చేయించాలి

సిఎంకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వేరుశనగ పంటను ఆయిల్‌ఫెడ్, నాఫెడ్లతో కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు శనివారం లేఖ రాశారు. రాష్ట్రంలో వేరుశనగ పంట కొనుగోళ్లకు ఏర్పాటు చేసిన 22 కేంద్రాల్లో ఒక్కో కేంద్రంలో 10 వేల బస్తాలకు పైగా కొనుగోలు చేయాల్సిన పంట ఉందని తెలిపారు. గిడ్డంగులు సిద్ధం కాలేదనే సాకుతో అధికారులు కొనుగోలు నిలిపివేశారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 13 లక్షల క్వింటాళ్ళ పంటను కొనుగోలు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 2.60 లక్షల క్వింటాళ్ళనే కొనుగోలు చేశారని వివరించారు.

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి : రఘువీరా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుంటూరు జిల్లా పెద గొట్టిపాడులో దళితులపై దాడికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించి, బాధిత దళితులకు రక్షణ కల్పించాలని పిసిసి అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు శనివారం లేఖ రాశారు ఆ గ్రామంలోని చిన్న విషయాన్ని ఆసరా చేసుకుని పెత్తందార్లు దౌర్జన్యకాండకు పూనుకున్నారని, ఈ సంఘటనను రాజీ చేసేందుకు మంత్రులతోపాటు ఎమ్మెల్యేలు డ్రామాలాడుతున్నారని విమర్శించారు. గత 25 రోజులుగా అక్కడ దళితులపై అప్రకటిత సాంఘిక బహిష్కరణ అమలవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దళిత బాధితులను పరామర్శించేందుకు గొట్టిపాడు బయలుదేరిన పార్లమెంట్ మాజీ సభ్యులు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు సహా కాంగ్రెస్ ఎస్సీ సెల్ విభాగం ఛైర్మన్ కొరివి వినయ్, దళిత ప్రజా సంఘాల నాయకులను శాంతి భద్రతల పేరుతో పోలీసులు అరెస్ట్ చేసి నిర్బంధించడం దారుణమన్నారు.

అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి పథకంలో జాతీయ స్థాయి అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ గడువును కేంద్రం పొడిగించింది. ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉప కార్యదర్శి ఎ.కె సుంబ్లీ ఉత్తర్వులు విడుదల చేశారు. పథకం అమలులో భాగంగా కూలీ చెల్లింపునకు సంబంధించి 2016-17 ఏడాదికి దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ ఏడాది ఫిబ్రవరి 20వ తేదీ వరకూ పెంచారు.

ఎస్‌వియు పాలక మండలిలో ఎన్‌ఎంఆర్‌లకు మొండిచెయ్యి

- పార్కులకు, భవనాల నిర్మాణాలకే అనుమతులు
- నిధుల దుర్వినియోగానికే ప్రాధాన్యత

ప్రజాశక్తి - క్యాంపస్ (తిరుపతి)

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పాలకమండలి సమావేశాలను శనివారం ఎస్‌వియు ఉపకులపతి ఛాంబర్‌లో నిర్వహించారు. నాన్ మస్టర్ రోల్ (ఎన్‌ఎంఆర్)లకు ఈసారీ మొండిచేయే చూపించినట్లు సమాచారం. కమిటీని వేసి విధివిధానాల ప్రకారం నిర్ణయాలు తీసుకుంటారని తెలిసింది. వివిధ విభాగాలలో పనిచేస్తున్న ఎన్‌ఎంఆర్‌లకు టైం స్కేల్ ఇవ్వడంపై పాలకమండలిలో ఇద్దరిని, ఆచార్యులుగా ఇద్దరిని నియమించి చేతులు దులుపుకున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా వర్సిటీలో అభివృద్ధి పేరిట వివిధ ప్రదేశాలలో పార్కులను ఏర్పాటు చేయడం కోసం రెండు కోట్ల రూపాయల నిధులను వెచ్చించినట్లు తెలిసింది. ఇప్పటికే పరిపాలనా భవనం, ఆడిటోరియం వద్ద ఉన్న పార్కులను కాపాడుకునేందుకు కనీసం కంచెను కూడా ఏర్పాటు చేయలేదు. ఇప్పుడు కొత్తగా నూతన పార్కులకు, భవనాలకు నిధులను కేటాయించి వృథా చేస్తున్నారని పాలకమండలి సభ్యులే చెబు తుండటం గమనార్హం. సిఎఎస్‌లను, ఇన్నోవేషన్ సంస్థపై వచ్చిన ఫిర్యాదులను కూడా పాలకమండలిలో చర్చించినట్లు తెలిసింది. వాటిపై సమగ్ర నిర్ణయాలను మాత్రం తీసుకోలేదని సమాచారం. బోధనానుభవం లేదని ఒక వర్గం అధ్యాపకునికి ఎఎస్‌లో ప్రమోషన్ కల్పించకపోగా, అధికార వర్గానికి చెందిన వ్యక్తికి బోధనానుభవం లేకుండానే ప్రమోషన్ కల్పించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ కార్యక్రమంలో ఐఎఎస్ అధికారులు, పాలక మండలి సభ్యులు డాక్టర్ గురుప్రసాద్, చంద్రయ్య, అబ్బయ్య, బాల సిద్దముని, రెక్టార్ ఆచార్య భాస్కర్, రిజిస్ట్రార్ ఆచార్య ఆర్‌కె.అనురాధ పాల్గొన్నారు.

ప్రజ్ఞ

సమాధానాలు 7లో

1. ఈ ఏడాది అశోక చక్ర అవార్డును ఎవరికి ప్రకటించారు?
2. కష్టాల్లో వున్నవారి ఆదుకోవడం కోసం పంజాబ్ ప్రారంభించిన పథకం?
3. ఇస్రోకు చెందిన ఎల్‌పిఎస్‌సికు నూతన డైరెక్టర్?
4. ఇటీవల మరణించిన సుప్రియాదేవి ఏ రంగానికి చెందినవారు?
5. ఏ మెట్రో నగరంలో తొలిసారి నీటిపై తేలియాడే మార్కెట్‌ను ప్రారంభించారు?

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక,
ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4,
గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ
editorprajasakthi@gmail.com
కు పంపవచ్చు.

జగన్ పాదయాత్రకు వైఎస్‌ఆర్ అభిమానుల సంఘీభావం

ప్రజాశక్తి-గూడూరురూరల్



గూడూరు మండలం కాంద్ర గ్రామంలో మహిళల సమస్యలు తెలుసుకుంటున్న జగన్

నెల్లూరు జిల్లా గూడూరు మండలంలో కొనసాగుతున్న వైసిపి నేత జగన్ పాదయాత్రకు వైఎస్‌ఆర్ అభిమానులు సంఘీభావం తెలిపారు. జగన్ చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర శనివారం ఓజిలి మండలంలో ప్రారంభమై గూడూరు మండలం తుమ్మసముద్రానికి చేరుకుంది. దారి పడువునా ప్రజలను పలకరిస్తూ పాదయాత్ర కొనసాగించారు. కాంద్ర గ్రామంలో భారీ సంఖ్యలో ఆయన్ను కలిసి వారి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. వైఎస్ హయాంలోనే పేదలకు భరోసా లభించిందని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అందరి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామం లో వైసిపి పతాకాన్ని ఆవిష్కరించారు. వైఎస్ అభిమానులు జగన్‌ను కలిసి పాదయాత్రకు సంఘీ భావం తెలిపారు. కొందరు వృద్ధులు తమకు పింఛన్ అందడం లేదని జగన్ దృష్టికి తీసుకువచ్చారు. దానికి ఆయన స్పందిస్తూ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించడంలో విఫలమైందని, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జగన్ పాదయాత్ర ఆదివారం గూడూరుకు చేరుకుంటుందని పార్టీ వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో నెల్లూరు, తిరుపతి ఎంపిలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వరప్రసాద్, ఎంఎల్‌ఎలు కాకాణి గోవర్దన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, వైసిపి నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, మేరిగ మురళీ, మైనార్టీ విభాగం నాయకులు మక్దూం, రాష్ట్ర నాయకులు షేక్ కాలేషా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగు పరిరక్షణకు అందరి కృషి అవసరం

తెలుగు భాషా సాహితీ మహోత్సవంలో సాహితీవేత్తలు

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు)

ఆధునిక పోకడలో తెలుగు భాష ఔన్నత్యం కుదించుకుపోతోందని, ఈ క్రమంలో తెలుగు భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని సాహితీ వేత్తలు అభిప్రాయపడ్డారు. గుంటూరు జిల్లా తెనాలిలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న తెలుగు భాష సాహితీ మహోత్సవాల్లో భాగంగా శనివారం 'భాషా వికాసం-సాహితీ ప్రక్రియలు' అంశంపై చర్చాగోష్ఠి నిర్వహించారు. కె.శివారెడ్డి అధ్యక్షత వహించగా సాహితీ వేత్తలు నగ్నముని, శ్రీరమణ, సి.ఎస్.రావు, కందిమళ్ళ సాంబశివరావు, మీగడ రామలింగస్వామి, దవళ సత్యం, కర్ణాటి లక్ష్మీనరసయ్యలు మాట్లాడారు. నాటక రంగాన్ని ప్రోత్సాహించాల్సిన అవసరాన్ని ప్రస్తావించిన వారు రచయితలకు భాషా దారిద్ర్యం పోవాలంటే మాండలికాలను ఆశ్రయించాల్సిందేనని చెప్పారు. 1880 నుంచి నేటికీ తెలుగు నాట నాటక రంగ కీర్తి కొనసాగుతోందన్న వారు సినిమా నైతిక విలువలు కోల్పోవడంపై ఆవేదన వెలిబుచ్చారు. తెలుగు భాషా ప్రాధాన్యత, సందేశాత్మక సినిమాలను తీయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. జానపద కళలు, నాటక రంగాన్ని పోషించేవారు, పిల్లలకు చందమామ కథలు చేప్పేవారు కరువయ్యారన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రా ప్యారిస్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. మధ్యాహ్నం 'తెనాలి సాహితీ కళ చారిత్రాత్మక వైభవం' అంశంపై వల్లభనేని అశ్వినీకుమార్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. సాహితీ వేత్తలు ముత్తేవి రవీంద్రనాథ్, కె.నాగేశ్వరరావు, ఈమని శివనాగిరెడ్డి మాట్లాడారు. రాత్రి భువన విజయం నాటక ప్రదర్శన నిర్వహించారు. ఈ నాటకంలో శ్రీకృష్ణదేవరాయులు పాత్రలో స్థానిక ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ నటించడం విశేషం.

చెన్నంపల్లి కోటలో తవ్వకాలపై వార్తలను పిల్‌గా స్వీకరించిన హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్

కర్నూలు జిల్లా తుగ్గిలి మండలం చెన్నంపల్లి కోటలో గుప్త నిధుల పేరుతో యథేచ్ఛగా తవ్వకాలు సాగుతుండటంపై పత్రికల్లో వచ్చిన వార్తలను ఉదహరిస్తూ అందిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది. చారిత్రక కోటను ఇష్టానుసారంగా తవ్వేస్తున్నా అధికారకులు పట్టించుకోవడం లేదని దూపాడు గ్రామానికి చెందిన వైద్యుడు బ్రహారెడ్డి హైకోర్టుకు లేఖ రాశారు. కమిటీ దానిని పిల్‌గా పరిగణించి విచారణ చేయాలని నిర్ణయించింది. దీంట్లో రెవిన్యూ, పురావస్తు శాఖల కార్యదర్శులు, పరావస్తు శాఖ డైరెక్టర్, కర్నూలు జిల్లా కలెక్టర్ ఇతరులను ప్రతివాదులుగా చేశారు.

ఆరాధాన కోసం ఆదివారం పాఠశాలలా?

ఖండించిన యుటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సూర్య నమస్కారాల కోసం ఆదివారం పాఠశా లలు నిర్వహించొద్దని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ప్రభుత్వమే పాఠశాలలను ప్రచార వేదికలుగా మార్చొ ద్దని ఫెడరేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ సాబ్జీ, పి బాబురెడ్డి శనివారం ఒక ప్రకటనలో డి మాండ్ చేశారు. శాస్త్రీయ దృక్పథంతో ప్రకృతి గురించి, సూర్యుడు గురించి విద్యార్థులకు చెప్పడంలో విద్యార్థు లలో శాస్త్రీయ అవగాహన పెంచాలని తెలిపారు. ప్రభుత్వం దీనిని మతపరమైన అంశాలతో ముడిపెట్టి పాఠశాలల్లో సూర్య నమస్కారాలు, ఆరాధనలు, శ్లోకా లు, అష్టోత్రాలు చెప్పించా లనడం సరైందికాదని తెలి పారు. ఆదివారం పాఠశాలలు పెట్టి మరీ ఇలాంటి కార్యక్రమాలు జరపాలని ఉత్తర్వులు ఇవ్వడాన్ని ఖండి స్తున్నామని తెలిపారు. సూర్య నమస్కారాలు 27వ తేది జరపాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారని, దీనికి భిన్నంగా విశాఖ, కృష్ణ, అనంతపురం జిల్లాలు 28వ తేది ఆదివారం జరుపమనడం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే అన్ని ఉపాధ్యాయ సంఘాలతో కలిసి బహిష్కరిస్తామని హెచ్చరించారు.

'అనంత' జెఎన్‌టియులో ఈ టెక్నో ఫెస్ట్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ స్థాయి ఈ టెక్నో ఫెస్ట్‌ను నిర్వహించారు. శనివారం ఈ కార్యక్రమాన్ని వైస్ ఛాన్సలర్ శ్రీనివాసకుమార్ ప్రారంభించారు. ఫెస్ట్‌కు అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు జిల్లాల పరిధిలో దాదాపు 50 అనుబంధ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన 520 నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో ప్రదర్శించిన వాటిలో ప్రతిభ చాటిన 250 నమూనాలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు. విద్యార్థుల్లో ఉండే నైపుణ్యం, కొత్త ఆలోచనలు, ఆవిష్కరణల కోసం టెక్నో ఫెస్ట్ ఉపయోగపడుతుందని చెప్పారు.



ఫెస్ట్

అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన ఈ ఫెస్ట్‌లో విద్యార్థులు తయారు చేసిన నమూనాల గురించి అడిగి తెలుసుకున్న వైస్ ఛాన్సలర్ శ్రీనివాసకుమార్

నెరవేరిన ముప్పై ఏళ్ల కల

సోమశిల దక్షిణ కాలువ సైఫన్ నిర్మాణం పూర్తి

సాగునీరు విడుదల చేసిన మంత్రులు

ప్రజాశక్తి -పొదలకూరు (నెల్లూరు)

పొదలకూరు ప్రాంత రైతుల ముప్పై ఏళ్ల కల నెరవేరింది. సోమశిల దక్షిణ కాలువ సైఫన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దాంతో ఈ కాలువ ద్వారా శనివారం మండలంలోని తిరుపతి నాయుడుపల్లి వద్ద చెరువులకు సాగునీటిని వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అమరనాథ్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. కాలువ వెంట తాగునీటి పారుదలను మంత్రులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సోమిరెడ్డి మాట్లాడుతూ అటవీ శాఖ అనుమతి లేక సోమశిల దక్షిణ కాలువ సైఫన్ నిర్మాణ పనులు ఇంతకాలం ఆగి పోయాయన్నారు. గతంలో పనిచేసిన అటవీ శాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అందించిన సహకారంతో అనుమతులు వచ్చాయన్నారు. దీంతో త్వరితగతిన సైఫన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు. ఈ కాలువ కింద 7,500 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. సుమారు 8 గ్రామాల రైతులకు నీరందతుందన్నారు.

వంశధార నిర్వాసితులకు వసతులేవీ?

- 'ఉపాధి' ఊసెత్తని ప్రభుత్వం
- లబోదిబోమంటున్న నిర్వాసితులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం జిల్లాలో వంశధార నిర్వాసిత గ్రామాలు నేలమట్టమయ్యాయి. దీంతో ఆ గ్రామస్తులు గూడు కోల్పోయి వీధిన పడ్డారు. మరోవైపు ఉపాధి హామీ పనులకూ దూరమయ్యారు. నిర్వాసితులకు వేరే మండలాల్లో పునరావాసం కల్పించడంలో పనుల కల్పనకు సాంకేతికంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా ఉపాధి హామీ పనులు జరుగుతుండగా పునరావాస కాలనీలో ఉంటున్న నిర్వాసితులకు ఎటువంటి పనులూ కల్పించడం లేదు. వారికి ఇప్పటికిప్పుడు పనులు కల్పించే పరిస్థితి కూడా కనిపించడం లేదు.

స్థాన చలనంతో ఉపాధి పనులకు ఆటంకం



ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేస్తున్న మెట్టూరు పునరావాస కాలనీలోని నిర్వాసితులు

నిర్వాసితులకు చెల్లించని 'ఉపాధి' బకాయిలు


నిర్వాసితులను గ్రామాల నుంచి వెళ్లగొట్టినప్పటికీ గతంలో వారు చేసిన ఉపాధి పనులకు సబంధించి కూలి డబ్బులు చెల్లించలేదు. హిరమండలం, కొత్తూరు మండలాల నిర్వాసితులకు లక్షలాది రూపాయలు బకాయిలున్నట్టు సమాచారం. వీరికి బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో తెలియని పరిస్థితి ఉంది. హిరమండలం మండలం తులగాం, చిన్నకొల్లివలస గ్రామాలకు చెందిన 119 మంది కూలీలకు రూ.57 వేల చెల్లించాల్సి ఉంది. కొత్తూరు మండలానికి సంబంధించి బకాయిలపై వివరాలు సేకరిస్తున్నారు.

సాంకేతిక సమస్యలు

ఇలా నివాసముంటున్న వారంతా జాబ్‌కార్డుల్లో తమ సొంత మండలాల చిరునామాలే కలిగి ఉన్నారు. ఇది ప్రస్తుతం వారికి నష్టంగా పరిణమించింది. నిర్వాసితులకు హిరమండలం, కొత్తూరు, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి, ఆమదాలవలస మండలాల పరిధిలో 15 చోట్ల పునరావాస కాలనీలను ప్రభుత్వం కేటాయించింది. మండలం మారడంతో వారికి ప్రభుత్వం గతంలో జారీ చేసిన జాబ్ కార్డులు చెల్లుబాటు కావడం లేదు. హిరమండలం మండల నిర్వాసితులకు కొత్తూరు, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి, ఆమదాలవలస మండలాల్లోని పలు ప్రాంతాల్లో కాలనీలు కేటాయించారు. వీరంతా మండలం మారడంతో ఆ జాబ్‌కార్డుతో ఆయా మండలాల్లో ఉపాధి పనులు కల్పించేందుకు సాఫ్ట్‌వేర్ అనుమతించడం లేదు. దీంతో, వారికి కొత్తగా జాబ్ కార్డులను జారీ చేయాల్సి ఉంది. ప్రభుత్వం తీరుబడిగా ఇప్పుడు జాబ్‌కార్డుల జారీకి బృందాలను ఏర్పాటు చేసింది. జాబ్‌కార్డులు జారీ చేసినా అవి కొంతమందికే పరిమితం కానున్నాయి. నిర్వాసిత కాలనీల్లో నాల్గో వంతు కుటుంబాలు కూడా నివాసం ఉండటం లేదు. మిగిలిన కుటుంబాలు వివిధ మండలాల్లో అద్దెకు ఇల్లు తీసుకుని వేర్వేరు చోట్ల ఉంటున్నాయి. దీంతో ప్రస్తుతం వారికి కొత్తగా జాబ్‌కార్డులు జారీ అయ్యే అవకాశాలు కనిపించడం లేదు.

వంశధార రిజర్వాయర్ నిర్మాణం పేరుతో ప్రభుత్వం హడావుడిగా హిరమండలం, కొత్తూరు మండలాల్లోని నిర్వాసితుల ఇళ్లను కూల్చి వేసింది. వారిని బలవంతంగా గ్రామాల నుంచి తరలించింది. కేటాయించిన పునరావాస కాలనీల్లో ఇళ్లను నిర్మించుకునేందుకు సమయం కూడా ఇవ్వకపోవడంతో ఆర్థికంగా కాస్తా కూస్తో బాగున్న వారు అద్దెకు ఇళ్లు తీసుకుని ఉంటున్నారు. అద్దెలు చెల్లించుకునే స్తోమత లేనివారు పునరావాస కాలనీల్లో తమకు కేటాయించిన స్థలాల్లో కర్రలు, కంపలు, గుడ్డలతో గుడారాలు వేసుకుని నివాసముంటున్నారు.

బృందాలను ఏర్పాటు చేశాం



నిర్వాసితులు మండలం మారడంతో జాబ్ కార్డులు పనిచేయవు. వారికి కొత్తగా జాబ్ కార్డులు జారీ చేసేందుకు ఎపిఒ, డిప్యూటీ తహశీల్దార్, కంప్యూ టర్ ఆపరేటర్‌ను బృందంగా నియమించాం. నిర్వాసితులకు పనుల కల్పన, బకాయిల చెల్లింపు వంటి సమస్యలను వారు గుర్తిస్తారు. మా పరిధిలో ఉన్న సమస్యలను మేం పరిష్కరిస్తాం. సాంకేతికపరమైన ఇబ్బందులు తలెత్తితే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాం.

– హెచ్.కూర్మారావు,
డ్వామా పీడీ, శ్రీకాకుళం జిల్లా



బెజవాడ రైల్వే స్టేషన్‌లో భద్రత డొల్ల

- దశాబ్దమైనా అమలుకు నోచని ఇంటిగ్రేటెడ్ సెక్యూరిటీ సిస్టమ్
- పార్శిల్స్ తనిఖీకి అందుబాటులో లేని స్కానర్లు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి

భద్రతా పరంగా ఎంతో కీలకమైన బెజవాడ రైల్వే స్టేషన్‌లో భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో తిరుపతి, విజయవాడ రైల్వే స్టేషన్లకు అప్పట్లో తీవ్రవాదుల దాడులు ఉండవచ్చనే హెచ్చరికలందాయి. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్టులకు రక్షణ కల్పిస్తున్న తరహాలో ఇంటిగ్రేటెడ్ సెక్యూరిటీస్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని రైల్వే బోర్డు భావించింది. ప్రత్యేక బలగాలు పహారా కాసే విధంగా సెక్యూరిటీని ఏర్పాటు చేయాలని భావించినా నేటికీ ఆ వ్యవస్థ ఏర్పాటు కాలేదు. రైల్వే జంక్షన్‌లో అతిపెద్దదైన విజయవాడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణీకుల భద్రత కల్పించే విషయంలో రైల్వే శాఖెందుకో మీనమేషాలు లెక్కిస్తోందనే విమర్శలున్నాయి. రాష్ట్రంలో ఎటు నుంచి ఎటు వెళ్లినా విజయవాడ జంక్షన్ మీదుగా రైల్వే రాకపోకలు సాగించే వాహనాల సంఖ్య అధికం. భద్రతాపరంగా ఈ రైల్వే స్టేషన్ ఎంతో కీలకం. సెక్యూరిటీ విభాగంలో ఎంతో కీలకంగా వ్యవహరించే సిసిటివి కెమెరాలు సరిపడిన స్థాయిలో లేవు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా అసాంఘిక శక్తుల కదలికలను గమనించేందుకు 55 సిసిటివి కెమెరాలు ఉపయోగిస్తున్నారు. మరో 120 కెమెరాలు నిర్భయ ఫండ్ ద్వారా టెలికం డిపార్టుమెంట్ మరో రెండు నెలల్లో అమర్చే అవకాశాలున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. రైల్వే ప్రయాణంలో భద్రత పరంగా ఎంతో కీలకమైనది పార్శిల్ విభాగం. నిత్యం వందలాది ప్యాకింగ్ పార్శిల్స్ విజయవాడ నుంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. పార్శిల్‌లో మార్కెటింగ్ వస్తువా లేక అసాంఘిక శక్తులు ఇంకేదైనా వస్తువులను పంపుతున్నారో తెలుసుకునే అవకాశం లేదు. ఇంతటి కీలకమైన పార్శిల్ విభాగంలో ప్యాకింగ్ విభాగం లోపల ఏ వస్తువు ఉందని కనిపెట్టే ఎక్స్‌రే బ్యాగ్ గేజ్ స్కానర్, పార్శిల్ స్కానర్‌లు లేక పోవడం భద్రతా పరంగా పెద్ద లోపంగా పలువురు పేర్కొంటున్నారు. నిత్యం వేలాది మంది ప్రయాణీకులు విజయవాడ నుంచి హైదరాబాద్, విశాఖ, ఒరిస్సా, చెన్నై తదితర ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద డోర్ మెటల్ డిటెక్టర్స్ సరిపడా లేవు. రాజధాని అమరావతి నేపథ్యంలో రైల్వే భద్రతాపరంగా ఎంతో కీలకం. సంక్రాంతి, రిపబ్లిక్ డే ఉత్సవాలతోపాటు ప్రత్యేక అథిధులు రాకపోకల నేపథ్యంలో అదనపు బలగాలను తాత్కాలికంగా ఏర్పాటు చేయడం మినహా శాశ్వత భద్రత విషయంలో రైల్వే బోర్డు నిర్ణయాలను అమలు చేయడంలో తాత్సారం స్పష్టంగా కనిపిస్తోంది.



శ్రీకాకుళం జిల్లా కొత్తూరులో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ సాగునీరు

రవాణా శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కొత్తూరు (శ్రీకాకుళం జిల్లా)

రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ సాగునీరు అందిస్తామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలంలో నాబార్డు నిధులు రూ.20 కోట్లతో చేపట్టిన మాతల– కడుం ఎత్తిపోతల పథకానికి శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం కడుంలో నిర్వహించిన బహిరంగసభలో మంత్రి మాట్లాడారు. మూడున్నరేళ్లలో టిడిపి ఇరిగేషన్ శాఖ ద్వారా రూ.52 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. అన్ని ప్రాజెక్టులూ పూర్తి చేస్తామని చెప్పారు. ఎత్తిపోతల పథకం ద్వారా 2,300 ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. మరో 20 ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేస్తామన్నారు. శ్రీకాకుళం ఎంపి కె.రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ కొత్తూరు మండల అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ కె.ధనంజయరెడ్డి, ఇరిగేషన్ జెఎండి వెంకటేశ్వరరావు, టిడిపి జిల్లా అధ్యక్షులు గౌతు శిరీష, తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ టెక్నాలజీతో సమస్యలకు పరిష్కారం

అంతర్జాతీయ సదస్సులో డాక్టర్ సబిల్ కెల్ఫీ

ప్రజాశక్తి-పెనమలూరు (విజయవాడ)

ప్రస్తుత సమాజంలో కంప్యూటింగ్ ముఖ్య పాత్ర పోషిస్తుందని, సూక్ష్మ టెక్నాలజీలను ఉపయోగిస్తే ఎన్నో సమస్యలకు సమాధానం లభిస్తుందని సీనియర్ ఎడిటర్, మెనప్రోగ్రామ్ స్పిన్‌గర్ డాక్టర్ సబిల్ కెల్ఫీ అన్నారు. విజయవాడ కానూరులోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన స్మార్ట్ కంప్యూటింగ్ అండ్ ఇన్ఫర్మేషన్ (ఎస్‌సిఐ) అంతర్జాతీయ సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. సెల్‌ఫోన్, మెకానికల్, విద్యుత్ రంగాలలో స్మార్ట్ కంప్యూటింగ్‌ను ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. చెక్ రిపబ్లిక్‌కు చెందిన డాక్టర్ రోమన్ సేన్కిరిక్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ ఎన్నో ఆలోచనలు వస్తాయని, వాటిని అభివృద్ధి చేసేందుకు ఇలాంటి సదస్సులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఫ్యాకల్టీ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ (మలేషియా) వర్సిటీకి చెందిన డాక్టర్ నయీమ్ హనుష్ మాట్లాడుతూ.. ఓ ఐడియాను అభివృద్ధి చేయాలంటే ముందు మ్యాథమేటికల్ మోడల్‌ను అభివృద్ధి చేయాలని, తద్వారా ఒక క్రమ పద్ధతిలో రీసెర్చ్ ముందుకు వెళ్తుందని అన్నారు. ట్రిపుల్ ఐటి కాంచీపురం డైరెక్టర్ డాక్టర్ బి.మాజి ప్రసంగిస్తూ.. స్మార్ట్ కంప్యూటింగ్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించి ట్రాఫిక్ రద్దీ లేకుండా చూడటం, ప్రమాదకర ప్రదేశాలను ముందు గుర్తించి వాటిని నివారించొచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇఇఇ, ఐఐటి (ఢిల్లీ) ప్రొఫెసర్ పాణిగ్రహి, కెఇఎస్ ఇంటర్నేషనల్ ఫౌండర్, యుకె డాక్టర్ లక్ష్మిజైన్, కళాశాల కన్వీనర్ బోయపాటి శ్రీరాములు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శివాజీబాబు, విఆర్ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎవి.రత్నప్రసాద్ పాల్గొన్నారు.



అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న వివిధ దేశాల ప్రతినిధులు

అలవాట్ల మార్పుతోనే సంపూర్ణ ఆరోగ్యం

కలెక్టర్ కె.ధనంజయరెడ్డి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల (శ్రీకాకుళం)

రోజువారీ అలవాట్లలో మార్పుతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ ధనుంజయరెడ్డి అన్నారు. 'గాలి, నీరు, ఆరోగ్యం – ప్రవర్తనలు, విధానాలు ' అనే అంశంపై ఒక రోజు జాతీయ సదస్సును శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో శనివారం నిర్వహించారు. వ ర్సిటీ బయో టెక్నాలజీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన సదస్సులో కలెక్టర్ కె.ధనంజయరెడ్డి మాట్లాడుతూ చేతుల పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్డు వినియోగంపై ప్రజల్లో నేటికీ పూర్తిస్థాయిలో చైతన్యం రాలేదన్నారు. జిల్లాలోని 2.30 లక్షల మరుగుదొడ్లు లేవన్నారు. ఈ కుటుంబాలన్నీ బహిరంగ మలవిసర్జనకు వెళుతున్నాయని తెలిపారు. దీనివల్ల పరిసరాలు, గాలి, నీరు కలుషితమై అనారోగ్యాలకు కారణమవుతాయన్నారు



సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి , డిప్యూటీ సిఎం చినరాజప్ప

24 గంటల విద్యుత్ సరఫరా

విద్యుత్ శాఖ మంత్రి కళా వెంకట్రావు

ప్రజాశక్తి - అయినవిల్లి (తూర్పుగోదావరి)

రాష్ట్రంలో 24 గంటల పాటు విద్యుత్‌ను సరఫరా చేస్తోంది టిడిపి ప్రభుత్వం మాత్రమేనని విద్యుత్ శాఖ మంత్రి కిమిడి కళావెంకట్రావు పేర్కొన్నారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా అయినవిల్లి మండలం ఎస్.మూలపొలంలో రూ.1.80 కోట్లతో ఏర్పాటు చేసిన 33కెవి విద్యుత్ సబ్–స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎంఎల్‌ఎ పులపర్తి నారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. విభజన అనంతరం రాష్ట్రంలో 25.2 మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటు ఉండేదన్నారు. వాటిని అధిగమించి నేడు విద్యుత్ సరఫరాను నిరాటంకంగా అందిస్తున్నామన్నారు. ఆక్వా రైతులకు ఒక యూనిట్‌కు రూ.1.50 కరెంటు సబ్సిడీ అందిస్తున్నామన్నారు. కడియంలోని నర్సరీ రైతులుకూ ఈ సబ్సిడీ అందిస్తామని తెలిపారు. అనంతరం ఎస్.మూలపొలంలో నందమూరి తారక రామారావు ఉద్యానవన పార్కును ఉపముఖ్యమంత్రి చిన్నరాజప్పతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రోగ్రామ్ కమిటీ అధ్యక్షులు వివి.చౌదరి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, టిడిపి జిల్లా అధ్యక్షులు నామన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎసిబి నూతన కార్యాలయం ప్రారంభం

ముగ్గురు మంత్రులు హాజరు

ప్రజాశక్తి - నెల్లూరు సిటీ

నెల్లూరులోని మూలాపేట వద్ద రూ.95 లక్షలతో నిర్మించిన అవినీతి నిరోధక శాఖ భవనాన్ని శనివారం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అమర్‌నాథ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి లేని సమాజ స్థాపనకు అన్ని వర్గాల సమష్టి సహకారం అవసరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అవినీతి నిరోధక శాఖ భవనాల నిర్మాణానికి రూ.16కోట్లు మంజూరు చేశారని తెలిపారు. త్వరలో నెల్లూరులో నూతన ఎసిబి కోర్టు నిర్మించాలని నిర్ణయించుకున్నామన్నారు. సుపరిపాలన కొనసాగాలంటే అవినీతి రహిత సమాజం నిర్మించాలని, దానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ మాట్లాడుతూ ఇప్పటి వరకు రాష్ట్రంలో నాలుగు భవనాలు నిర్మించారని, దీనిలో అనిశా డైరెక్టర్ జనరల్ ఆర్‌పి ఠాకూర్ కృషి ఉందని తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాపితంగా అవినీతి కేసులు తగ్గాలని అభిలషించారు. అవినీతి వల్ల పేద ప్రజలు నష్టపోకూడదని, అందుకు ప్రజలందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, ఎస్‌పి రామకృష్ణ, మేయర్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి కె.వి.రాజేంద్రప్రసాద్, ఎసిబి అడిషనల్ డిజి హరికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కరెంటు తీగలు తగిలి చిరుత మృతి

ప్రజాశక్తి - కడప

కాశినాయన మండలంలో ఓ చిరుత పులి కరెంటు తగిలి చనిపోయింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక రైతులు తమ పంటను కాపాడుకునే ఉద్దేశంతో పొలం చుట్టూ కరెంటు తీగలు అమర్చారు. అనుకోని విధంగా చిరుతకు కరెంటు తగిలి చనిపోయింది. దీన్ని గమనించి పొలం రైతులు చిరుత నుంచి గోర్లను సేకరించి..అనంతరం పూడ్చివేశారు. ఈ సమాచారం ఫారెస్ట్ అధికారులకు తెలియడంతో రైతులను అదుపులోకి తీసుకున్నారు. చిరుత మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఇంటర్వ్యూ

సిపిఎం రాష్ట్ర మహాసభలకు 50 వేల మంది

'పశ్చిమ' అప్‌ల్యాండ్ జిల్లా కార్యదర్శి చింతకాయల బాబూరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వచ్చేనెల 10, 11, 12 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరగనున్న సిపిఎం 25వ రాష్ట్ర మహాసభలకు పశ్చిమగోదావరి అప్‌ల్యాండ్ జిల్లా నుంచి 50 వేల మంది హాజరవుతున్నట్లు పార్టీ జిల్లా అప్‌ల్యాండ్ కార్యదర్శి చింతకాయల బాబూరావు తెలిపారు. మహాసభల ప్రచారం, జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, సాగించిన పోరాటాలు తదితర అంశాలపై ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు.

ప్ర: రాష్ట్ర మహాసభలు జిల్లాలో నిర్వహించడంపై మీ అభిప్రాయం ఏమిటి?

జ : సిపిఎం ఏర్పడిన తర్వాత రాష్ట్ర మహాసభలు మొదటిసారిగా జిల్లాలో జరుగుతున్నాయి. ఉత్తేజంగా, ఉత్సాహంగా ఈ మహాసభలు నిర్వహించేందుకు జిల్లాలోని కార్యకర్తలు, వివిధ ప్రజాసంఘాల నాయకులు ఉత్సాహంగా ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు పాల్గొంటున్నారు. రానున్నకాలంలో మరింత పెద్దఎత్తున పార్టీ ఉద్యమాల ఎదుగుదలకు, ప్రజా సంఘాల, ఉద్యమాల పెంపుదలకు ఈ మహాసభలు ఉపయోగపడతాయి.

ప్ర : అప్‌ల్యాండ్ పరిధిలో మహాసభల ప్రచారం ఎలా సాగుతుంది?

జ: నెల రోజులుగా అప్‌ల్యాండ్‌లోని వివిధ ప్రాంతాల్లో సదస్సులు జరుగుతున్నాయి. మహాసభలకు సహకరించమని లక్షకు పైగా ఇళ్లను విరాళాల కోసం సందర్శించడం జరిగింది. కరపత్రాల ద్వారా మహాసభల విశేషాలను ప్రజలకు వివరిస్తున్నాం. అలాగే కార్మికులు, కౌలురైతులు, రైతులు, వ్యవసాయ కార్మికుల వద్దకు వెళ్లి మహాసభల విశిష్టతను తెలియజేస్తున్నాం.

ప్ర: ప్రచారం సందర్భంగా ప్రజల నుంచి ఎలాంటి స్పందన ఉంది?

జ: జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ, వామపక్ష ఉద్యమ శ్రేయోభిలాషుల నుంచి మంచి సహకారం, ఆదరణ లభిస్తోంది. వీరే కాకుండా ఏ రాజకీయపక్షాలకూ సంబంధం లేనివారు కూడా రాష్ట్ర రాజకీయాలు సజావుగా సాగాలంటే, ప్రజలకు ఉపయోగపడే దిశగా ఉండాలంటే సిపిఎం రాజకీయ విధానం సరైనదని ఆకాంక్షించి మహాసభలు జయప్రదం చేయాలని పెద్దఎత్తున సహకారం అందిస్తున్నారు.



ప్ర : ప్రచారంలో ప్రజా సమస్యల గురించి ప్రస్తావిస్తున్నారా?

జ: అప్‌ల్యాండ్‌లో మూడు ప్రధానమైన సమ్యలున్నాయి. పోలవరం, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, క్కునూరు, వేలేరుపాడు ప్రాంతాల్లో పోలవరం నిర్వాసితుల సమస్య తీవ్రమైంది. ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం చూపిస్తున్న శ్రద్ధ నిర్వాసితుల సమస్యలపై లేదు. అలాగే కౌలురైతుల, రైతుల సమస్యలు అనేకం ఉన్నాయి. టమోటా రైతులతో పాటు పొగాకు, చెరకు రైతులకు సకాలంలో చేతికి డబ్బురాక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే దళితుల, కార్మికుల సమస్యల గురించి కూడా ప్రచారంలో ప్రజలకు వివరిస్తున్నాం.

ప్ర: ఈ కాలంలో మీ పరిధిలో జరిగిన ముఖ్య పోరాటాలేమిటి?

జ: అప్‌ల్యాండ్ ఏరియాలో నిర్వాసితుల సమస్య ప్రధానంగా ఉంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ముందుగానే నిర్వాసితులకు న్యాయం చేయాలని, ఇళ్లకు, నష్టపరిహారమివ్వాలని, యువతను ఆదుకోవాలని పెద్దఎత్తున పోరాటం చేస్తూ సిపిఎం నిర్వాసితులకు అండగా నిలిచాము. కౌలు రైతుల గిట్టుబాటు ధర విషయంలోనూ, రోడ్డు విస్తరణకు భూసేకరణ విషయంలోనూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పోరాటాలు చేస్తున్నాం. కార్మికుల హక్కుల, వేతనాల కోసం పోరాటాలు సాగిస్తున్నాం. ముఖ్యమంత్రి వివిధ అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం జిల్లాకు వచ్చినప్పుడు సిపిఎం నాయకులను నిర్బంధాలకు, అరెస్టులకు పాల్పడుతున్నారు.

ప్ర : మీ జిల్లా పరిధిలోని అంశాలు చర్చకు పెట్టబోతున్నారా?

జ: మహాసభల్లో రాష్ట్రానికి సంబంధించిన కార్మికుల, దళితుల, గిరిజనుల, పేదల, రైతుల, వ్యవసాయ కార్మికుల సమస్యలను చర్చించబోతున్నాం. జిల్లాకు సంబంధించిన తుందుర్రు, గరగపర్రు, సమస్యలపై చర్చించబోతున్నాం. అప్‌ల్యాండ్‌కు సంబంధించి పోలవరం, నిర్వాసితుల సమస్యలపై రైతుల గిట్టుబాటు ధరలు, కార్మికుల కనీస వేతనాలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై మహాసభల్లో చర్చకు పెట్టి కార్యాచరణ రూపొందించి రానున్న మూడేళ్లలో పెద్దఎత్తున ఉద్యమాలు చేసేందుకు సమాయత్తమవుతాం.

ప్ర: పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని గుడ్డిగా వ్యతిరేకిస్తున్నారన్న విమర్శపై మీ సమాధానం?

జ: పోలవరం నిర్మాణం అత్యంత ఆవశ్యకమైంది. తప్పనిసరిగా నిర్మించి తీరాల్సిందే. రాష్ట్ర అభివృద్ధికి పోలవరం ఎంత అవసరమో రెండు లక్షల మంది నిర్వాసితుల గురించి పట్టించుకోవడం కూడా అంతే అవసరం. పోలవరం త్వరగా పూర్తిచేయాలని, కేంద్ర ప్రభుతం నుంచి నిధులు రాబట్టేందుకు తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని ముందుకు వెళ్లాలి. దానికి ముందు ప్రభుత్వం చట్టప్రకారం నిర్వాసితుల సమస్యలు కూడా పరిష్కరించాలి. వారిని నిలువునా ముంచేసి ప్రాజెక్టులు కట్టడం సరైంది కాదు. నిర్వాసితుల సమస్యలను ముందుగా పరిష్కరించాలని కోరుతున్నాం తప్ప ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదు.

ప్ర: మహాసభలకు మీ పరిధిలో జన సమీకరణ ఎలా ఉండబోతోంది.?

జ: ఈ మహాసభలకు అప్‌ల్యాండ్ ఏరియాలో పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, కొవ్వూరు, తాళ్లపూడి నుండి పెద్దఎత్తున జనాలు రావడానికి సిద్ధంగా ఉన్నారు. 26 మండలాలు, మూడు మున్సిపాలిటీల్లో ఇప్పటికే వాహనాలను సమకూర్చుకుంటున్నారు. మొత్తం 50 వేల మంది ఈ మహాసభకు తరలించాలని లక్ష్యంగా సదస్సులు నిర్వహించాము.

సంపాదకీయం

పుస్తక పఠనం

పుస్తకం...కొన్ని పుటల జోడింపో, కొన్ని పదాల పోహళింపో, కొన్ని అక్షరాల మేళవింపో కాదు. అది చరిత్రను, వర్తమానాన్ని తనలో నిక్షిప్తం చేస్తున్న విజ్ఞాన భాండాగారం. గత చరిత్రను సజీవంగా మన ముందుంచే జ్ఞాపిక. విజ్ఞానాన్ని అందించే దీపిక. సమాజ పురోగతికి దారి చూపే దివిటీ. అక్షరాలకూ, భావాలకూ, సమాజ రథచక్రాలకూ, చరిత్ర ఆవిర్భావానికి పుస్తకమే వజ్రాయుధం. పుస్తకం సృష్టించిన విప్లవం, మానవ సమాజంపై దాని ప్రభావం అంత ఇంతా కాదు. గ్రీక్ తత్వవేత్తలైన సోక్రటీస్, ప్లేటో, అరిస్టాటిల్ ఆలోచనలు పుస్తకాలలో నిక్షిప్తమై ప్రపంచానికి తర్కాన్ని నేర్పాయి. లాటిన్ రచయితలు సిసిరో, డాంటేల సాహిత్యం ప్రపంచ ప్రజల ఆలోచనలను ప్రభావితం చేశాయి. షేక్‌స్పియర్, జాన్ మిల్టన్, నుండి చార్లెస్ డికెన్స్ వరకు ఆంగ్ల రచయితల సాహిత్యం ప్రపంచాన్ని ఉర్రూతలూగించింది. పుస్తక రూపంలో ప్రపంచానికి అందించిన గొప్ప విజ్ఞానం చార్లెస్ డార్విన్ రాసిన 'జాతుల ఆవిర్భావం'. ఫ్రెంచి రచయిత రూసో రాసిన 'ది సోషల్ కాంట్రాక్ట్' గ్రంథమైతే ఏకంగా ఫ్రెంచి విప్లవానికి మార్గ నిర్దేశనం చేసింది. జర్మన్ తత్వవేత్త కారల్ మార్క్స్ తన 'పెట్టుబడి' గ్రంథం ద్వారా 20వ శతాబ్దపు ప్రపంచ గమనాన్నే ప్రభావితం చేయగలిగాడు. ప్రముఖ రష్యన్ రచయిత మ్యాక్సిం గోర్కి రాసిన 'అమ్మ' ప్రపంచానికి పోరాటం నేర్పిన నవల. టాల్‌స్టాయ్ రచించిన 'వార్ అండ్ పీస్' ఒక లిటరరీ క్లాసిక్. టాగూర్ 'గీతాంజలి'... దేశానికి అత్యంత ప్రతిష్టాత్మకమైన నోబెల్ పురస్కారాన్ని అందించింది. గురజాడ, చలం, శరత్‌చంద్ర, శ్రీశ్రీ, ప్రేమ్‌చంద్, బుచ్చిబాబు వంటి గొప్ప రచయితల పుస్తకాలు సమాజానికి దిక్సూచీలయ్యాయి. ప్రజల్లో ఆధునిక సహేతుక భావనలను విస్తరించడంలో పుస్తక పఠనం పాత్ర కీలకమైంది. మానవాళిలో చైతన్యం రగిలించి అభివృద్ధి వైపు నడిపించే శక్తి మంచి పుస్తకాలకుంది.

పుస్తక పఠనం వల్ల వ్యక్తుల మానసిక పరిధి విస్తరిస్తుందని అనేక పరిశోధనలు తెలియజేస్తున్నాయి. బ్రిటన్‌లోని నేషనల్ లిటరసీ ట్రస్ట్ (ఎన్ఎల్‌టి) తాజా అధ్యయనం మరోసారి పుస్తక పఠన విలువను ప్రపంచానికి చాటింది. పుస్తకాలు చదివే అలవాటు ఉన్న టీనేజర్లకు, లేని టీనేజర్లకు మధ్య వ్యత్యాసాలను అధ్యయనం చేసింది. పుస్తకాలు చదవని వారికంటే... చదివే వారే లోకజ్ఞానంతో పాటు, రకరకాల సామర్థ్యాలలోనూ మెరుగైన ప్రతిభను కనబరుస్తున్నారని ఈ అధ్యయనం వెల్లడించింది. సాధారణంగా మనకు సెలవులొస్తే ఊర్లకు... టూర్లకు వెళుతుంటాం. అదే అమెరికాలో అయితే... కుటుంబ సమేతంగా గ్రంథాలయాలకు వెళతారు. పిల్లలతో సహా పుస్తకాలు చదువుతారు. చదవడం అలవాటు చేస్తారు. ఈ సెలవుల్లో ఇన్ని పుస్తకాలు చదివామని చెప్పుకోవడం అక్కడి గొప్ప. ఆంగ్ల బోధనలో భాగంగా అక్కడ పుస్తక పఠనం ఒక పాఠ్యాంశం. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. పుస్తక రచయితలను విద్యాలయాలకు ఆహ్వానించి పిల్లలతో ముఖాముఖి ఏర్పాటు చేస్తారు. ఇలా చేయడం వల్ల అక్కడి పిల్లలకు విద్యార్థి దశలోనే సృజనాత్మకత అలవడుతుంది. భావవ్యక్తీకరణ సామర్థ్యం పెరుగుతుంది. పండుగలు, పుట్టినరోజులు వంటి ప్రత్యేక సందర్భాల్లో పుస్తకాలను బహుమతిగా ఇచ్చే సంప్రదాయం అక్కడుంది. అమెరికాలో ప్రతి ఇంట్లోనూ బాల సాహిత్యం పుస్తకాలుంటాయని ఒక సర్వేలో తేలింది. కొత్త పుస్తకం విడుదల అవుతోందంటే బారులు తీరి కొనే ప్రజలు అక్కడుంటారు. ఆన్‌లైన్‌లో ముందుగానే బుక్ చేసుకొనే వారూ అధికమే. ప్రతి విషయానికీ అమెరికా వైపు చూసే మనం ఈ విషయంలో మాత్రం అమెరికాను అనుకరించం. బాల్యంలోనే పుస్తక పఠనం అలవాటైతే, అది ఎప్పటికీ వాడిపోని... వీడిపోని సుమ గంధమే.

జనవరి 1 నుంచి 11వ తేదీ వరకూ '28వ పుస్తక మహోత్సవం' విజయవాడలో జరిగింది. జనవరి 18 నుంచి 28 వరకు పదిరోజుల పాటు 'జాతీయ పుస్తక మహోత్సవం' హైదరాబాద్‌లో జరుగుతున్నది. ఒకప్పుడు ఒకటి రెండు నగరాలకే పరిమితమైన పుస్తక మహోత్సవాలు నేడు అనేక నగరాలు, పట్టణాల్లో కూడా జరుగుతున్నాయి. భవిష్యత్తరానికి సాహిత్య వారసత్వాన్ని అందించే వారధులు ఈ పుస్తక మహోత్సవాలు. చరిత్ర, కథ, కవిత్వం, నవల, బాల సాహిత్యం, వ్యక్తిత్వ వికాసం, పోటీ పరీక్షల సాహిత్యం ఇలా వేర్వేరు ప్రక్రియలకు చెందిన సాహిత్యం ఈ రూపంలో ప్రజల ముందుకొస్తోంది. 'చిరిగిన చొక్కా అయిన తొడుక్కో... కాని ఒక మంచి పుస్తకం కొనుక్కో' అని కందుకూరి వారు చెప్పినట్లుగా మంచి పుస్తకాన్ని కొందాం. పుస్తకాన్ని బ్రతికించు కొందాం. భాషపై మమకారం పెరగాలంటే సాహిత్యం చదవాలి. సాహిత్యం అంటే అక్షరాలో, ఉపమానాలో కాదు. ఆయా కాలాల్లో దాఖలించిన సత్యాలు. నిన్నటి గురించి తెలియకపోతే ఈరోజు అర్థం కాదు. ఈరోజు అర్థం కాకపోతే, భవిష్యత్తు శూన్యం. అందుకే పుస్తకాలంటే తరతరాల వంతెన. నత్తకు నడకలో వేగం లేకపోవచ్చు. కానీ... గమ్యం చేరాలన్న తపన ఉంటుంది. ఒక్క ఉదుటున గెంతలేకపోవచ్చు. కానీ... చిన్నచిన్న అడుగుల్నే శక్తివంతంగా వేస్తుంది. విజయం కంటే ప్రయత్నం గొప్పది. అందుకే... చదవడానికి ప్రయత్నించు. ఆ నడక చిన్నగానే ప్రారంభించు... ఆనక ఆకాశమంత ఎదుగు.

ఇది విషయం




ఉన్మాదం తలకు చేరి
ఊగుతున్న ఛాందసం...
కర్ణిసేన ముసుగులో
హింసకు దుస్సాహసం!

కాషాయాన్నడ్డుపెట్టి
వాస్తవాల్ని దాచలేరు...
దాడులతో రచ్చ చేసి
చరిత్రను మార్చలేరు!

- కొల్లూరు వెంకట్

కట్టు కథలు ఛేదిస్తూ కమ్యూనిస్టు ప్రస్థానం

వివరణ



తెలకపల్లి రవి

రాజకీయ పార్టీలంటే మరీ ముఖ్యంగా మన దేశంలో అధినాయకులూ వారి వారస రత్నాలేనన్నది అనధికార సూత్రంగా స్థిరపడిపోయింది. నానా హంగామాతో సభలూ సంరంభాలు జరిపి చివరకు తుది నిర్ణయం తీసుకునే అధికారం అధ్యక్షుడికి అప్పగిస్తూ తీర్మానిస్తారు. నరేంద్ర మోడీ, రాహుల్ గాంధీ, చంద్రబాబు, కెసిఆర్, నవీన్ పట్నాయక్, లాలూ ప్రసాద్ యాదవ్, నితీష్ కుమార్, మమతా బెనర్జీ – ఇలా ఏ పార్టీలోలైనా సరే వారి మాటే వేద వాక్కు. తమాషా ఏమంటే ఇలాంటివన్నీ వదిలేసి కమ్యూనిస్టు పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం లేదని అవాస్తవ ప్రచారం చేస్తుంటారు. అఖిల భారత స్థాయి నుంచి గ్రామ శాఖ వరకూ అందరూ కూర్చుని చర్చించి విధానాలు రూపొందించే, ఉద్యమాలు సాగించే కమ్యూనిస్టు సమిష్టి క్రమాన్ని ఈ బాపతు విమర్శకులు కప్పిపుచ్చు తుంటారు. అవకాశ వాద రాజకీయాలతో రాజకీయార్థిక సామాజికాంశాలలో దాదాపు ఒకే విధానాలు కొనసాగించే పాలక వర్గ పార్టీలకు, వారి వత్తాసు దార్లకు అవగాహన లేని కుహనా మేధావులకు నిజమైన ప్రత్యామ్నాయానికై కృషి చేసే కమ్యూనిస్టులంటే మాత్రం పడదు. అన్ని రకాల కమ్యూనిస్టు వ్యతిరేకులూ వారికి ఎప్పుడు సమస్యలు ఎదురవుతాయా అని పొంచి కూచుని వుంటారు. ఏదో పేరిట గోరంతను కొండంతలు చేసి ఘోరమేదో జరిగిపోయిందని గగ్గోలు పెట్టేస్తారు. ఏప్రిల్‌లో హైదరాబాదులో జరగ బోయే 22వ అఖిల భారత మహాసభల కోసం సిపిఎం కేంద్ర కమిటీ రూపొందించిన ముసాయిదాపై నడుస్తున్నది అలాంటి తంతే. సిపిఎం ప్రకంపించి పోతున్నట్టు విభేదాలు చీలికకు దారితీయనున్నట్టు బడా మీడియా హోరెత్తిస్తున్నది. మతతత్వ బిజెపిని అధికారం లోకి దింపాలని లౌకిక శక్తులను కలుపుకుని పోరాడాలని సిపిఎం ఏకాభిప్రాయంతో వుంది. కాంగ్రెస్‌తో ఎలాంటి ఎన్నికల పొత్తుకు అవకాశం లేదని స్పష్టంగా చెప్పాలని మెజార్టీ నిర్ణయం తీసుకుంది. దీన్ని శాఖలు చర్చించి సూచనలు చేసిన తర్వాత–మహాసభ అంతిమ నిర్ణయం తీసుకుంటుంది. ఇంతలోనే హాలాహలం పొగచూరినట్టు కోలాహలం చేస్తున్నారంటే రాజకీయ దురుద్దేశంతోనే అన్నది స్పష్టం.

ఎప్పుడైనా సరే చర్చల క్రమంలో భిన్న ప్రతిపాదనలూ పత్రాలు చర్చకు రావచ్చు. ఈ సందర్భంలో ప్రధాన కార్యదర్శిగా సీతారాం ఏచూరి ప్రతిపాదించిన ముసాయి దాను గాక మరో దాన్ని కమిటీ మెజార్టీ ఆమోదించి వుండొచ్చు. తన విధానం వీగిపోయింది గనక ప్రధాన బాధ్యతలో కొనసాగడం సమంజసం కాదని ఏచూరి అనీ వుండొచ్చు. అన్నానని చెప్పారు కూడా. అయితే మహాసభ లోపలే తప్పుకోవడం మంచి సంకేతం కాదనీ, అక్కడ తుది నిర్ణయం తీసుకోవాలి గనక ఆలోగా తప్పుకోవాల్సిన పని లేదని మిగిలిన పొలిట్‌బ్యూరో సభ్యులు చెప్పిన మీదట ఆయనా కొనసాగారు. ఇందులో హుందాతనం, అంతర్గత ప్రజాస్వామ్యం తప్ప వ్యక్తిగతమైన విభేదాలు ఎక్కడ కనిపిస్తున్నాయి? ఏచూరి రాజీనామా చేస్తానన్నట్టు చెప్పారనీ, రాజీనామా మాట అనలేదని పూర్వ కార్యదర్శి ప్రకాశ్ కరత్ చెప్పారనీ దీన్ని బట్టి విభేదాలు బహిరంగ మైనాయని కొందరి వ్యాఖ్యానాలు హాస్యాస్పదం. ఏచూరి ఇంటర్వ్యూలో గాని, ప్రకాశ్ కరత్ వ్యాసంలో గాని దేంట్లోనూ రాజీనామా వాక్యం లేదు. ఇవి తమ ఇద్దరి వ్యక్తిగత విభేదాలుగా చూపడం సరికాదని కరత్ రాశారు. చర్చించి నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామిక పద్ధతి అని ఏచూరి వివరించారు. అయినా ఇష్టానుసార వ్యాఖ్యలతో కోడి గుడ్డుకు ఈకలు పీకినట్టు గందరగోళపర్చడం కొందరికి అవసరం, ఆనందం కూడా. వారి ఆనందంలో వారుండగా ఏచూరి హైదరాబాద్ వచ్చి బిఎల్ఎఫ్ ప్రారంభించి వెళ్లారు. ఎపిలో మధు తదితరులు పెదగొట్టిపాడు దళితుల సమస్యపై పోరాడుతున్నారు. ఇలాగే ఎక్కడివారక్కడ కర్తవ్యాలు నిర్వహిస్తున్నారే గాని సంక్షోభ మెక్కడ?

నిజానికి గత నలభై ఏళ్లుగా సిపిఎం మహాసభలకు ముందు ఏదో ఒక దుష్ప్రచారం చూడొచ్చు. 1977–78 మధ్య సుందరయ్య విధానపరమైన తేడాలతో వచ్చేస్తే చాలా వూహలు చేశారు. 1982లో విజయవాడలో 11వ మహాసభ మహాసభకు ముందు పత్రికల్లో దుమారం. 1979లో జనతా ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించ డంపై సభలో చీలిక వస్తుందని ఒకటే కథలు నడిచాయి. అప్పటి ప్రధాన కార్యదర్శి నంబూద్రిపాద్, పొలిట్ బ్యూరో సభ్యుడు మాకినేని బసవపున్నయ్యలను పత్రికా గోష్టుల్లో బెంగాల్, కేరళ విలేకరులు అదే పనిగా ఆ విషయమే అడుగుతుండేవారు. 'మీరే చూస్తారు కదా' అని వారు ఏడిపించేవారు. చివరకు మహాసభ జయప్రదంగా ముగిసింది. 1985 కోల్‌కతా మహాసభ నాటికి కేరళలో విభేదాలు చీలికకు దారితీస్తాయని కథలొచ్చాయి. ఆ సమస్యలు పరిష్కరించుకుని అధికారంలో కొనసాగుతున్నది. 1992లో మద్రాసు మహాసభలో సోవియట్ విచ్ఛిన్నానం తర పరిణామాలు తీవ్రంగా వుంటాయనే కథనాల మధ్య సైద్ధాంతిక తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. 1995లో చండీగఢ్‌లో జరిగిన సభల నాటికి అప్పుడున్న పీవీ ప్రభుత్వం పట్ల వైఖరిపై చాలా భేదాలు వస్తాయని వూహించారు. అక్కడి కాంగ్రెస్ ముఖ్యమంత్రి దర్బారా సింగ్



నాటి ప్రధాన కార్యదర్శి హరికిషన్ సింగ్ సూర్జిత్‌ను కలిసే పేరిట చెప్పా చేయకుండా సభా ప్రాంగణంలో చొరబడి మీడియాలో గజిబిజి పెంచడానికి తన వంతు ప్రయత్నం చేసినా సభపై ఆ ప్రభావమే పడలేదు. 1996లో ఇతర పార్టీలు జ్యోతిబాసును ప్రధాని పదవికి ఎంపిక చేస్తే కేంద్ర కమిటీ ఆమోదించకపోవడం, దాన్ని ఆయన ఆత్మకథలో చారిత్రిక తప్పిదం అని వర్ణించడం పెద్ద సంక్షోభం అవుతుందని ప్రచారం నడిచింది. కాని రెండేళ్ల తర్వాత ఆయన పాలించే కోల్‌కతాలోనే ఆయన, సూర్జిత్ సహా చాలా మంది పెద్దలు వ్యతిరేకించినా మహాసభ ప్రధాని పదవి నిరాకరణ సరైందని పునరుద్ఘాటించిందే తప్ప ఐక్యత దెబ్బతిన్నది లేదు. సుందరయ్య లాగే వారూ తర్వాత మరో దశాబ్దంపైగా సేవలందించారు కూడా. జాతీయంగా సూర్జిత్ కీలక పాత్ర భరించలేక ఆయనను రాజకీయ దళారీ అంటూ కించపర్చే వ్యాఖ్యలు చేసినా ఆ యోధుడు పట్టించుకున్నది లేదు. 1998–2004 మధ్య సాగిన బిజెపి ఎన్‌డిఎ పాలనను ఓడించి తొలి యుపిఎ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు బాధ్యతాయుతమైన మద్దతునే సిపిఎం వామపక్షాలు అందించాయి. అమెరికాతో అణు ఒప్పందం కారణంగా 2008లో ఆ మద్దతు ఉపసంహరించుకున్న ప్పుడు నాటి ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్‌పై రకరకాల కథనాలు చూశాం. ఆయన కరుడుగట్టిన సిద్ధాంతవాది అని అపహాస్యాలు చేశారు.

తార్కికంగా చెప్పాలంటే కరుడుకట్టిన కమ్యూనిస్టు వ్యతిరేకులే వుంటారు గాని మంచి ఆశయాలకు సంబంధిం చిన వారెవరైనా సరే కరుడుగట్టడమనే ప్రసక్తి వుండదు. కరుడుగట్టిన మానవతా వాది అనం. కుల మత జాతి ద్వేషం, అధికారమదం, మితిమీరిన స్వార్థం, కౌటిల్యం వంటి వాటితోనే మనుషులు కరుడుగట్టడం జరుగుతుంది. అలాగాక విముక్తి సాధనకు సమస్యల పరిష్కారానికి తమ కర్తవ్యమేదో ఆశయాలకు తగిన ఆచరణ ఏమిటో అధ్యయనంతో అన్వయంతో కమ్యూనిస్టులు నిర్ణయించుకుం టారు. అది ఆమూలాగ్రం అఖిల భారతం చర్చించి నిర్ణయించుకుంటారు. పార్టీలో చేరి మేము పరస్పరం సహకరించుకుంటూ అందరాని ఆకాశానికి అనంత నిశ్రేణులు నిర్మిస్తాం అని కవి మయకోవస్కీ అంటాడు. నాటి జ్యోతిబాసు నుంచి ఇప్పుడు సీతారాం ఏచూరి వరకూ ఎవరి అభిప్రాయాలు ఏమైనా నిర్దేశిత విధాన పథంలోనే అడుగేయడం దేశమంతా చూస్తున్నది. ఇప్పుడు కూడా ముసాయిదా విడుదలైనాక పార్టీ సభ్యులే గాక సానుభూతి పరులూ ఇతరులూ కూడా సూచనలు పంపే వెసులుబాటు వుంది. ప్రతిదానిపై వివరణ లభిస్తుంది. అదే అంతిమ విధానం. ప్రజాస్వామ్య సంవిధానం.

తప్పులైతే అందరూ చేస్తారు. త్యాగాలు మాత్రం కొందరే చేస్తారని రావిశాస్త్రి అన్నట్టు స్వార్థ రాజకీయాలు అందరూ చేస్తారు గాని ప్రజల కోసం పోరాడేది కమ్యూనిస్టులే. అది నిరంతర ప్రవాహం. ఆ క్రమంలో నిర్దిష్ట పరిస్థితిని అంచనావేసి నిర్దిష్ట విధానాలు నిర్వచించుకోవాలి. మోడీత్వ రగిలిస్తున్న (పెద్ద) హిందూత్వానలం ఒకవైపు, వారిని ఎదుర్కొనే పేరిట రాహుల్ గాంధీ చేపట్టిన చిన్న హిందూత్వ తొలి అడుగులు మరోవైపు– వారిరువురే గాక కమ్యూనిస్టేతర ప్రాంతీయ పార్టీలన్నీ అమలు చేసే సరళీకరణ గరళీకరణ ఇంకోవైపు. అంతర్జాతీయంగా ట్రంపోన్మాదం ఇంకా మరో వైపు.. విలువలు దిగజార్జే విత్త వినిమయ సంస్కృతి, జడలు విప్పిన మూఢత్వం, పదవీ లాలసతలే చుట్టూ తాండవిస్తున్నా ఇన్ని సంక్లిష్టతల మధ్య బెంగాల్ కోట కోల్పోయి బలం తగ్గిన నేపథ్యంలో సిపిఎం నిలదొక్కుకోవడం కర్తవ్యం నిర్వహిం చడం కత్తి మీద సామే. నిప్పులు చిమ్ముకుంటూ నింగికెగిరి పోయినప్పుడు నివ్వెరపోయిన వారు నెత్తురు కక్కుకుంటూ నేలకు రాలిపోతే నిర్దాక్షిణ్యంగా తోసిపారేద్దామనే చూస్తుంటారు. ఇప్పటికైతే (ఎన్నికల) బలం తగ్గింది గనక రాజకీయ వ్యతిరేకుల నుంచి రచయితలూ రచయిత్రుల వరకూ ఎవరైనా కమ్యూనిస్టులను అపహాస్యం చేయడం తేలికే. అయితే అవహేళనలూ అసత్య ప్రచారాలూ అమానుష నిర్బంధాలు అపజయాలూ నిజమైన కమ్యూనిస్టుల నిబద్ధతను కదిలించలేకపోయాయి. ఐక్యతను ఛేదించలేకపోయాయి. ఇప్పటి కట్టు కథలు కూడా గతంలో వాటిలాగే వీగిపోవడం అనివార్యం. 'పదండి ముందుకు పదండి దిద్దుకు' అంటూ ప్రజా ప్రస్థానం సాగిపోతుంటుంది తప్ప ఎర్ర జండా కాంతి తగ్గదు. అదే అరుణ శ్రేణుల అచంచల ఆశయబలం. ✦

సోషల్ మీడియా

మనిషి-దేవుడు



కాగితాన్ని కనిపెట్టిందెవరు?
'మనిషి'

నిప్పును కనిపెట్టిందెవరు?
'మనిషి'

వ్యవసాయాన్ని కనిపెట్టిందెవరు?
'మనిషి'

ఫోన్, మొబైల్ కనిపెట్టిందెవరు?
'మనిషి'

కార్లు, వాహనాలు కనిపెట్టిందెవరు?
'మనిషి'

ఈ సమాజాన్ని నిర్మించిందెవరు?
'మనిషి'

మతాలను, ధర్మాలను సృష్టించిందెవరు
'మనిషి'

మందిరం, మసీదు, చర్చి సృష్టించిందెవరు?
'మనిషి'

వీటిలో దేవున్ని ప్రతిష్టించిందెవరు ?
'మనిషి'

విచిత్రమైన విషయమేమిటంటే ప్రతి ఒక్కటీ
'మనిషి' సృష్టించాడు.

అయినప్పటికీ మనం దేవుడు చమత్కారాలు చేస్తాడని విశ్వసిస్తాం.

✦ మనిషి తప్ప ఏ ప్రాణీ భగవంతున్ని కోరికలు కోరదు.

✦ మనిషి నివాసం లేని చోట మందిరం గాని, మసీదు గాని, చర్చి గానీ లేవు. ఇతర గ్రహాలలో గానీ, మంచు ఖండంలో గానీ.

✦ వేరు వేరు దేశాలలో ప్రాంతాలలో వేరు వేరు దేవతలు, దీని అర్థం మనిషి ఊహలతో తన ఇష్టమైన రీతిలో భగవంతున్ని సృష్టించాడు.

✦ ప్రపంచంలో అనేక ధర్మాలు అనేక సాంప్రదాయాలు, అనేక పద్ధతులు ఒకర్నొకరు విమర్శించుకోవడాలు
దీని అర్థం దేవుడు ఒకరు కాదనేగా, అందరూ చెబుతారు దేవుడొక్కడే అని, కానీ కొసమెరుపు అది మా దేవుడే.

✦ ప్రశ్నించే వాన్ని నాస్తికుడనో, హృదయం లేని వాడనో ముద్ర వేయడం.

✦ ఇప్పటి వరకు నాకు దేవుడు కనిపించాడని చెప్పిన మనిషే లేడు. బుద్ధుడు, వివేకానందుల వారు కూడా కనపడే మనిషికే సేవ చెయ్యమన్నారు. ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా చివరకు కీర్తి కాంక్ష కూడా సుమా!

✦ భగవంతుడు ఎవరికీ మేలు చెయ్యట్లేదు అలా అని కీడు కూడా చెయ్యట్లేదు.

✦ దేవుడు లంచగొండితనం, అన్యాయం, దొంగతనం, బలాత్కారం, ఆటంకవాదం, అరాచకత్వాన్ని నిరోధించడం లేదు.

✦ మందిరాలు, మసీదులు, చర్చిలు కూల్చుతుంటే ఏ దేవుడూ వచ్చి ఆపలేదు.

✦ అభ్యాసం చేయకుండా ఏ ఒక్క విద్యార్థి అయినా ఉత్తీర్ణుడయ్యాడా?

✦ తానే దేవున్నని చెప్పుకునే వాల్లు చాలా మంది జైళ్లలో ఊచలు లెక్క పెడుతున్నారు.

✦ ఈ ప్రపంచంలో దేవుడే లేడని చెప్పేవాళ్లు చాలా మంది ఆనందంగా ఉన్నారు.

✦ హిందువులు అల్లాను స్వీకరించరు, ముస్లిములు హిందూ దేవతలను, క్రైస్తవులు హిందూ దేవతలను అల్లాహ్‌ను ఒప్పుకోరు. అయినప్పటికీ ఈ దేవతలంతా 'ఎందుకిలా?' అని ఎవర్నీ అడగలేదే?

కనుక ఆనందమే దైవం. ఆనందం ఎప్పుడు కలుగుతుందీ అంటే కనపడని దేవుని పేరుతో కోటాను కోట్ల వ్యాపారం చేయడం కన్నా... కనపడే మనిషికి సేవచేయడంలో, వారి కళ్ళలో కనపడే కృతజ్ఞతాపూర్వకమైన చూపును అనుభవించే వారికే తెలుస్తుంది.
ప్రపంచంలోని తియ్యదనమంతా ఇందులోనే ఉంటుంది.

రచయిత
మళ్ళే వాడే
'మనిషి'

జన వాక్యం

త్వరగా తేల్చండి




ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు నిరుద్యోగులను ఆందోళనకు, ఆత్రుతకు గురిచేస్తున్నాయి. మొదట టెట్ – 2018 వివరాలు ప్రకటించిన ప్రభుత్వ పెద్దలు కొద్దిరోజులలోనే వారి నిర్ణయాన్ని మార్చుకొన్నారు. ఇంకొన్ని రోజులకు పేపర్–3ని ప్రవేశ పెట్టారు. దీనిపై ఇప్పటికీ కొంతమంది అభ్యర్థులకు సరైన అవగాహన లేదు. ఇదిలావుంటే డిఎస్‌సి ప్రకటన ఎప్పుడొస్తుందో తెలియని అయోమయం నిరుద్యోగులను వెంటాడుతోంది. ప్రభుత్వ ప్రకటన ఎప్పుడైనా రావచ్చన్న ఆశతో ముందస్తుగానే ఎంతో మంది కోచింగులకు వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వ జాప్యం ఇలాగే కొనసాగితే, ప్రయివేటు పాఠశాల ల్లో బోధించే ఉపాధ్యాయులు, వచ్చే విద్యాసంవత్సరం బోధనా తరగతులకు వెళ్ళాలా వద్దా అన్న అయోమయ పరిస్థితులు నెలకొం టాయి. అందుకే ప్రభుత్వం తక్షణం డిఎస్‌సి నోటిఫికేషనుకు కచ్చితమైన, సరైన నిర్ణయం తీసుకోవాలి.

ఎస్ సాయి,
ఇ మెయిల్ ద్వారా

వ్యాసాలు, ఉత్తరాలు రాయవల్సిన చిరునామా
editpageps@gmail.com

భాషా సంస్కృతులకు దూరమౌతున్న తెలుగు రాష్ట్రాలు

సంస్కృతి



డా॥ సామల రమేష్ బాబు


భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకై ఉద్యమించడం–దేశానికి స్వాతంత్ర్యం కోసం పోరాటం జరుగుతున్న కాలంలోనే మొదలైంది. బ్రిటిష్ పాలన నుండి స్వాతంత్ర్యం సిద్ధించడానికి కొన్నేళ్ల కిందటే భారత జాతీయ కాంగ్రెసు భాషా ప్రయుక్త రాష్ట్రాలకు అనుకూలంగా నిర్ణయించింది. ఆ రోజుల్లోనే కాంగ్రెసు సంస్థ నిర్మాణ కార్యకలాపాలను కూడా ఆ ప్రాతిపదికనే జరిపేది కూడా. కాని స్వాతంత్ర్యానంతరం మాత్రం కాంగ్రెసు పాలకులు అందుకు వ్యతిరేకంగా వ్యవహరించడం మొదలుపెట్టడంతో ఉద్యమం తీవ్రతరమైంది. ఆ సందర్భంగా స్టేట్ కౌన్సిల్లో కమ్యూనిస్టు నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య చేసిన ప్రసంగంలో – స్వభాష (తెలుగు) లో పరిపాలన కోసమే ప్రత్యేకాంధ్ర రాష్ట్రాన్ని కోరుతున్నామని స్పష్టం చేశారు. ఆయన ఇలా అన్నారు.

'తెలుగు ప్రజలందరూ హృదయ పూర్వకంగా విశాలాంధ్రను వాంఛిస్తున్నారు. తమ పరిపాలన తమ భాషలోనే జరగాలని ఆంధ్ర ప్రజలు కోరుకుంటున్నారు. తమ బిడ్డలకు తమ మాతృ భాషలోనే విద్యను గరపాలని అభిలషిస్తున్నారు. ఇది వారి సహజ వాంఛ. అంతేకాదు, ప్రతి ఒక్కరి జన్మ హక్కు. ఉత్తర ప్రదేశ్, మధ్య భారత్, బీహార్ తదితర రాష్ట్రాల్లో తమ భాషలోనే పరిపాలన సాగించుకోవడానికి, తమ మాతృ భాషలోనే తమ బిడ్డలకు విద్య గరపించుకునేందుకు అవకాశం ఇస్తున్నప్పుడు అదే సూత్రాన్ని ఇతర రాష్ట్రాల్లో అమలు జరపడానికి ఎందుకు వ్యతిరేకించాలి? ప్రత్యేక భాషా రాష్ట్రం లేకపోతే ప్రజాతంత్ర ప్రభుత్వం ఉండడం సాధ్యం కాదు. భారతదేశ ఐక్యత సంభవం కాదు'.

ఇదీ భాషా రాష్ట్రాల ఏర్పాటు మూల సూత్రం

మొత్తం మీద – అందరినీ కలిపి ఉంచాల్సిన భాష – ఆంధ్ర, తెలంగాణలు విడిపోయి ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పడ్డానికి కూడా ఒక అంశం అయింది. అందరికీ కలిపి ఒక ఉమ్మడి (ప్రామాణిక) భాషగా తీర్చి దిద్దుకోవడం లోనూ, ఉమ్మడి సాంస్కృతికతను సంతరించుకోవడంలోనూ విఫలం కావడానికి మేధావుల, పాలక వర్గాల మితిమించిన స్వార్థమూ, పట్టనితన మూ కారణం అయింది. అయినా, ఇప్పుడైనా రెండూ తెలుగు రాష్ట్రాలే. తెలుగు రాష్ట్రాలుగా రెండు ప్రాంతాలకూ ఉన్న వేలాది సంవత్సరాల చరిత్ర ప్రపంచంలోనే భాషా జాతుల చరిత్రలో తలమానికమైంది. ఈ అంశాన్ని నిన్న తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నిర్వహించిన 'ప్రపంచ తెలుగు మహాసభలు నొక్కి వక్కాణించాయి. తెలుగువారి చరిత్రలో ఒక మలుపుగా, కొత్త చరిత్ర నిర్మాణానికి నాందిగా ఈ సభల్ని పరిగణించాలి.

స్వాతంత్ర్యానంతర సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది, ఆత్మ గౌరవాన్ని నిలబెట్టుకోవడానికి, బంగారు తెలంగాణను తీర్చి దిద్దుకోవడానికీ నేటి తెలంగాణ పాలకులూ, మేధావులూ ఉద్యమించాల్సిన సందర్భం ఇది. తెలుగు భాషకు సంబంధించి తమ ప్రాంత ప్రత్యేకతలను గుర్తించి దాన్నంతా



బలపరచుకోవలసిన బాధ్యత వారిపై ఉంది. ఈ వ్యాసం మొదట్లో ఉటంకించినట్లు – పుచ్చలపల్లి సుందరయ్య రాష్ట్రం మౌలిక లక్ష్యాలుగా ఏం చెప్పారో – అవే ఇప్పుడు తెలంగాణకు వర్తిస్తాయి.

వందేళ్లకు ముందు భాష అవసరాలు వేరు. కేవలం సాహిత్యానికే పరిమితమైన రోజులు అవి. అప్పుడు విద్య కూడా సమాజంలో కొందరికే అందేది. ఇప్పుడు ఎటువంటి మినహాయింపు లేకుండా సమాజంలోని అన్ని వర్గాలకూ విద్య అవసరం. ఆ విద్య – అది ఏ స్థాయిలోదైనా, ఏ విషయానికి సంబంధించినదైనా అది ప్రజల సొంత భాషలోనే వారికి అందాలి. ఇది శాస్త్రీయమైన, హేతుబద్ధమైన విధానం. ప్రపంచమంతా అంగీకరించిన విధానం. అయితే అనేక రాజకీయ, చారిత్రక, సామాజిక కారణాల వల్ల కొన్ని భాషల ఆధిపత్యం చోటు చేసుకుంది. ముఖ్యంగా ఇప్పుడు విద్యా రంగంలో ఆంగ్ల భాష ఆధిపత్యం అతిగా ఉంది.

సమైక్య రాష్ట్రంలో పి.వి. నరసింహారావు హయాంలో తెలుగును ప్రాథమిక స్థాయి నుండి పి.జి వరకు బోధనా భాషగా చెయ్యడం కోసం అన్ని చర్యలూ తీసుకున్నారు. ఆ పరిస్థితి ఇప్పుడు పూర్తిగా తలకిందులైంది. బోధనా భాషగా తెలుగు వద్దు అని రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలూ నిర్ణయించుకొన్నట్లున్నాయి. ఈ విషయంలో ప్రయివేటు విద్యా వ్యాపార వర్గాల గుప్పిట్లో ప్రభుత్వాలు ఇరుక్కుపోయాయని స్పష్టంగా అర్థమవు తోంది. ఈ పరిణామ తీవ్రతను మరుగు పరచేందుకు రెండు ప్రభుత్వాలూ ఒక భాషగా మాత్రమే తెలుగును ఒకటవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు తప్పనిసరిగా బోధిస్తామనే విధానాన్ని ముందుకు తెచ్చాయి. నిజానికి 2003లోనే చంద్రబాబు నాయుడు అధికారంలో వున్న సమైక్య రాష్ట్ర ప్రభుత్వంలో భాషోద్యమకారుల వత్తిడి వల్ల జి.ఓ నెం. 86 వచ్చింది. దాని ప్రకారం 1 నుండి 10 వరకు రాష్ట్రం మొత్తంలో ఎవరి నిర్వహణలో వున్నా ఏ మీడియంలో బోధిస్తున్నా – తెలుగును ఒక సబ్జెక్టుగా తప్పనిసరి చేసిన ఉత్తర్వు అది. అయితే దాన్ని ఏనాడూ సరిగా అమలు చేసిన దాఖలా లేదు. ఉపాధ్యాయుల నియామకంలో గాని, తరగతుల నిర్వహణలో గాని బాధ్యత లేకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేసినందున మొక్కుబడి చదువుగానే 'ఒక సబ్జెక్టుగా తెలుగు బోధన' సాగుతూ ఉంది. తెలుగు మీడియంలో చదువుతూ, తెలుగు ప్రథమ భాషగా చదువులు సాగించిన విద్యార్థులకు మాత్రమే తెలుగు భాష మీద పట్టు, దాన్ని వినియోగించగల సామర్థ్యం ఏర్పడ్డాయి. ఇంగ్లీషు మీడియంలో చదివే పిల్లలకు తెలుగు నేర్పడం ఎంత నిర్లక్ష్యంగా జరిగిందో అంతే స్థాయిలో పిల్లల్లో తెలుగు భాషా జ్ఞానం అడు గంటింది. మున్ముందు జరుగబోయేది కూడా అదే. రెండు రాష్ట్రాల్లో పాఠశాల విద్యను పూర్తిగా ఆంగ్ల మాధ్యమంలోకి మార్చేయడం వల్ల జరిగేది ఇదే.

నేటి ప్రపంచంలో అభివృద్ధి చెందిన, చెందుతున్న, ఆత్మ గౌరవం గలిగిన పెద్ద, చిన్న, అతి చిన్న దేశాలన్నీ తమ అమ్మ నుడితోనే అన్ని రంగాలలో వికసిస్తున్నాయి. ఇంగ్లీషును కానీ, మరే ఇతర భాషను గానీ అవసరం ఉన్నంత మేరకే అవి వినియోగించుకొంటున్నాయి. కంప్యూటర్ల యుగంలో నానాటికీ ఎదుగుతున్న సాంకేతిక విజ్ఞానాన్ని పూర్తిగా ఉపయోగించుకోవడానికి మాతృభాషనే ప్రధాన సాధనంగా వాడుకొంటు న్నాయి. అనువాద ప్రక్రియ సహాయంతో జ్ఞాన ప్రసారాన్ని, వినిమయాన్ని సొంత భాషల్లోకి ఎప్పటికప్పుడు తెచ్చుకొంటున్నాయి. అందువల్ల ఆయా దేశాల పెద్దలు, పిన్నలు అంతా – తమ సమయాన్ని పరాయి భాషల్లో ప్రవీణులు కావడం కోసం ఖర్చు పెట్టవలసిన అవసరం లేకుండా తమ స్వంత నాలుకలకే నిరంతరంగా శక్తిని పెంచుకొంటున్నారు. ఇదీ సహజ 'జ్ఞాన వినిమయ' విధానం. దీనికి పూర్తిగా విరుద్ధంగా మన రెండు తెలుగు రాష్ట్రాలు వ్యవహరిస్తున్నాయి. దీని అర్థం జాతిని ఆత్మ విస్మృతిలోకి నెట్టి, తమ స్వశక్తిపైనా, తమ భాషపైనా, వారసత్వంపైనా స్వాభిమానం కోల్పోయినవారిని తయారు చేసుకొంటున్నామన్నమాట. అలాంటి భవిష్యత్ తరాలను మనం సిద్ధం చేయడం ఏ ప్రయోజనాల కోసం? ఒకటి రెండు తరాలు గడువక ముందే క్రమంగా వీరంతా పూర్తిగా తెలుగు భాషకు పూర్తిగా దూరమవుతారు. బి.టి విత్తనాల్లాగా, సంతాన యోగ్యత లేని స్త్రీ పురుషుల్లాగా తెలుగు జాతి జనులు మన ప్రభుత్వ విధానాల వల్ల రూపొందబోతున్నారు.

తమ భాషకు, సంస్కృతికీ దూరమైన ఈ రెండు రాష్ట్రాలూ తెలుగు రాష్ట్రాలుగా ఇంకెంత కాలం మనుగడ సాగించబోతున్నాయి? 'భాష నశిస్తే జాతి నశిస్తుంది' అని అందరకూ తెలిసిన సత్యం. అంటే – ఈ భాషా జనులంతా చచ్చిపోరు, ఇతర భాషీయులై పోతారు. అంటే తమ భాషా జాతీయతను కోల్పోతారు. ఇటువంటి ప్రజలతో ఆంధ్ర తెలంగాణలు ఎలాంటి ఆత్మగౌరవాన్ని, భవిష్యత్తును కలిగి ఉంటాయి?

అందరూ ఆలోచించవలసిన తీవ్రమైన సమస్య ఇది. ఫిబ్రవరి 21 ప్రతి ఏటా ప్రపంచమంతటా అన్ని భాషా జాతులవారూ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకోబోతున్నారు. మరి మనం ఆ సందర్భాన్ని ఎలాంటి కర్తవ్య దీక్షతో, లక్ష్యంతో జరుపుకోబోతున్నాం?

(రచయిత తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు, 'అమ్మ నుడి' పత్రిక సంపాదకుడు, సెల్ : 98480 16136)

వికసిత పద్మాలు

మహిళ అంటేనే మానవత్వానికి ప్రతిరూపం. ఆ మానవతా లక్షణాన్ని అందిపుచ్చుకొని.. తాము ఎంచుకున్న రంగాల్లో అహర్నిశలూ శ్రమిస్తూ సేవలందిస్తున్నారు ఆ మహిళామణులు. సామాజిక, సాంస్కృతిక సేవలో వికసించి, భారత ప్రభుత్వ పద్మ పురస్కారం గౌరవం అందుకున్నారు. వారు అందాలు, ఆకర్షణలతో కాదు; మంచి మనసుతో, సమాజం పట్ల బాధ్యతతో సేవకు అంకితమైనవారు. తమ జ్ఞానాన్ని పదుగురికి పంచుతూ.. చైతన్య వికసితాలకు ప్రతీకలుగా నిలిచారు. ఈ ఏడాది మొత్తం 85 మంది పద్మ పురస్కారాలు పొందగా, అందులో 14 మంది మహిళలు. వీరిలో ఒకరికి పద్మభూషణ్ రాగా, 13 మందికి పద్మశ్రీ లభించింది. ఆ వికసిత పద్మాల గురించిన విశేషాల సమాహారం 'జీవన' పాఠకులకు ప్రత్యేకం.


శారదా సిన్హానే


నానమ్మల్


నౌఫ్ మర్వాయి


రాణి


లక్ష్మికుట్టీ


సీతవ్వ


సుభదాని దేవి


మాలతీ జోషి


లెంథినా థక్కర్


నరసమ్మ


సుభాషిణీ


మీరాభాయ్


జయశ్రీ


విజయలక్ష్మి

'మైనే ప్యార్‌కియా' సినిమాలో 'కహే తో సే సాజన్' అంటూ నాటి (1989లో) యువత మనసు దోచిన పాట అది. ఆ పాట పాడింది ఎవరో కాదు, బీహార్‌కు చెందిన శారద సిన్హానే. ఈమె జానపద సంగీత కళాకారిణి. శారద సుపోల్ జిల్లాలోని హులాస్‌లో జన్మించారు. శారద పాటలో వికసించిన పద్మం. ఈమె 'మైథిలీ, భోజ్‌పురీ, మఘయ్' పాటలు పాడతారు. ఛత్‌పూజల పాటల్లో ఆమె ప్రసిద్ధి. బీహార్‌లోని దుర్గాపూజ మంటపాల్లో ఈమె పాట తప్పనిసరి. శారద కొన్ని భక్తి పాటల ఆల్బమ్స్ చేశారు. ఆమె ఎక్కువగా భక్తి పాటలకే ప్రాధాన్యం ఇచ్చారని చెప్పాలి. ఇప్పటిదాకా 62 ఛత్ పాటలను తొమ్మిది ఆల్బమ్స్‌గా చేసి, విడుదల చేశారు. మరోవైపు బాలీవుడ్‌లో ఆమె పాటలకు ఫిదా అవ్వాల్సిందే. 'కహే తో సే సాజన్' కాకుండా ఆమె మరో రెండు పాటలు కూడా పాడారు.

క్రీడారంగంలో..

క్రీడారంగంలో వికసిత పద్మం మీరాభాయ్ చాను. అమెరికా వేదికగా జరిగిన ప్రపంచ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత తరపున మీరాభాయ్ చాను. 194 కిలోల బరువును ఎత్తి, స్వర్ణ పతకం సాధించారు. 1995లో కరణం మల్లీశ్వరి స్వర్ణం సాధించారు. ఆ తర్వాత 22 ఏళ్లకు మీరాభాయ్ చాను స్వర్ణం సాధించారు. ఈ సందర్భంగానే కేంద్ర ప్రభుత్వం ఆమెను భారత విశిష్ట సేవా పతకాల్లో ఒకటైన పద్మశ్రీతో గౌరవించింది.

ప్రజారోగ్యంలో..

మహారాష్ట్రకు చెందిన రాణీ ప్రజారోగ్యం కోసం ఎన్నో సేవలు చేశారు. అనేక పరిశోధనలూ చేపట్టారు. ప్రధానంగా బాలలు, మహిళల ఆరోగ్యం, భ్రూణహత్యలపై అవగాహన కల్పిస్తున్నారు. అందుకు అనేక పరిశోధనలు చేపట్టారు. ఇందుకు ప్రత్యేకంగా ఓ స్వచ్ఛంద సంస్థనే వారు ఏర్పాటు చేశారు. ఆ సంస్థ ద్వారా ఆరోగ్యపరంగా ప్రజలకు ఎన్నో సేవలు అందిస్తున్నారు. రాణీ, ఆమె భర్త అభయ్ ... వీరిద్దరూ వైద్యులు కావడంతో సమాజంలో పెరుగుతున్న శిశు మరణాలను తగ్గించేందుకు కంకణం కట్టుకున్నారు. వీరు బాలిక పునరుత్పత్తిపై అధ్యయనాలు చేసి, సఫలీకృతులయ్యారు. వీరి సేవలకు గుర్తుగా ఎన్నో అవార్డులూ వచ్చాయి.

ఆయుర్వేదంలో..

పూర్వీకుల అనుభవంతో పచ్చని చెట్లతో వైద్యం చేస్తూ ఆయుర్వేదంలో వికసితం పద్మం లక్ష్మీకుట్టి. ఆమె ఆయుర్వేదానికి కేరాఫ్ అడ్రసుగా ఉన్న కేరళకు చెందిన 75 ఏళ్ల గిరిజన మహిళ. ఈమె తనకు తెలిసిన పరిజ్ఞానంతో ఎంతోమంది పాముకాటు బాధితులకు ప్రాణం పోశారు. పాముకాటుకు దాదాపు 500 ఔషధాలను ఆమె కనుగొన్నారు. దీంతో పాము కరిచిన వేలాదిమంది ప్రాణాల్ని ఆమె కాపాడగలిగారు లక్ష్మీకుట్టి తన పూర్వీకుల ద్వారా నేర్చుకున్న ప్రాచీన ఆయుర్వేద వైద్యాన్ని తనకే పరిమితం చేసుకోకుండా, భవిష్యత్ తరాలకు నేర్పుతున్నారు. దక్షిణ, ఈశాన్య రాష్ట్రాల్లోని ఎన్నో మెడికల్ ఇనిస్టిట్యూషన్స్‌లో పాముకాటు వైద్యంపై ఆమె ప్రసంగాలు చేస్తున్నారు. ఆమె చేసిన సేవలకు ఇప్పటికే బోలెడన్ని అవార్డులు అందుకున్నారు.

సామాజిక సేవలో..

కర్ణాటకకు చెందిన ఆరుపదుల వయసున్న సీతవ్వ జొడ్డాటి సామాజిక సేవలో ఈ పురస్కారం పొందారు. ఆమె తన ఏడో ఏట నుంచే సమాజ సేవలో తనదైన ముద్ర వేశారు. ప్రధానంగా కర్ణాటక రాష్ట్రం బెల్గం ప్రాంతంలోని దళితవాడల్లో బాలికల పట్ల మరణశాసనంగా మారిన దేవాదాసీ వ్యవస్థను రూపుమాపేందుకు సీతవ్వ విశిష్ట కృషి చేశారు. ప్రత్యేకంగా 'మహిళా అభివృద్ధి మట్టు సంస్కరణ సమితి (మాస్)' అనే సంస్థను నెలకొల్పారు. అందులో దేవాదాసీ వ్యవస్థలో మగ్గిపోతున్న దాదాపు నాలుగు వేల మంది మహిళలకు ఆశ్రయం కల్పించారు. ఆ వ్యవస్థను రూపుమాపేందుకు ఎన్నో అవగాహన సదస్సులు, చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. వారు ఆర్థికంగా ఎదిగేందుకు ఫైనాన్స్ సంస్థల ద్వారా రుణాలూ ఇప్పించారు.

సాహిత్యంలో..

అసోంకు చెందిన జయశ్రీ గోస్వామి మెహంత సాహిత్యంలో వికసిత పద్మం. ఈమె సాహిత్యం, జర్నలిజం, విద్యారంగంలో ఎన్నో సేవలు అందించారు. ఎన్నో పుస్తకాలు, నవలలు రాశారు. ఈమె మాజీ ముఖ్యమంత్రి, రాజ్యసభ మాజీ సభ్యుడు ప్రఫుల్‌కుమార్ మెహంతా భార్య. జయశ్రీ సాహిత్యానికే పరిమితం కాకుండా రాష్ట్రంలో జరిగే ఆందోళనలు, వర్తమానాంశాలపై వ్యాసాలు రాశారు. అనేక పుస్తకాలూ ప్రచురించారు. ఆమె సేవలకు గుర్తుగా ఎన్నో అవార్డులు అందుకున్నారు.

జానపదంలో..

జానపదాలు ఆ సమయానుకూలంగా కొన్ని పుడతాయి. అలా పుట్టిన జానపదాల్లో వికసిత పద్మం విజయలక్ష్మీ. ఇప్పటికీ చాలా జానపదాలు కనుమరుగైపోతున్నాయి. అలాంటి తమిళ జానపదాలను ఒకచోట చేర్చి, డాక్యుమెంటేషన్ చేస్తున్నారు విజయలక్ష్మీ. మధురై కామరాజ్ యూనివర్సిటీలో ఫోక్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్‌లో ఆమె ప్రొఫెసర్‌గా పనిచేసి, రిటైరయ్యారు. ఆమె పదివేలకు పైగా తమిళ జానపదాలను ఆడియో రూపంలో తీసుకొచ్చారు. అంతేకాదు ఆమె కొన్ని పాటలను 11 పుస్తకాలుగా ప్రచురించారు. విజయలక్ష్మిని 'తమిళ జానపద ఎన్‌సైక్లోపీడియా' అని కూడా అంటారు.

మానవత్వంలో..

ఆమె పాచిపని చేసుకునే పేదరాలే. కానీ, మానవత్వంలో మేటి. ఆమె కోల్‌కతాకు సమీపంలో హన్సుపుకుర్ గ్రామానికి చెందిన సుభాషిణీ మిస్త్రీ. ఎర్రటి ఎండల్లో కూలీ పనిచేసుకుని బతికే బడుగుజీవి. వీధి వీధి తిరుగుతూ కూరగాయలూ అమ్మేది. అలాంటావిడ ఆసుపత్రి కట్టి, పేదలకు ఉచిత వైద్యం అందించాలన్న గొప్ప ఆశయాన్ని తలకెత్తుకున్నారు. అందుకు కారణం ఆమెకు 23 ఏళ్ల వయసులో వైద్యం అందక భర్త చనిపోవడం. అప్పటి నుంచి ఆమెలో ఆ కోరిక బలంగా నాటుకుపోయింది. తన కల సాకారానికి పిల్లలు ఆటంకం కాకూడదని వారిని అనాథాశ్రమంలో ఉంచి, చదివించారు. గ్రామస్తుల సహకారం కూడా తోడు చేసుకుని, 1993లో ఒకే ఒక్కగదిలో 'ప్రజా వైద్యశాల (హ్యూమానిటీ హాస్పిటల్)' పేరుతో ప్రారంభించారు. ఈ ఆసుపత్రి ఇప్పుడు ఎన్నో వేల మందికి వైద్యం అందిస్తోంది. ఆమె కొడుకును డాక్టర్‌ని, కూతురిని నర్స్‌నూ చేసి, వారినీ ఆ సేవకు అంకితం చేసిన గొప్ప మానవతామణి సుభాషిణీ.

అమ్మతనంలో..

సూలగిట్టి నరసమ్మను 'జనని' (అమ్మ) గా పిలుచుకుంటారు. కర్ణాటకు చెందిన నరసమ్మ ... ఎలాంటి వైద్య విద్య చదవకుండా ఇప్పటికీ దాదాపు 15 వేలకు పైగా ప్రసవాలు సునాయాసంగా చేశారు. అదీ ఉచితంగా, రూపాయి తీసుకోకుండా! నరసమ్మ మామూలు మధ్యతరగతి కుటుంబంలో పుట్టి, రైతుగా జీవనం కొనసాగిస్తున్నారు. ఈ అమ్మ ఎలాంటి వైద్య పరికరాలు లేకున్నా, కడుపులో ఉన్న బిడ్డ ఏ పొజిషన్‌లో ఉన్నదీ.. ఆ బిడ్డ నాడినీ ఇట్టే చెప్పేయగల విజ్ఞానవంతురాలు. ఎన్నో ప్రసవాలు చేసిన ఈమెకు తుమ్‌కూర్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించింది. ప్రస్తుతం ఆరోగ్యం బాగాలేక 97 ఏళ్ల నరసమ్మ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

గాంధీ ఆశ్రమంలో..

గ్రామంలో గాంధీ ఆశ్రమాన్ని నడిపిస్తూ సేవలు అందిస్తున్నారు నాగాలాండ్‌కు చెందిన 84 ఏండ్ల లెంతిన థక్కర్. ఈమె సామాజిక సేవకురాలిగా గుర్తింపు పొందారు. అప్పట్లో వాళ్ల గ్రామంలో ఏడో తరగతి వరకూ చదువుకున్నది లెంతిన థక్కర్ ఒక్కరే. ఆ తర్వాత గాంధేయవాద సిద్ధాంతాన్ని ఆచరించారు. కస్తూర్బా ఆశ్రమాన్ని 1950లో గౌహతిలో స్థాపించారు. థక్కర్ భర్త నట్వర్ స్వాతంత్ర్య సమరయోధులు, సామాజిక కార్యకర్త. ఆమె చిన్నతనం నుంచి నాగాలాండ్‌లోని చుచుయిమ్‌లాంగ్ గ్రామంలో గాంధీ ఆశ్రమాన్ని నిర్వహిస్తూ 'గ్రాండ్ మదర్'గా పేరుపొందారు.

చేనేతలో..

సాంప్రదాయ వస్త్రాలు రూపొందించే చేనేతలో సేవలు అందించారు లాంగ్‌పోక్లక్‌పామ్ సుబదాని దేవి. ఈమె మణిపూర్‌కి చెందిన పేరుపొందిన సాంప్రదాయ నేతకారిణి. ఆమె ఎంతో గౌరవప్రదమైన 'శాంత కబీర్ అవార్డు'తో సహా అనేక పురస్కారాలు పొందారు. ఎప్పటి నుండో ఉన్న సాంప్రదాయ వస్త్ర నేతకు సంబంధించిన గొప్ప కళాత్మక డిజైన్లను ఆమె భద్రపరిచారు. ఆ కళాత్మకతను రంగరించి తనదైన శైలిలో వస్త్రాలను తయారుచేయడంలో ఈమె ప్రసిద్ధి పొందారు.

విద్యారంగంలో..

విద్యారంగంలో మధ్యప్రదేశ్‌కు చెందిన మాలతీ జోషి పేరు పొందినవారు. ఈమె ప్రముఖ కథా రచయిత్రి కూడా. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో మాలతీ జన్మించారు. ఇప్పటికి హిందీ, మరాఠీ భాషల్లో 41 పుస్తకాలను వెలువరించారు. ఈమె విద్యా, సాహిత్య రంగానికిగానూ పద్మశ్రీని అందుకున్నారు.

యోగాలో..

యోగాలో వికసిత పద్మం కోయంబత్తూర్‌కి చెందిన 98 ఏండ్ల నానమ్మల్. ఈమె ఎనిమిది సంవత్సరాల వయసులోనే యోగాభ్యాసం చేయడం మొదలుపెట్టారు. గతేడాదే 20 వేల మందికి ఒకేసారి యోగా నేర్పి, గిన్నీస్ రికార్డులో ఆమె స్థానం సంపాదించుకున్నారు. ఈమె కుటుంబం నుంచి దాదాపు 36 మంది యోగా టీచర్లు ఉన్నారు. ఈమె దగ్గర యోగా నేర్చుకొని, 600 మంది ప్రపంచవ్యాప్తంగా యోగా గురువులయ్యారు. పెళ్లయిన దగ్గరి నుంచి ఆమె ప్రకృతి వైద్యాన్నే ఆచరించారు. శత వసంతాలకు దగ్గరవుతున్న నానమ్మల్ ఇప్పటికే సంక్లిష్టమైన యోగాసనాలనూ సునాయాసంగా వేయగలరు. మొదటిసారి 2003లో యోగా పోటీల్లో పాల్గొని, తన సత్తా ఏంటో నిరూపించుకున్నారు. ఆమె ఇంటి దగ్గరే యోగా నేర్పిస్తున్నారు.

సౌదీ యోగాలో

సౌదీ అరేబియాలో ఉంటున్న నౌఫ్ మర్వాయి... మనదేశంలో ప్రాచుర్యం పొందిన యోగాను అక్కడ వారికి నేర్పించి గుర్తింపు పొందారు. సౌదీ అరేబియాలో యోగాకు సంబంధించి మొదటి గురువుగా పేరు తెచ్చుకున్నారు ఆమె. ఇప్పటికి మూడు వేల మందికిపైగా యోగా నేర్పారు. వీరిలో 70 మందికి పైగా టీచర్లగా తయారయ్యారు. యోగా నేచురోపతిలో దాదాపు 19 ఏళ్ల నుంచి ఆమె సేవలు చేస్తున్నారు.

- జీవన డెస్క్


జీవన చిత్రం
ఫోటో : టి.వి.ఆర్

మీ కోసం

అల్లం ముక్కలు ఎండబెట్టి టీలో వేస్తే మరింత రుచిగా ఉంటుంది.



జీవన సౌరభం

ఇష్టంతో చేసే పని శక్తిని హెచ్చిస్తుంది. కష్టంతో చేసే పని శక్తిని తగ్గిస్తుంది.

గోళ్లు కొరకడం ఆపేదెలా?



కొందరు అదే పనిగా గోళ్లు కొరుకుతుంటారు. సినిమా చూస్తున్నా, టీవీ ముందు కూర్చున్నా, ఆందోళనగా ఉన్నా గోళ్లు కొరికేస్తుంటారు. అయితే కొన్ని చిట్కాలు పాటించడం ద్వారా ఈ అలవాటును సులభంగా మానుకోవచ్చు.

- సమయానికి గోళ్లు కట్ చేసుకోవాలి. గోళ్లు కట్ చేసుకోవడం వల్ల వాటిని కొరికే అలవాటు కొంత తగ్గుతుంది.
- గోళ్లు కొరికే అలవాటు మానుకోవాలంటే ఫోన్‌లో రిమైండర్ పెట్టుకోవడం, డెస్క్ దగ్గర నోట్ రాసి అతికించుకోవడం చేయాలి. ఇదీ కొంతమేర ఉపకరిస్తుంది.
- తరచుగా మెనిక్యూర్ చేయించుకోవాలి. అందంగా ఉన్న గోళ్లను చూస్తే కొరకాలనిపించదు.
- గోళ్లు కొరకడానికి క్యాల్షియం లోపమూ ఒక కారణం. కాబట్టి పాల ఉత్పత్తులు ఎక్కువగా తీసుకోవాలి. హెల్దీ డైట్‌ను ఫాలో కావాలి.
- ఇవేవీ పనిచేయకపోతే గోళ్లకు నీమ్ పేస్ట్ లేక బ్లాక్ పెప్పర్‌ను అప్లై చేయాలి.
- ఒత్తిడితో ఉన్నా గోళ్లు కొరుకుతుంటారు. అందుకే ఒత్తిడిని తగ్గించుకోవాలి. అందుకు యోగా, ప్రాణాయామం వంటివి సాధన చేయాలి.
- చేతికి రిస్ట్‌బ్యాండ్ ధరించాలి. గోళ్లు కొరకాలనిపించినపుడు రిస్ట్ బ్యాండ్‌ను చూడటం వల్ల ఆ ఆలోచనను విరమించుకుంటారు.

ఇలా చిన్నచిన్న చిట్కాలను పాటిస్తే త్వరగానే గోళ్లు కొరికే అలవాటుకు దూరం కావొచ్చు. ★

బిట్‌కాయిన్స్‌పై ఐసిఎఐ అధ్యయనం

కొల్‌కతా : క్రిప్టో కరెన్సీలకు డిమాండ్ పెరుగుతున్న నేపత్యంలో ప్రత్యేకంగా బిట్ కాయిన్‌పై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఎఐ) అధ్యయనం చేయాలని నిర్ణయించింది. క్రిప్టో కరెన్సీలపై అభిప్రాయాలు తెలపాలని చెప్పాలని కేంద్రం సూచించడంతో ఈ సమగ్ర అధ్యయనం చేపడుతున్నట్లు ఐసిఎఐ సభ్యుడు దెబాశిష్ మిత్రా పేర్కొన్నారు. కార్పొరేట్ గవర్నెన్స్, కంపెనీల చట్టంపై సిఐఐ నిర్వహించిన సెమినార్‌లో మిత్ర మాట్లాడుతూ ఈ ఏడాది మార్చికల్లా కంపెనీ వ్యవహారాల శాఖకు దీనిపై నివేదిక సమర్పించే అవకాశముందన్నారు.

రూ.250 తగ్గిన పసిడి..

స్థానిక వర్తకుల నుంచి పసిడికి డిమాండ్ తగ్గడంతో శనివారం కొంత ధరలు దిగివచ్చాయి. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం, 99.5 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.250 తగ్గి వరుసగా రూ.31,200, రూ.31,050గా పలికింది. అదే విధంగా కిలో వెండిపై రూ.350 దిగివచ్చి రూ.40,650గా నమోదయ్యింది.



ఎంఎస్‌ఎంఇ ఎక్స్‌పో..

రెండు రోజుల ఆల్ ఇండియా ఎంఎస్‌ఎంఇ వాల్డ్ ఎక్స్‌పో 2018 హైదరాబాద్‌లోని ఎస్-ఎస్ఐసిలో శనివారం ప్రారంభమైంది. ఇందులో ఎంఎస్‌ఎంఇ సంస్థలు తయారు చేసిన వినూత్న ఉత్పత్తులను ఔత్సాహికవేత్తలు ప్రదర్శనకు ఉంచారని నిర్వాహకులు తెలిపారు. ఇందులో 100 స్టాల్స్ ఏర్పాటు చేశారు.




18 ప్రభుత్వ బ్యాంకులు 'స్థిరం'

రేటింగ్‌ను సవరించిన క్రిసిల్

న్యూఢిల్లీ: దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు గాను సర్కారు ఇటీవల రూ.88,139 కోట్ల మూలధనీకరణ సాయం ప్రకటించిన నేపథ్యంలో క్రిసిల్ 18 ప్రభుత్వ రంగ బ్యాంకుల రేటింగ్స్‌ను సవరించింది. ఈ బ్యాంకుల రేటింగ్స్‌ను 'నెగటివ్' నుంచి 'స్టెబుల్'కు మార్చింది. సర్కారు సాయం నేపథ్యం ఆయా బ్యాంకుల ఆస్తిఅప్పుల పట్టిక బలోపేతం కావడంతో పాటు కీలక మూలధనం పెరిగేందుకు దోహదం చేస్తుందని క్రిసిల్ పేర్కొంది. సర్కారు దన్నుతో అలహాబాద్ బ్యాంక్, ఆంధ్రాబ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్, దేనా బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, ఇండియన్ ఒవర్‌సీస్ బ్యాంక్, ఓరియంటల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, పంజాజ్ నేషనల్ బ్యాంక్, సిండికేట్ బ్యాంక్, యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్, యునైటెడ్ బ్యాంక్‌ల రేటింగ్‌ను క్రిసిల్ సవరించి భవిష్యత్ దృక్కోణం 'స్థిరం' అని ప్రకటించింది. సర్కారు దన్ను కారణంగా బ్యాంకుల రుణ డిమాండ్ పెరుగుతుందని ఫలితంగా ఆయా బ్యాంకుల మొత్తం పని తీరు మెరుగయ్యేందుకు వీలు పడగలదని వెల్లడించింది. అయితే ఈ బ్యాంకుల జాబితాలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లేకపోవడం విశేషం.

చైనాలో తగ్గిన స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు



బీజింగ్ : ఎనిమిదేళ్లుగా పెరుగుతూ వచ్చిన చైనీస్ స్మార్ట్‌ఫోన్ మార్కెట్ 2017లో వార్షిక సరుకు అమ్మకాల్లో 4 శాతం తగ్గినట్లు రీసెర్చ్ సంస్థ కెనాలిస్ అంచనా వేసింది. ఇక్కడి స్మార్ట్‌ఫోన్ బ్రాండ్స్‌లో హువావే, ఒప్పో, వివోలు చైనీస్ మార్కెట్‌లో ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాయని ఆ సంస్థ పేర్కొంది. దేశవ్యాప్తంగా మొత్తం మార్కెట్ నేలచూపులు చూస్తే, హువావే మాత్రం రెండంకెల వద్ధిని సాధించినట్టు తెలిపింది. 2019లో 5జీ డివైజ్‌లు మార్కెట్‌లోకి వచ్చేంత వరకు చైనీస్ స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో వద్ధి ఉండదని కెనాలిస్ విశ్లేషించింది. చైనాలోని ప్రధాన నగరాలైన బీజింగ్, షాంఘైలలో చాలా మంది వినియోగదారులకు ఐఫోన్, శాంసంగ్ గెలాక్సీ వంటి స్మార్ట్‌ఫోన్లపైనే ఎక్కువ ఇష్టం ఉంటుంది. కానీ అంత భారీ ధరలను భరించలేని పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు మాత్రం ఫీచర్ ఫోన్లతోనే సరిపెట్టుకుంటున్నారు. వీరికి తక్కువ ధరలో స్మార్ట్‌ఫోన్ అనుభూతిని అందించడానికి ఒప్పో, వివోలు గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున్న స్టోర్లను కూడా ఏర్పాటు చేశాయని, దీని ఫలితంగా 2016లో చైనా స్మార్ట్‌ఫోన్ మార్కెట్ బాగానే పెరిగిందని పేర్కొంది.

టాప్ 50 లక్ష్యం

- సులభ వ్యాపార సూచీపై జైట్లీ
- మరింత మెరుగపడటానికి అవకాశాలు
- ప్రపంచ బ్యాంకును సంతృప్తిపర్చాలి
- పన్నులు ఎగ్గొట్టకుండా చూడాలి
- ఇంటర్నేషనల్ కస్టమ్స్ డేలో మంత్రి



'ఇంటర్నేషనల్ కస్టమ్స్ దే' కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి జైట్లీ

న్యూఢిల్లీ : అంతర్జాతీయ సులభ వ్యాపార సూచీలో భారత్ మరింత మెరుగు పడటానికి అవకాశాలు ఉన్నాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. ముఖ్యంగా మూడు అంశాలపై దృష్టి పెట్టడం ద్వారా ర్యాంకింగ్‌ను మెరుగుపర్చుకోవచ్చన్నారు. ప్రపంచ బ్యాంకు ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సూచీలో టాప్ 50 ర్యాంకు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇంటర్నేషనల్ కస్టమ్స్ డే సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన అధికారుల సమావేశానికి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా సెంట్రల్ బోర్డు ఆఫ్ ఎక్సైస్ అండ్ కస్టమ్స్ శాఖ రూపొందించిన ఐసెట్రాక్, ఐసెట్యాప్ రెండు టెక్నలాజీ వేదికలను మంత్రి ఆవిష్కరించారు. ఈ రంగంలో వ్యాపారాన్ని మెరుగుపర్చడానికి ఈ వెబ్‌సైట్లు దోహదం చేస్తాయి. ఈ మధ్య కాలంలోనే ప్రపంచ బ్యాంకు వెల్లడించిన ర్యాంకింగ్‌లో భారత్ 142వ స్థానం నుంచి 100వ స్థానానికి చేరిందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

గత 30 సంవత్సరాల్లో చేయలేనిది తాము స్వల్ప వ్యవధిలోనే చేశామని పేర్కొన్నారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా 50వ ర్యాంకుకు చేరడానికి ప్రయత్నించాలని ప్రధానీ తమకు లక్ష్యంగా పెట్టారని అన్నారు. సులభ వ్యాపార ర్యాంకింగ్‌లో ప్రపంచ బ్యాంకు 10 ప్రాతిపదికలను పరిగణలోకి తీసుకుంటుందన్నారు. కాగా భారత్ ముఖ్యంగా మూడు అంశాల్లో మెరుగు పడాల్సి ఉంది. ఇందులో భూమి, నిర్మాణాలకు మున్సిపల్ శాఖల అనుమతులు, అన్ని దేశాలతో వ్యాపారం, కాంట్రాక్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ పెరగాలి. డబ్ల్యుటిఒను అన్ని అంశాల్లోనూ సంతృప్తి పర్చాల్సి ఉందన్నారు. చాలా వరకు పెద్ద కష్టమేమీ కాదన్నారు.

మారుతున్న ఆర్థిక తీరుతెన్నులు

పరిశ్రమల విధాన, ప్రోత్సాహక శాఖ కూడా మూడు అంశాలను మెరుగుపర్చడంపై దృష్టి కేంద్రీకరించిందని జైట్లీ అన్నారు. వీటితో భారత ర్యాంకింగ్ 100 దిగువకు చేరనుందని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. కాగా వాణిజ్య కల్పనలో కస్టమ్స్ శాఖ పాత్ర కీలకమైందన్నారు. కస్టమ్స్ అధికారులు రెండు పాత్రలు పోశించాల్సి ఉందన్నారు. వాణిజ్య పన్ను ఎగవేతలను గుర్తించడం అదే విధంగా నిష్పక్షపాతంగా సరిహద్దుల్లోకి సరుకు వచ్చేలా చూడాలన్నారు. ఇవి రెండు ప్రధాన సవాళ్లే అయినప్పటికీ, ఉద్యోగులు అనుభవంతో చాకచక్యంగా వ్యవహరించాలన్నారు. కస్టమ్స్, మొత్తం పన్ను శాఖ పాత్రపై జైట్లీ మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులు మారుతున్నాయన్నారు. అదే విధంగా టెక్నలాజీ లభ్యమవుతుందన్నారు. ఆర్థిక వ్యవస్థ విస్తరించడంతో పాటు ప్రతీ పన్ను శాఖ మారుతుందన్నారు. ఆదాయపు పన్ను శాఖ పరిధి కూడా పెద్దదన్నారు. అనాదిగా కొన్ని ఎంపిక చేసిన వర్గాలపై అధిక పన్నులు అమల్లో ఉన్నాయని, ఈ తీరు మారుతుందన్నారు.

కస్టమ్స్ శాఖ పాత్ర కీలకం : హస్ముక్ అదియా

వాణిజ్య అంశాల్లో భారత ర్యాంకింగ్ మెరుగుపర్చడంలో కస్టమ్స్ శాఖ పాత్ర కీలకమైందని ఆర్థిక సేవల కార్యదర్శి హస్ముక్ అదియా అన్నారు. ఈ రంగంలో దేశ ర్యాంకింగ్‌ను మెరుగుపర్చుకోవడానికి అందరూ కష్టపడి పని చేయాలని కస్టమ్స్ అధికారులకు ఆయన సూచించారు. 146 స్థానంలో ఉన్న ర్యాంకును సాధ్యమైనంత కష్టపడి 100కు తెచ్చుకోగలిగామన్నారు. ఒక్క ఏడాదిలో కాకపోతే రెండేళ్లలో సాధించుకోగలిగామన్నారు. ప్రస్తుత ఏడాదిని సవాల్‌గా తీసుకుని ర్యాంకింగ్‌పై దృష్టి పెట్టాలన్నారు. జిఎస్‌టి లాంటి అనేక కష్టతర నిర్ణయాలు తీసుకున్నామన్నారు. అదే విధంగా ర్యాంకింగ్ మెరుగు పర్చుకోవడం కూడా సాధ్యమేనన్నారు. మనమంత ఒక నిర్ణయానికి వస్తే, ఏమైనా చేయగలమని అధియా అధికారులను ఉద్దేశించి అన్నారు.

జిఎస్‌టితో పన్ను పరిధి విస్తరిస్తాం

దేశంలో తాము కొత్తగా అమలులోకి తెచ్చిన వస్తుసేవల పన్ను (జిఎస్‌టి) చాలా అనతికాలంలోనే నిలదొక్కుకొందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. జిఎస్‌టి నిలదొక్కుకోవడంతో దాని విస్తృతిని పెంచేందుకు, భవిష్యత్తులో పన్నులను మరింతగా హేతుబద్ధీకరించేందుకు అవకాశం ఏర్పడిందని వివరించారు. జిఎస్‌టి పన్ను విధానం దేశంలోని పరోక్ష పన్నుల విధానంలో సమూల మార్పును తీసుకు వచ్చేందుకు దోహదం చేసిందని వివరించారు. ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో జిఎస్‌టి చాలా అనతి కాలంలోనే నిలదొక్కుకొందని వివరించారు. జిఎస్‌టి పన్ను పరిధి పెంచడం, హేతుబద్ధీకరించే ప్రక్రియ ఇకపై కూడా కొనసాగుతుందని అన్నారు. శనివారం ఇక్కడ ఏర్పాటు చేసిన అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుతం దేశంలో జిఎస్‌టి 5%, 12%,18% మరియు 28% శ్లాబులలో అమలవుతున్న విషయం తెలిసిందే. గత నవంబరులో సమావేశమైన జిఎస్‌టి కౌన్సిల్ కేవలం సిన్ గూడ్స్‌ను మాత్రమే 28% పన్ను పరిధిలో ఉంచి, మిగతా 178 వస్తువులను అత్యధిక పన్ను పరిధి నుంచి 18 శాతం పన్ను పరిధిలోకి తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. డిసెంబరు నెలలో జీఎస్టీ వసూళ్లు పెరగడం సర్కారుకు నూతనోత్తేజాన్ని ఇస్తోంది. సెప్టెంబరు మాసంలో 92,150 కోట్లు అక్టోబరులో రూ.83,000 కోట్లుగా ఉన్న జిఎస్‌టి వసూళ్లు డిసెంబరులో రూ.86,703 కోట్లకు చేరుకున్న సంగతి తెలిసిందే.





కె.ఎస్ లక్ష్మణరావు,
శాసనమండలి మాజీ సభ్యులు
సెల్ : 9440262072

అభ్యసన ఉపగమాలు

టెట్ ప్రిపరేషన్

వాట్సన్ ప్రయోగం (నిబంధనోద్దిత అభ్యసనం)

అమెరికాకు చెందిన వాట్సన్, ఆల్‌బర్ట్ అనే 11 నెలల శిశువుపై ప్రయోగం చేసి 'నిబంధిత అభ్యసనం'ను నిరూపించాడు.

✧ తెల్లని, మృదువైన రోమాలున్న తెల్ల ఎలుకను 'ఆల్‌బర్ట్'కు ఇచ్చాడు. ఆ ఎలుకతో భయపడకుండా హాయిగా ఆటలాడుకున్నాడు.

✧ ఒక రోజు ఆల్‌బర్ట్ ఎలుకతో ఆడుతుండగా వాట్సన్ ఇనుప ఊచను నేలపై పడేసి, పెద్ద శబ్దం చేశాడు.

✧ మొదటిసారిగా 'పెద్ద శబ్దం అనే సహజ ప్రేరణకు భయపడి తన సహజ ప్రతిస్పందన' చూపాడు. కానీ ఆల్‌బర్ట్ మనస్సులో ఆ శబ్దం ఎలుక నుంచి ఉత్పన్నమైందని భావించాడు.

✧ తర్వాత ఏ చప్పుడు కాకపోయినప్పటికీ, ఎలుకను చూసినంతనే ఆల్బర్ట్ భయపడ్డాడు.

✧ అప్పటిదాకా అతని ఆట వస్తువు అయిన ఎలుక **'అసహజ ఉద్దీపన'** అయినా, అదే **'నిబంధిత ఉద్దీపనగా'** మారి అభ్యసనం జరిగింది.

ఉద్దీపనలు	ప్రతిస్పందనలు
– తెల్ల ఎలుక (అసహజ ఉద్దీపన) (సి.ఎస్)	ఆల్బర్టు తెల్ల ఎలుకను చూసినప్పుడు భయపడటం (అసహజ ప్రతిస్పందన) (సి.ఆర్)
– పెద్ద శబ్దం (సహజ ఉద్దీపన) (యుసిఎస్)	– ఆల్బర్టు పెద్ద శబ్దం విన్న వెంటనే భయపడటం (సహజ ప్రతిస్పందన) (యుసిఆర్)

✧ ఈయన విషయ జ్ఞానమైనా, అవగాహన అయినా ఏ చర్య అయినా కేవలం ఉద్దీపన ప్రతిస్పందనల మధ్య బంధకంగాని సంసర్గంగా, నిబంధితంగా ఏర్పర్చవచ్చని ధృవపరిచాడు.

నిబంధిత అభ్యసనం - మూలసూత్రాలు

✧ ఉద్దీపనలు ప్రవేశపెట్టే విధానాన్ని బట్టీ నిబంధిత అభ్యసనం **రెండు విధాలుగా** సంభవించవచ్చు.

1. పురోగమన నిబంధనం : (ఫార్వర్డ్ కండిషనింగ్)

2. మందకొడి నిబంధనం : (బ్యాక్‌వర్డ్ కండిషనింగ్)

✧ **'సహజ ఉద్దీపన ముందుగా సమకూర్చి', తర్వాత 'అసహజ ఉద్దీపనను పరిచయం' చేసి ఒకే విధమైన అభ్యస్త ప్రతిస్పందన ద్వారా అభ్యసనం జరిగితే దానిని పురోగమన నిబంధనం అంటారు.**

ఉదా : పావ్‌లోవ్ ప్రయోగం.

✧ పావ్‌లోవ్ ప్రయోగంలో ఆహారానికి కుక్క లాలాజలం స్రవించడం పరిచయమైన తర్వాత గంట శబ్దం ప్రవేశపెట్టారు.

✧ **అసహజ ఉద్దీపన ముందుగా సమకూర్చి, తర్వాత సహజ ఉద్దీపనను దానితో జోడించి అభ్యస్త ప్రతిస్పందన ఏర్పరిచి, దానిని నిబంధిత ప్రతిస్పందనగా వచ్చే ప్రక్రియనే మందకొడి నిబంధనం/ తిరోగమన నిబంధనం అంటారు.**

ఉదా : వాట్సన్ ప్రయోగం

✧ వాట్సన్ ప్రయోగంలో బాలుడు తెల్ల ఎలుకను చూసిన తర్వాత పెద్ద శబ్దం అనే సహజ ఉద్దీపనను ప్రవేశపెట్టారు.

✧ ప్రతిస్పందనలు రాబట్టడం, ప్రతిస్పందనలు కొనసాగకపోవడాన్ని బట్టి నిబంధిత అభ్యసనం **రెండు రకాలుగా** జరుగుతాయి.

1. సకారాత్మక నిబంధనం (పాజిటివ్ కండిషనింగ్)

2. నకారాత్మక నిబంధనం (నెగెటివ్ కండిషనింగ్)

✧ **సహజ ఉద్దీపనకు చూపే సహజ ప్రతిస్పందన వేరొక అసహజ ఉద్దీపనకూ అదే విధమైన ప్రతిస్పందన చర్య కొనసాగినట్లయితే దాన్ని 'సకారాత్మక నిబందనం' అంటారు.**

ఉదా : పావ్‌లోవ్, వాట్సన్ ప్రయోగాలు.

✧ **సహజ ఉద్దీపనను చూసే సహజ ప్రతిస్పందన వేరొక అసహజ ఉద్దీపనను సమకూర్చడం వల్ల ప్రతిస్పందన చర్య కొనసాగక సమిసిపోతే 'నకారాత్మక నిబంధనం' అంటారు.**

ఉదా : చీకట్లో మాత్రమే సంచరించే బొద్దింక చీకటి ప్రాంతానికి వెళ్లగానే అతిస్వల్పంగా షాక్‌కొట్టేట్లు చేస్తే, కొద్దికాలానికి చీకట్లో సంచరించడం మానివేస్తుంది.

శాస్త్రీయ నిబంధనా సిద్ధాంత నియమాలు

1. కాలవ్యవధి నియమం

సహజ, అసహజ ఉద్దీపనలను ప్రవేశపెట్టడంలో మధ్యగల కాలవ్యవధి ఎంత తక్కువగా ఉంటే, నిబంధిత అభ్యసనం అంత సమర్థవంతంగా జరుగుతుంది.

✧ సహజ, అసహజ ఉద్దీపనలను ప్రవేశపెట్టడంలో మధ్యగల కాలవ్యవధి ఎక్కువగా ఉంటే నిబంధిత అభ్యసనం సరిగ్గా జరగక కాలవ్యవధి, అభ్యసనం విలోమానుగుణంగా ఉంటాయి.

2. పునర్బలనం

అసహజ ఉద్దీపనకు, సహజ ఉద్దీపనను జోడించడం ఎంత ఎక్కువగా జరిగితే, నిబంధిత ప్రతిస్పందన అంత బలంగా ఏర్పడుతుంది.

✧ గంటను మోగించిన ప్రతిసారీ ఆహారాన్ని ఇవ్వడం వల్ల గంట శబ్దానికి లాలాజలం స్రవించడం బలంగా ఏర్పడుతుంది.

✧ దీనిద్వారా **'విద్యార్థులలో మంచి అలవాట్లు'** పెంపొందించవచ్చు.

3. విరమణ/ విలుప్తీకరణం

అసహజ ఉద్దీపనకు సహజ ఉద్దీపనను జోడించడం తగ్గించినట్లయితే నిబంధిత ప్రతిస్పందన తగ్గిపోతుంది.

✧ గంట కొట్టిన ప్రతిసారీ ఆహారాన్ని ఇవ్వడం తగ్గించినట్లయితే గంట శబ్దానికి లాలాజలం స్రవించడం తగ్గుతుంది. దీనిద్వారా **'విద్యార్థులలో చెడు అలవాట్ల'**ను తొలగించవచ్చు.

4. ఆయత్నసిద్ధస్వాస్థ్యం

నిబంధన విరమణ జరిగినప్పటికీ ఉన్నట్లుండి, నిబంధిత ప్రతిస్పందన వ్యక్తం కావడం.

✧ గంట శబ్దానికి ఆహారం ఇవ్వడం మానివేసినప్పటికీ ఉన్నట్లుండి గంట శబ్దానికి లాలాజలం స్రవించడం.

✧ ఇది 'పునర్బలన బలం'పై ఆధారపడి ఉంటుంది.

5. సామాన్యీకరణం

అసహజ ఉద్దీపనను పోలిన ఇతర ఉద్దీపనకూ నిబంధిత ప్రతిస్పందన వ్యక్తం కావడం. గంటను పోలిన హారన్, బజర్‌లకూ కుక్క లాలాజలం స్రవించడం.

✧ వాట్సన్ ప్రయోగంలోని ఆల్‌బర్ట్ తెల్ల ఎలుకతోపాటు, తెల్లబొమ్మలకూ భయాన్ని చూపడం.

6. విచక్షణ నియమం

అసహజ ఉద్దీపనను పోలిన ఇతర ఉద్దీపనల నుంచి, అసహజ ఉద్దీపనను గుర్తించి, దీనికి మాత్రమే నిబంధిత ప్రతిస్పందన వ్యక్తం చేయడం.

✧ గంటను పోలిన హారన్, బజర్‌లకు కాకుండా కేవలం గంట శబ్దానికే కుక్క లాలాజలం స్రవించడం.

✧ ఆల్‌బర్ట్ తెల్ల ఎలుకకు మాత్రమే భయాన్ని చూపడం.

7. ఉన్నత క్రమనిబంధనం

అసహజ ఉద్దీపనకు జతపరిచిన ఇతర ఉద్దీపనకూ నిబంధిత ప్రతిస్పందన వ్యక్తం చేయడం.

✧ గంటకు జతపరిచిన దీపానికీ కుక్క లాలాజలం స్రవించడం.

మొదటి క్రమ నిబంధనం

ఆహారం (సహజ ఉద్దీపన) యుసిఎస్
గంట మోగడం (సహజ ఉద్దీపన) సిఎస్2
} – లాలాజలం స్రవించడం (సి.ఆర్)

ఉన్నత క్రమ నిబంధనం

గంట మోగడం (సహజ ఉద్దీపన) యుసిఎస్
దీపం (అసహజ ఉద్దీపన) సిఎస్2
} – లాలాజలం స్రవించడం (సి.ఆర్)

- మొదటి క్రమ నిబంధనం చాలా బలంగా ఉంటేనే, ఉన్నత క్రమ నిబంధనం ఏర్పడుతుంది.



విద్యావిషయక ప్రాధాన్యత

✧ విద్యార్థులతో సామూహిక క్రీడా విన్యాసం, బృందగానం, నృత్యం చేయించడానికి ఈ సూత్రాలు ఉపయోగపడతాయి.

✧ విద్యార్థుల్లో 'క్రమశిక్షణను పెంపొందించడానికి'

✧ పాఠ్యాంశాలవైపు ఆకర్షించడానికి

✧ విద్యార్థులకు 'మర్యాదపూర్వకమైన ప్రవర్తనను' నేర్పించడానికి.

✧ న్యూరోసిస్, భీతులు, వివేకరహిత భయాలు మొదలైన నాడీ రుగ్మతల చికిత్సకు.

✧ అంకెలు, అక్షరాలు, వస్తువులను పరిచయం చేయడానికి.

✧ మూఢనమ్మకాలను రూపు మాపడానికి.

✧ అభ్యసన బదలాయింపును ఉద్దీపనల ద్వారా సాధారణీకరించడానికి.

✧ ప్రవర్తనా వాద చికిత్సలో ఉపయోగించడానికి.

✧ జంతువులను మచ్చిక చేసుకోడానికి.

✧ ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించడానికి.

✧ పూర్వ ప్రాథమిక పాఠశాలలో/ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కొన్ని గుర్తుల ద్వారా విషయాలను నేర్పించడానికి.

✧ భయాలను తొలగించడానికి, పండగలు, సాంప్రదాయాలు పాటించడానికి.

✧ మంచి అలవాట్లను పెంపొందించి, చెడు అలవాట్లను తొలగించడానికి ఈ సిద్ధాంతంలోని సూత్రాలు ఉపయోగపడతాయి.

కార్యసాధక లేదా యాంత్రిక నిబంధన సిద్ధాంతం (ఒపేరంట్ కండిషనింగ్ థియరీ)

✧ పావ్‌లోవ్ ప్రతిపాదించిన శాస్త్రీయ నిబంధనకు భిన్నంగా అమెరికాకు చెందిన బి.ఎఫ్.స్కిన్నర్ ప్రతిపాదించిన మరొక సిద్ధాంతం కార్యసాధక నిబంధనం / పరికరాత్మక నిబంధనం.

✧ యాంత్రిక సహాయంతో ప్రత్యేక పరికరం వల్ల జరిగే ఈ నిబంధనను పరికరాత్మక (యాంత్రిక) నిబంధన అనీ అంటారు. పావురాలపై, ఎలుకలపై విస్తృతంగా ప్రయోగాలు చేసి ఈ సిద్ధాంతాన్ని స్కిన్నర్ ప్రవేశపెట్టారు.

✧ **పావ్‌లోవ్ శాస్త్రీయ నిబంధన సిద్ధాంతం ఎస్-టైప్ నిబంధనమని, స్కిన్నర్ కార్యసాధక నిబంధన సిద్ధాంతం ఆర్-టైప్ నిబంధనమని ప్రసిద్ధికెక్కాయి.**

✧ జీవి వ్యక్తం చేసే ప్రతిస్పందనలు రెండు రకాలని స్కిన్నర్ భావన.

1. రాబట్టిన బహిర్గత ప్రతిస్పందనలు/ బయటకు రాబట్టిన ప్రతిస్పందనలు (నిర్గమాలు) : ఇవి ఉద్దీపనకు ప్రతిగా జరిగే ప్రతిస్పందనలు.

ఉదా : పావ్‌లోవ్ ప్రయోగం.

2. బయటకు వదిలిన ప్రతిస్పందనలు (ఉద్గమాలు) : ఇవి ఉద్దీపన లేకపోయినా జరిగే ప్రతిచర్యలు.

ఉదా : స్కిన్నర్ ప్రయోగం.

✧ పావ్‌లోవ్ ప్రయోగంలో అసహజ ఉద్దీపన ఫలితంగా ప్రవర్తనలో బయటకు రాబట్టిన ప్రతిస్పందనలు సాధ్యమయ్యాయి. కాబట్టి ఆ ప్రవర్తనను ప్రతిస్పందక ప్రవర్తన అంటారు. దానికి భిన్నంగా స్కిన్నర్ ప్రయోగంలో బయటకు వదిలిన ప్రతిస్పందనలు ఉన్నాయి. కాబట్టి ఆ ప్రవర్తనను **కార్యసాధక ప్రవర్తన** అంటారు. ఈ ప్రవర్తన కలిగేలా విశాలం చేసే ప్రక్రియను **'కార్యసాధక నిబంధన'** అంటారు.

ఉద్యోగాలు

ఎస్‌వీఎన్‌ఐటీలో 19 ఖాళీలు

గుజరాత్‌లోని సూరత్‌లో ఉన్న సర్దార్ వల్లభాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్‌వీఎన్‌ఐటీ).. 19 బోధన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు : ప్రొఫెసర్.

విభాగాల వారీ ఖాళీలు : మెకానికల్ ఇంజనీరింగ్-3, కంప్యూటర్ ఇంజనీరింగ్-2, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-5, కెమికల్ ఇంజనీరింగ్-1, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్-5, అప్లైడ్ ఫిజిక్స్-1, అప్లైడ్ మ్యాథమెటిక్స్ అండ్ హ్యుమానిటీస్-2.

అర్హతలు : సంబంధిత విభాగాల్లో పీహెచ్‌డీతోపాటు ఉద్యోగానుభవం.

దరఖాస్తు ఫీజు : రూ.500, ఎస్సీ/ ఎస్టీ/ వికలాంగులకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం : ఆఫ్‌లైన్.

దరఖాస్తు చేరడానికి చివరి తేదీ : ఫిబ్రవరి 16, 2018.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్ : www.svnit.ac.in

30న జైల్‌భరోను జయప్రదం చేయండి

కార్మిక సంఘాల నాయకుల పిలుపు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ

కార్మిక సమస్యలపై ఈ నెల 30వ తేదీ నిర్వహించే జైల్‌భరో కార్యక్రమంలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళీ, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు పి.మురళీ పిలుపునిచ్చారు. శనివారం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్మిక సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడురు.. గతేడాది నవంబర్‌లో కార్మిక సంఘాలన్నీ కలిసి ఢిల్లీలో నిరసన తెలిపాయన్నారు. అయినా ప్రభుత్వం స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మిక సంక్షేమం కోసం చర్యలు తీసుకోకుండా వారిపై దాడులకు పాల్పడడం బాధాకరమని వాపోయారు.



జీపు జాతా

రైతు జీపు జాతాలో 0మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య

ఎన్నికల హామీలు విస్మరించిన ప్రభుత్వాలు

కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య

ప్రజాశక్తి - కంకిపాడు (విజయవాడ)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించాయని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య విమర్శించారు. కృష్ణాజిల్లా కంకిపాడులో బస్టాండ్ సెంటరు నుంచి చల్లపల్లి వరకు జరిగే రైతు జీపు జాతాను కౌలు రైతు సంఘం నాయకులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌలు రైతులను విస్మరిస్తే సహించేది లేదన్నారు. కౌలు రైతులను ఈ క్రాపింగ్‌లో నమోదు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. క్వింటా వడ్లకు కేరళ, కర్ణాటక, తమిళనాడు తరహాలో బోనస్ రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్వామినాధన్ సిఫార్సు ప్రకారం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరను బోనస్‌తో కలిపి రూ.2700గా ప్రకటించాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు రైతులకు ఏ విధంగానూ ఉపయోగంగా లేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి ఇంతవరకు పూర్తిగా రుణమాఫీ చేయలేదని చెప్పారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, బ్యాంకు నుంచి రుణాలు ఇవ్వడం లేదన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ రెండు రోజులపాటు జిల్లా అంతటా పర్యటించి రైతులకు, కౌలు రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.హరిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు పి.రంగారావు, కౌలు రైతు సంఘం నాయకులు వి.రామచంద్రరావు, ఎ.సభాపతి, జె.రవి, వి.శివశంకర్, వి.వెంకటేశ్వరరావు, టి.హరికృష్ణ, సిఐటియు నాయకులు ఎం.రజిని, ఎ.ఉషారాణి, జి.కుమారి తదితరులు పాల్గొన్నారు.

చిన్న కంపెనీలపై దాడులు అన్యాయం

- విత్తనోత్పత్తి రైతులను కాపాడాలి
- వందలాదిగా తరలివచ్చిన రైతులు
- కర్నూలు కలెక్టరేట్ ఎదుట ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా



కర్నూలు కలెక్టరేట్ వద్దకు ర్యాలీగా వస్తున్న రైతులు, ఎపి రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు సిటీ

కార్పొరేట్ కంపెనీలను వదిలి చిన్న విత్తన పరిశ్రమలపై చేస్తున్న దాడులు తక్షణమే ఆపాలని, చిన్న విత్తన పరిశ్రమల మూసివేత వలన నష్టపోతున్న పత్తి విత్తన ఉత్పత్తి రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో కర్నూలు అంబేద్కర్ భవన్ నుంచి వందలాది మంది రైతులు ర్యాలీగా బయల్దేరి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎ.రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా టి.రమేశ్‌కుమార్ మాట్లాడుతూ రైతులు పండించిన పత్తి పంటను చిన్న పరిశ్రమల ద్వారా ప్రాసెసింగ్ చేసుకుని విత్తనాలను ఉత్పత్తి చేస్తున్నారని తెలిపారు. ఈ విత్తనాలపై శుద్ధి చేసి, అన్ని పరీక్షలూ నిర్వహించే చిన్న కంపెనీలపై అధికారుల దాడులు పెరిగిపోయాయని చెప్పారు. కార్పొరేట్ కంపెనీలైన మైకా, మ్యాన్‌శాంటో లాంటి కంపెనీలను వదిలేసి రైతులకు బాసటగా ఉన్న చిన్న కంపెనీలపై దాడులు చేయడం తగదన్నారు. పత్తి విత్తనోత్పత్తి రైతులు విత్తన సంస్థలతో చేసుకున్న ఒప్పందం ప్రకారం పండించిన సీడ్ పత్తిని ప్రాసెసింగ్ చేసుకుంటారని తెలిపారు. ఈ విత్తనాలకు అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ఇటీవల బిటి-3 పత్తి విత్తనాల పేరుతో కార్పొరేట్ కంపెనీలు ప్రభుత్వంపై ఒత్తిడి చేయడంతో వ్యవసాయశాఖ చిన్న కంపెనీలపై నిరంతరం దాడులు చేస్తుందని తెలిపారు. దీంతో రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారని పేర్కొన్నారు. పత్తి విత్తన చిన్న సంస్థల పరిశ్రమలు సక్రమంగా పని చేయకపోవడంతో గత మూడు నాలుగు రోజుల నుంచి యూనిట్లు పూర్తిగా మూసివేశారని తెలిపారు. రైతులు పండించిన సీడ్ పత్తిని ప్రాసెసింగ్‌కు, యూనిట్ల వద్దకు తీసుకురావద్దని చెబుతుండడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. రైతులు ఎకరాకు రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు ఖర్చు చేసి అనేక కష్టనష్టాలు ఎదుర్కొని పండించిన సీడ్ పత్తిని ఇంటి దగ్గర నిల్వ చేసుకోవడంతో గులాబీ రంగు పురుగు పట్టి నష్టం వాటిల్లుతోందని తెలిపారు. అధికారులు తీసుకున్న నిర్ణయం వలన రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రభుత్వం విత్తన సంస్థల ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులతో చర్చించి రైతుల సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎస్.సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జి.రామకృష్ణ, వెంకటేశ్వర్లు, బి.సోమన్న, జెఎన్.శేషయ్య, రైతులు నర్సింహరావు, గోపాలస్వామి, బి.కుమార్, పూర్ణయ్య, మాంసావ్, రంగన్న, బి.జనార్ధన్, వందలాది మంది రైతులు పాల్గొన్నారు.

అవినీతిలో రాష్ట్రం ఫస్ట్

సిపిఐ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - గజపతినగరం(విజయనగరం)

అవినీతిలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. విజయనగరంలో సిపిఐ జిల్లా 12వ మహాసభలు పట్టణంలోని శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో రూ.97 వేల కోట్లు రుణం ఉంటే ప్రస్తుతం రూ.2 లక్షల 20వేల కోట్లుకు చేరిందన్నారు. ఈ అప్పును ఎక్కడ దేనికి ఖర్చు పెట్టారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంతల్లో పశువులను కొన్నట్లుగా ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలకు డబ్బు, మంత్రి పదవులు ఎరచూపి కొనుగోలు చేస్తున్నారని విమర్శించారు. అన్ని ప్రభుత్వశాఖల్లో అవినీతి పేరుకుపోయిందని, లంచం ఇవ్వకుండా ఏ పనీ జరగడంలేదన్నారు. రాష్ట్రంలో 19 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతూనే ఉంటామన్నారు. త్వరలో భూ పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయకార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జిల్లా కార్యదర్శి పి.కామేశ్వరరావు, మాజీ ఎంపి డివిజి శంకరరావు పాల్గొన్నారు.

'సీమ'లో కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు

ప్రజాశక్తి - కర్నూలు/కడప

రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని కడపలో న్యాయవాదులు చేపట్టిన రిలేదీక్షలు శనివారానికి అయిదవ రోజుకు చేరుకున్నాయి. శనివారం జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ భవనం ఎదుట సీమలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సాధన' పై సీమ న్యాయవాదుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలసీమ ప్రజల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు సాగిస్తామని పిలుపునిచ్చారు. సీమలో హైకోర్టు ఏర్పాటు విషయంపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల చీఫ్ జస్టిస్‌లను, మన రాష్ట్ర సిఎంను కలసి వినతిపత్రం అందజేయనున్నటు సదస్సులో తీర్మానించారు. సదస్సులో కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు మస్తాన్‌వలి,నాగలక్ష్మిదేవి, బార్ కౌన్సిలర్ మెంబర్స్ రామిరెడ్డి, ధ్వారకనాథరెడ్డి, రవి గేవేర, కడప మాజీ బార్‌అసోసియేషన్ అధ్యక్షులు జి.వి.రాఘవరెడ్డి, ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పులికుంట ప్రమోద్ కుమార్, నాలుగు జిల్లాల న్యాయవాదులు పాల్గొన్నారు. ఫిబ్రవరి రెండవ తేదీ వరకు రిలేదీక్షలు చేపడతాయని, విధులు బహిష్కరిస్తామని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లో న్యాయవాదులు చేపట్టిన దీక్షలు 7వ రోజు కొనసాగాయి. ఆళ్లగడ్డ పట్టణ న్యాయవాదులకు కర్నూలుకు వచ్చి దీక్షలకు మద్దతు తెలియజేశారు. ఫిబ్రవరి 1వ తేజీ జిల్లా బంద్‌కు పిలుపునిచ్చినట్లు బార్ అసోసియేషన్ నాయకులు తెలిపారు.



సదస్సులో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

కాకినాడ జిజిహెచ్ పారిశుధ్య కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

వేతన బకాయిలు చెల్లించాలని, నూతన వేతన ఒప్పందం అమలు చేయాలని తూర్పుగోదావరి జిల్లా కాకినాడ జిజిహెచ్ పారిశుధ్య కార్మికులు ధర్నా శనివారం కూడా కొనసాగింది. మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆసుపత్రి మాతా శిశు విభాగం ఎదుట వారు ధర్నాకు దిగారు. ఈ ధర్నానుద్దేశించి సిఐటియు నగర ఉపాధ్యక్షులు పలివెల వీరబాబు మాట్లాడారు. ఉభయగోదావరి జిల్లాలకు ఆరోగ్య ప్రదాయినిగా కాకినాడ జిల్లా ప్రభుత్వాసుపత్రి ఉందన్నారు. ఇందులో అత్యంత కీలకమైంది పారిశుధ్య విభాగమేనన్నారు. సుమారు 2వేల మంది ఇన్‌పేషెంట్లు, 3 వేలకు పైగా అవుట్ పేషెంట్లు ఉన్న జిజిహెచ్ పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. 2017 జులై 31తో పారిశుధ్య నిర్వహణ కాంట్రాక్టు ముగిసిందన్నారు. నేటికి నూతన కాంట్రాక్ట్ గురించి ఉత్తర్వులు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. అప్పటినుంచి కార్మికులు విధులు నిర్వహిస్తున్నా వేతనాలు మాత్రం ఇవ్వట్లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో పారిశుధ్య కార్మికులు జె.శేషు, ఆర్.రమేష్, శారద, జెవి.రామారావు, బుచ్చెమ్మ, దుర్గ, సిపిఎం నగర కమిటీ సభ్యులు ఏసూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతో దాడులకు అడ్డుకట్ట

- ఫిబ్రవరిలో చలో గుంటూరు
- పెదగొట్టిపాడు దళిత బాధిత పోరాట కమిటీ తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో దళితులపై భౌతిక దాడుల్ని ఐక్యంగా తిప్పికొట్టాలని, దీని కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించాలని పెదగొట్టిపాడు దళిత బాధితుల పోరాట సంఘీభావ కమిటీ తీర్మానించింది. కమిటీ కన్వీనర్ జి.శాంతకుమార్ అధ్యక్షతన గొట్టిపాడు ఘటనపై భవిష్యత్ కార్యాచరణ కోసం గుంటూరులో శనివారం సమావేశం నిర్వహించారు. ఇటీవల కాలంలో గరగపర్రు, తుందుర్రు, దేవరంపాడు, పచ్చికాపుల్లం, గొట్టిపాడు తదితర ప్రాంతాల్లో దళితులపై జరుగుతున్న దాడులు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. పెత్తందారుల దాడికి గురైన దళితులకు న్యాయం చేయాలని కోరుతూ దశల వారీగా చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా ఫిబ్రవరి చివరి వారంలో చలో గుంటూరు కార్యక్రమం నిర్వహించాలని, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు, దళిత ప్రజాసంఘాలు, ప్రజలు ఈ కార్యక్రమానికి తరలి రావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈలోగా ఫిబ్రవరి నెలలో ప్రతి జిల్లాలో రౌండ్‌టేబుల్ సమావేశాలు, సదస్సులు, ధర్నాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈనెల 24న చలో గొట్టిపాడు సందర్భంగా వామపక్షాలు, దళిత, ప్రజాసంఘాల నేతల అరెస్ట్‌కు నిరసగా గొట్టిపాడులో దళిత మహిళల పోరాటం స్ఫూర్తిదాయకమని సమావేశం పేర్కొంది.

బాధితులకు న్యాయం జరిగే వరకూ ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దడాల సుబ్బారావు, వి.కృష్ణయ్య, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మల్యాద్రి, న్యాయవాది వైకె, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు, డిబిఎఫ్ నాయకులు కొరివి వినయ్‌కుమార్, సిపిఐ(ఎంఎల్) రెడ్‌స్టార్, బిఎస్‌పి, పౌర హక్కుల నేతలు, గొట్టిపాడు దళితవాడ నాయకులు పెదభాగ్యమ్మతోపాటు ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజ్ఞ జవాబులు

1. జ్యోతి ప్రకాష్ నిరాల
2. మహాత్మా గాంధీ సర్బత్ వికాస్ యోజన
3. వి నారాయణన్
4. సినిమా రంగం (పశ్చిమ బెంగాల్)
5. కోల్‌కతా

హోదా కోసం నల్ల రిబ్బన్లతో నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు)

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ నాన్ పొలిటికల్ జెఎసి ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా మంగళగిరిలో శనివారం నిరసన తెలిపారు. తొలుత అంబేద్కర్ విగ్రహం వద్ద గల కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు అప్పికట్ల శ్రీహరినాయుడు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని టిడిపి, బిజెపి ప్రభుత్వాలు ఎన్నికల ముందు వాగ్దానాలు చేశాయని, ఇప్పుడు అమలు చేయకుండా మాట మార్చి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని అన్నారు. ఇప్పటికైనా బిజెపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకపోతే రానున్న ఎన్నికల్లో తుడిచి పెట్టుకుపోతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నవ్యాంధ్ర విద్యార్థి జెఎసి రాష్ట్ర అధ్యక్షులు అయ్యస్వామి, నాన్ పొలిటికల్ జెఎసి నాయకులు సిహెచ్.అజయ్‌కుమార్, కొల్లి నాగేశ్వరరావు, శింది బాలకృష్ణ, యూనివర్సిటీల కన్వీనర్ రాజన్న, జిల్లా కార్యదర్శి బి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.



నల్లరిబ్బన్లతో నిరసన తెలియజేస్తున్న జెఎసి నాయకులు

'స్వామినాథన్' సిఫార్సులు అమలైనప్పుడే రైతుల ఆత్మహత్యల నివారణ

రైతాంగ ప్రయోజనాల పరిరక్షణ సదస్సులో వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి- గుంటూరు సిటీ ప్రతినిధి

స్వామినాథన్ కమిటీ సిఫార్సు మేరకు ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అదనంగా జతచేసి కనీస మద్దతు ధరను ప్రకటించినప్పుడే రైతుల ఆత్మహత్యలు తగ్గుతాయని మాజీ మంత్రి, రైతాంగ రక్షణ వేదిక కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డలో శనివారం రైతాంగ ప్రయోజనాల పరిరక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సదస్సుకు అధ్యక్షతన వహించిన శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. స్వామినాథన్ చేసిన సిఫార్సులన్నింటినీ అమలు చేయాలని, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర ఉండేలా పార్లమెంటులో బిల్లు ఆమోదించి చట్టం తేవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టానికి సవరణలు చేయడం ద్వారా రైతాంగ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని విమర్శించారు. రైతుల సంక్షేమాన్ని విస్మరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి నామాలు పెడుతున్నాయని చెప్పారు. రైతుకూలీ సంఘం నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మార్చి 25న ఢిల్లీలో జాతీయ స్థాయి రైతు సభను నిర్వహించి రైతు సమస్యలకు తగిన పరిష్కారం కనుగొనాలన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఏపి రాజధాని రైతు, రైతు కూలీల హక్కుల సంఘం కార్యదర్శి అనుమోలు గాంధీ, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.కేశవరావు, పి.పెద్దిరెడ్డి, హైకోర్టు మాజీ న్యాయమూర్తి లక్ష్మారెడ్డి, అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు రావుల వెంకయ్య, నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రాజమోహన్ పాల్గొన్నారు.

శంఖారావం

గిరిజనుల పొట్టగొడితే టిడిపికి పుట్టగతులుండవ్

- గిరిజన సంఘం నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అన్ని రంగాలలో వెనుకబడి ఉన్న గిరిజనుల జీవితాలతో చెలగాటమాడి వారి పొట్టగొడితే టిడిపికి పుట్టగతులు లేకుండా చేస్తామని పలువురు గిరిజన సంఘం నాయకులు పేర్కొన్నారు. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చే నిర్ణయాన్ని ఉప సంహరించాలని డిమాండ్ చేస్తూ గిరిజన జెఎసి ఆధ్వర్యంలో అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణంలో గిరిజనుల ఆత్మగౌరవ శంఖారావాన్ని శనివారం నిర్వహించారు. గిరిజన జెఎసి కన్వీనర్ వడిత్యా శంకర్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు కేశవ్‌నాయక్, రిటైర్డు ఎస్‌పి రవీంద్ర నాయక్, డిప్యూటీ మేయర్ సాకే గంపన్న, ఎపి గిరిజన సంఘం అధ్యక్షులు కాలే నాయక్, యాంకర్ మంగ్లీ బాయి, గాయకుడు భిక్షూ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఓట్ల రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి ప్రభుత్వం స్పందించి వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలన్నారు. అనంతపురం నుంచి ప్రారంభమైన గిరిజన శంఖారావం శ్రీకాకుళం వరకు నిర్వహిస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



అనంతపురంలో అభివాదం చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

సంక్షిప్తం

ఇరిగేషన్ అధికారులపై మంత్రి పత్తిపాటి ఆగ్రహం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పెండింగ్ పనులపై దృష్టి సారించి పదిరోజుల్లోపు పనులు పూర్తి చేయకపోతే సస్పెండ్ చేస్తామని జలవనరుల శాఖ ఎస్‌ఇ రఘునాథ్‌ని జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు హెచ్చరించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్‌కు ఆదేశాలు జారీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన జిల్లా సమీక్షా సమావేశానికి పుల్లారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జలవనరుల శాఖ పనితీరుపై మంత్రులతో పాటు జిల్లాలోని శాసన సభ్యులంతా అసంతృప్తిని వ్యక్తం చేశారు. పాలకొల్లు శాసన సభ్యులు నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ గోదావరి డెల్టా ఆధునికీకరణ పనులు మూడు సంవత్సరాలుగా నత్తనడకన సాగుతున్నాయని, ఈ విషయంలో జలవనరుల శాఖ పనితీరు అధ్వానంగా ఉందన్నారు.

నిడదవోలులో జన్మభూమి రైలుకు హాల్ట్ ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి - నిడదవోలు (పశ్చిమగోదావరి)

పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు రైల్వేస్టేషన్‌లో జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ సదుపాయం కల్పించాలని, లేకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని, ఎంపి మురళీమోహన్‌ను నిలదీస్తామని అఖిలపక్ష నాయకులు హెచ్చరించారు. నిడదవోలు రైల్వేస్టేషన్‌లో జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు హాల్టు ఇవ్వాలని, వచ్చేనెల ఒకటో తేదీన రైల్వేబడ్జెట్ నేపథ్యంలో పార్లమెంట్‌లో ఎంపి మురళీమోహన్ మాట్లాడాలని డిమాండ్ చేస్తూ శనివారం నిడదవోలు రైల్వేస్టేషన్ వద్ద అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.



డైరీ ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం, యుఇఇయు రాష్ట్ర అధ్యక్షులు డి. సూరిబాబు,సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.మోహన్‌రావు, తదితరులు

యుఇఇయు డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నెల్లూరు

నెల్లూరు నగరం బాలాజీనగర్‌లోని దామవరపు చెన్నమ్మ భవన్‌లో శనివారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(యుఇఇయు) 2018 డైరీని ఎంఎల్‌సి విటపు బాలసుబ్రమణ్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ డైరీలో కార్మిక చట్టాలు, ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంల ఆర్డర్లు ఉంటాయని, కార్మిక వర్గానికి చెందిన సమాచారం దొరుకుతుందన్నారు. ప్రతి ఉద్యోగి కార్మిక చట్టాలను తెలుసు కోవాల్సిన అవసరముందన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దుగ్గిరాల సూరిబాబు మాట్లాడుతూ డైరీలో కార్మికులకు వర్తించే సెలవులు, జీతభత్యాలకు సంబంధించిన వివరాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.మోహన్‌రావు, యుఇఇయు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వాసిరెడ్డి సుధాకరావు, షేక్ జాకీర్‌హుస్సేన్, కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

త్రిపుర, మేఘాలయ ఎన్నికలకు కాంగ్రెస్ తొలి జాబితా

న్యూఢిల్లీ : త్రిపుర, మేఘాలయ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల జాబితాను కాంగ్రెస్ శనివారం విడుదల చేసింది. మేఘాలయకు 57 మంది, త్రిపురకు 56 మంది అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. కాంగ్రెస్ విడుదల చేసిన జాబితా మేరకు మేఘాలయ ముఖ్యమంత్రి ముకుల్ సంగ్మా సాంగ్సాక్, అంపతి నియోజకవర్గాలు రెండింటిలోనూ పోటీ చేయనున్నారు. త్రిపుర అసెంబ్లీకి ఫిబ్రవరి 18న ఎన్నికలు జరగనుండగా, నాగాలాండ్, మేఘాలయ అసెంబ్లీలకు ఫిబ్రవరి 27న ఎన్నికలు జరగనున్నాయి. ఈ మూడు రాష్ట్రాల్లోనూ మార్చి 3న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

పల్స్ పోలియో

దేశవ్యాప్త పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా శనివారం రాష్ట్రపతి భవన్‌లో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్



2017లో భారత్-జపాన్ సంబంధాలలో పురోగతి

జపాన్ విదేశాంగ మంత్రి టోరో కానో

టోక్యో : భారత్-జపాన్ వ్యూహాత్మక సంబంధాలలో 2017 ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న సంవత్సరమని జపాన్ విదేశాంగ మంత్రి టారో కొనో పేర్కొన్నారు. భారత్-జపాన్ మధ్య సంబంధాలలో 2017లో చెప్పుకోతగ్గ పురోగతి కనిపించిందని ఆయన ప్రశంసించారు. జపాన్‌లోని భారత రాయబార కార్యాలయంలో భారత దౌత్యాధికారి సుజన్ ఆర్.చినయ్ నిర్వహించిన గణ తంత్ర వేడుకల్లో కొనొ అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రిపబ్లిక్ డే సందర్భంగా భారతీయులను ఆయన హృదయపూర్వకంగా అభినందించారు. భారత్‌కు చెందిన ఒక ముఖ్యమైన కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించినందుకు అందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ భారత్, జపాన్‌లు వ్యూహాత్మక భాగస్వాములని చెప్పారు. ప్రజాస్వామ్యం, మానవ హక్కులు, చట్ట పాలన తదితర విలువైన అంశాలలో రెండు దేశాల మధ్య భాగస్వామ్యానికి ప్రాధాన్యత ఉందన్నారు. భారత ప్రభుత్వ ఆహ్వానంపై తాను గత ఏడాది అక్కడ పర్యటించినప్పుడు రెండు దేశాల మధ్య సన్నిహిత సంబంధాలను ప్రత్యక్షంగా చూశానన్నారు. రెండు దేశాల మధ్య స్నేహ, గౌరవాల సంబంధాల ప్రాధాన్యతను గుర్తించానన్నారు. 2017లో రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలలో ఎన్నో సానుకూల పరిణామాలు చోటుచేసుకున్నాయని కోనో చెప్పారు. జపాన్ ప్రధాన మంత్రి షింజో అబే గత ఏడాది గుజరాత్‌లో పర్యటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

పుణే మహిళ సూసైడ్ బాంబర్ కాదు

కాశ్మీర్ పోలీసులు

శ్రీనగర్ : ఆత్మాహుతి దాడికి పాల్పడేందుకు యత్నిస్తుందన్న అనుమానంతో అరెస్టు చేసిన పుణే మహిళ సూసైడ్ బాంబర్ కాదని జమ్మూకాశ్మీర్ పోలీసులు స్పష్టం చేశారు. ఆమె ఆత్మాహుతి దాడులకు పథకం చేసినట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని, అయితే ఆమెపై విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పుణేకు చెందిన 18 ఏళ్ల సదియా అన్వర్ షేక్ అనే యువతిని ఆత్మాహుతి బాంబుగా అనుమానిస్తూ గురువారం అరెస్టు చేశారు. ఆమె సూసైడ్ బాంబర్ కాదని పోలీసులు శనివారం తెలిపారు. శ్రీనగర్‌లోని మహిళా పోలీస్ స్టేషన్‌లో ప్రస్తుతం ఆమె విచారిస్తున్నారు. సదియా అన్వర్ గత చరిత్ర గురించి మహారాష్ట్ర ఉగ్రవాద నిరోధక బృందంతోపాటు జాతీయ దర్యాప్తు సంస్థల నుండి కూడా జమ్మూ పోలీసులు సమాచారం సేకరిస్తున్నారు. పుణేలో సంపన్న వ్యాపార కుటుంబానికి సదియా 16 ఏళ్ల వయస్సులోనే సామాజిక మీడియాల ద్వారా ఇస్లామిక్ ఉగ్రవాదం వైపు ఆకర్షితురాలయిందనీ, అలాగే గత ఏడాదిలో ఆమెకు వివాహం చేస్తామని కుటుంబ సభ్యులు ప్రతిపాదించినప్పటి నుంచీ కనిపించకుండా పోయిందని సమాచారం.

సైన్యం కాల్పుల్లో ఇద్దరు మృతి

9 మందికి గాయాలు

శ్రీనగర్ : దక్షిణ జమ్మూ కాశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో శనివారం మధ్యాహ్నం ఆందోళనకారులపై సైన్యం జరిపిన కాల్పుల్లో ఇద్దరు మృతి చెందగా, మరో 9 మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. షోపియన్ పూర్‌తో పాటు కాశ్మీర్ లోయలోని కొన్ని ప్రాంతాలలో బుధవారం నుంచి ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఉగ్రవాదులకు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన కాల్పుల్లో ఒక స్థానిక టీనేజర్‌తో పాటు, ఇద్దరు ఉగ్రవాదులు మృతి చెందారు. ఇద్దరు బాలికలకు తీవ్రంగా గాయాలయ్యాయి. దీనిపై ఆయా ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఘర్షణలు హింసాత్మకంగా మారాయి. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం సైన్యానికి చెందిన కాన్వాయ్‌పై షోపియన్ జిల్లాలోని గనోవ్‌పొరా గ్రామానికి చెందిన కొంతమంది దాడి చేశారు. దీంతో కాన్వాయ్‌లో వున్న సైనికులు వారిపై కాల్పులు జరిపారు. ఈ ఘటనకు సబంధించి జమ్మూ కాశ్మీర్ పోలీసులు సైన్యంపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

జుమా నమాజ్‌కు మహిళా ఇమామ్

కేరళలో అపూర్వ, అరుదైన ఘటన

తిరువనంతపురం : కేరళలో అపూర్వ ఘటన చోటుచేసుకుంది. దేశంలోనే తొలిసారిగా కేరళలో ఒక ముస్లిం మహిళ శుక్రవారం నిర్వహించే జుమా నమాజ్‌కు ఇమామ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఉత్తర కేరళలోని మల్లప్పురంలో ఈ అరుదైన ఘటన చోటుచేసుకుంది. ఖురాన్ సన్నెట్ సొసైటీ ఆధ్వర్యంలో ముస్లింలకు శుభప్రదమైనదిగా భావించే రోజైన శుక్రవారం ప్రార్థనకు జమితా టీచర్ (34) నేతృత్వం వహించారు. 'ఈ దశను చేరుకోవడానికి పలువురి నుంచి నేను విమర్శలను ఎదుర్కొన్నాను. మహిళలు ఈ పదవిని చేపట్టడం, ఈ అధికారాన్ని పొందడం ఇష్టపడని పురుషులు అనేకమంది ఉన్నారు. స్త్రీ, పురుషుల మధ్య ఎలాంటి వివక్షా లేదని ఖురాన్‌లో స్పష్టంగా ఉన్నది' అని ఇమామ్ జమితా టీచర్ చెప్పారు. జమితా టీచర్‌కు ఈ గౌరవం అంత సులభంగా ఏమీ రాలేదు. ఆ మతంలో ఉన్న వివక్షను ప్రశ్నిస్తూ, తన అభిప్రాయాలను చాలా బలంగా వినిపించిన.. ఆమెపై చంపేస్తామంటూ బెదిరింపులు సైతం వచ్చాయి.

పద్మావత్ ప్రదర్శిస్తున్న థియేటర్‌పై బాంబు దాడి

(మొదటిపేజీ తరువాయి)

థియేటర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. దీంతో థియేటర్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుల కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. కాగా, ఈ బాంబు దాడితో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. దక్షిణ భారతంలో ఈ చిత్రప్రదర్శనకు ఎలాంటి ఆటంకాలు లేవని భావిస్తున్న తరుణంలో ఈ బాంబు విసరడం గమనార్హం.

ఆందోళనలు అనవసరం : ఢిల్లీ డిప్యూటీ సిఎం సిసోడియా

పద్మావత్ సినిమాలో ఎటువంటి అభ్యంతరకర సన్నివేశాలూ లేవని, ఆందోళనలు చేయాల్సిన అవసరంలేదని ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా తెలిపారు. స్థానిక థియేటర్లో శుక్రవారం రాత్రి ఆయన పద్మావత్ సినిమాను చూశారు. అనంతం సిసోడియా మాట్లాడుతూ తనతో పాటు కొంతమంది రాజ్‌పుత్ సభ్యులు కూడా ఈ సినిమాను చూశారన్నారు. రాజ్‌పుత్‌లు నిరసిస్తున్నట్లుగా ఈ సినిమాలో చరిత్రను వక్రీకరించిన సన్నివేశాల్లేవని ఆయన పేర్కొన్నారు. పద్మావత్‌ను నిషేధించాలని హర్యానా, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ వంటి రాష్ట్రాలలో రాజ్‌పుత్‌లకు చెందిన కర్ణిసేనలు ఆందోళనలు, నిరసనలు చేస్తున్న సంగతి తెలిసిందే.

రేపటి నుంచి పార్లమెంట్ సమావేశాలు

ఫిబ్రవరి 1న వార్షిక బడ్జెట్...

జనవరి 31న ఆర్థిక సర్వే

సాధారణ ఎన్నికలకు ముందు చివరి పూర్తిస్థాయి బడ్జెట్

బిజెపి సర్కారుకు వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఐక్యత

రెబల్‌జడ్జీలు, పద్మావత్‌పై హాట్ హాట్ !

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 1వ తేదీన 2018-19 వార్షిక బడ్జెట్‌ను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ సభలో ప్రవేశపెట్టనున్నారు. అందుకు ఒకరోజు ముందుగా అంటే జనవరి 31న కేంద్ర ఆర్థిక సర్వేను జైట్లీ సభ ముందుంచనున్నారు. ఉభయసభలనుద్దేశించి సోమవారం ఉదయం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేసే ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. జనవరి 29న ప్రారంభమయ్యే ఈ సమావేశాలు ఫిబ్రవరి 9తో ముగియనున్నాయి. ఇక రెండో దఫా బడ్జెట్ సమావే శాలు మార్చి 5న ప్రారంభమై ఏప్రిల్ 6వ తేదీతో పూర్తికానున్నాయి. మోడీ సర్కారు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ట్రిపుల్ తలాక్ బిల్లుతో పాటు ఓబీసీ కమిషన్ బిల్లును ఈ సమావేశాల్లో



ఆమోదించుకోవాలన్న పట్టుదలతో ఉంది. కాగా ఈ సమావేశాల్లో పద్మావత్ అంశంతో పాటు సుప్రీంకోర్టు జడ్జీల విషయం పార్లమెంట్‌ను కుదిపేయ నుంది. మరోవైపు ఈ సమావేశాలు సజావుగా సాగేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని కేంద్రం కోరింది.

ఇందుకు నేడు(ఆదివారం) రెండు అఖిల పక్ష సమావేశాలకు పిలుపు నిచ్చింది. పార్లమెంట్ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ నేతృత్వంలో ఒకటి, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ అధ్యక్షతన మరొకటి సమావేశం జరగనుంది. కాగా కేంద్ర సర్కారుకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఐక్యమవుతున్నాయి. 2019 సాధారణ ఎన్నికలకు ముందు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఈ నేపథ్యంలో మధ్యతరగతి వర్గానికి కొన్ని మినహాయింపులు ఇవ్వాలన్న ఉద్దేశంతో ఉన్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80-సీ పరిమితిని పెంచాలని భావిస్తున్నట్టు సంబంధిత వర్గాల సమాచారం. అదే సమయంలో ట్రిపుల్ తలాక్ బిల్లును ఎట్టిపరిస్థితుల్లో మొదటి దఫా సమావేశాల్లోనే గట్టెక్కించాలన్న పట్టుదలతో ఉంది. ట్రిపుల్ తలాక్ పద్ధతిని పాటించిన వారికి మూడేండ్ల జైలు శిక్ష విధించాలన్న కేంద్ర నిర్ణయంపై ప్రతిపక్షాలు వ్యతిరేకత వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లు ప్రస్తుతం రాజ్యసభలో పెండింగ్‌లో ఉంది. ఇక ఓబీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పిస్తూ తీసుకొచ్చిన బిల్లును సైతం ఆమోదించుకోవాలని కేంద్రం భావిస్తోంది. ఇక రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తొలిసారి ఉభయ సభలనుద్దేశించి ప్రసంగం చేయనున్నారు.

ప్రతిపక్షాల సమావేశం...

కేంద్రంలోని మోడీ సర్కారుకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఏకమవుతున్నాయి. బిజెపి సర్కారు అవలంబిస్తున్న ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యతిరేక విధానాలపై విపక్షాలు గుర్రుగా ఉన్నాయి. విపక్షాల సమావేశానికి ఎన్సీపీ అధినేత శరద్‌పవార్ నేతృత్వం వహిస్తున్నారు. ఇప్పటికే జనవరి 26వ తేదీన ముంబయిలో 'రాజ్యాంగం పరిరక్షించండి' అంటూ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీకి సీపీఐ నేత డీ రాజాతో పాటు శరద్ యాదవ్, ఒమర్ అబ్దుల్లా, సుశీల్‌కుమార్ షిండే, దినేష్ త్రివేది, హార్దిక్‌పటేల్ తదితరులు హజరయ్యారు. ఈ నేపథ్యంలో 29వ తేదీన మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు.

తుఫాను సృష్టించనున్న పద్మావత్, రెబల్ జడ్జిల అంశం

బడ్జెట్ పార్లమెంట్ మొదటి దఫా సమావేశాల్లో సుప్రీంకోర్టు రెబల్ జడ్జీల అంశంతో పాటు పద్మావత్ వ్యవహారం తుఫాను సృష్టించే అవకాశం ఉంది. ముఖ్యంగా పద్మావత్ సినిమా విడుదల విషయంలో బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించిన తీరు, కర్ణిసేన విధ్వంసకాండపై విపక్షాలు కేంద్రాన్ని నిలదీయాలని భావిస్తున్నాయి. ప్రతిపక్షాలు రెబల్ జడ్జిల అంశాన్ని కూడా తెరపైకి తెచ్చేలా పావులు కదుపుతున్నాయి.

ప్రజా మానిఫెస్టోను సిద్ధం చేయండి : రాహుల్

కర్ణాటక ఎన్నికలకు కొత్త వ్యూహం

న్యూఢిల్లీ : కర్ణాటకలో ఎన్నికల నేపథ్యంలో ప్రజా మానిఫెస్టోను సిద్ధం చేసి, ప్రజలకు చేరువయ్యే విధంగా కార్యక్రమాలను చేపట్టాలని పార్టీ నేతలను కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కోరారు. ఇటీవల గుజరాత్ ఎన్నికల ప్రచారంలో కూడా అనుసరించిన విధానాన్నే కర్ణాటక ఎన్నికల సందర్భంగా అనుసరించాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. కాంగ్రెస్ నేత వీరప్పమొయిలీ నేతృత్వంలోని బృందం ఇప్పటికే ఎన్నికల మానిఫెస్టోను రూపొందించేందుకు రంగంలోకి దిగింది. కర్ణాటక ప్రజల ఆశలను ప్రతిబింబించే మానిఫెస్టోతో రావాలని పార్టీ నాయకులకు రాహుల్ కోరారు. అన్ని వర్గాల నుండి కాంగ్రెస్ అభిప్రాయాన్ని తెలుసుకోనుందని ఎఐసిసి కర్ణాటక విభాగం సెక్రటరీ ఇన్‌చార్జ్ మధు గౌడ్ యాష్కీ పేర్కొన్నారు. ముఖ్యంగా విద్య, ఆరోగ్యం, చిన్న మధ్యతరహా పరిశ్రమలు, ఉపాధి కల్పన, పర్యావరణ పరిరక్షణపై ఈ మానిఫెస్టోలో దృష్టి పెట్టారు.

అస్సాంలో రైళ్ల దిగ్బంధం

రెండు రోజులుగా నిలిచిపోయిన రైళ్ళు

దిమాస జిల్లాను గ్రేటర్ నాగాలాండ్‌లో కలపొద్దని ఆందోళన

పోలీసుల కాల్పులు-ఇద్దరు మృతి

గువహతి : అస్సాంలో రెండు రోజులుగా రైళ్ల నిలిచిపోయాయి. ప్రధానంగా సిలిచార్-గువహతి మార్గంలో రైళ్లకు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో దాదాపు 2 వేల మంది ప్రయాణికులు గమ్య స్థానాలు చేరలేక మధ్యలోనే చిక్కుకు పోయారు. డిమా హసోవ్ జిల్లాలోని మైబాంగ్ ప్రాంతంలో గురువారం పోలీసుల కాల్పుల్లో ఇద్దరు మృతి చెందడంతో అల్లర్లు చెలరేగాయి. ఈ నేపథ్యంలో అధికారులు నిరవధిక కర్ఫ్యూ విధించారు. గ్రేటర్ నాగాలాండ్‌లో దిమాస జిల్లాను చేర్చడాన్ని నిరసిస్తూ ఆ ప్రాంతంలోని వందలాది మంది దిమాస గిరిజనులు నిరసన ఆందోళన చేపట్టారు. నిరసన చేస్తున్న గిరిజనులను చెదరగొట్టేందుకు పోలీసులు కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో ఇద్దరు మృతి చెందారు. ఆందోళనల కారణంగా దక్షిణ అస్సాం, మిజోరం, త్రిపురల్లో పూర్తిగా స్తంభించాయని నార్త్‌ఈస్ట్ ఫ్రాంటియర్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ప్రణవ్‌జ్యోతి శర్మ తెలిపారు. రైల్వే స్టేషన్లలో ప్రయాణికులు ఇప్పటికే 24 గంటలకు పైగా వేచి ఉన్నారన్నారు రైల్వే ఆస్తులను తగల బెట్టడమే కాకుండా రైలు ట్రాక్‌ను తీవ్రంగా ధ్వంసం చేశారన్నారు. ట్రాక్ భద్రతకు తగినహామీ లేకుడా తాము రైళ్ళను నడపలేమన్నారు. అందువల్ల ప్రయాణీకులను రోడ్డు మార్గంలో తరలించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. దిమా హసావో జిల్లా కేంద్రమైన హఫ్లాంగ్‌లో శుక్రవారం సాయంత్రం మృతి చెందిన వారి భౌతిక కాయాలను తీసుకెళ్ళే సందర్భంగా ఆందోళనకారులు మౌనంగా ర్యాలీ నిర్వహించారు. గురువారం జరిగిన పోలీసు కాల్పులను నిరసిస్తూ పలు గిరిజన సంఘాలు, సంస్థలు దిమా హసోవ్ జిల్లాలో 48 గంటల బంద్‌కు పిలుపునిచ్చాయి.

తమిళనాడు మాజీ రవాణా శాఖ మంత్రి అరెస్ట్

చెన్నై : తమిళనాడు మాజీ రవాణా శాఖ మంత్రి వి.సెంథిల్ బాలాజీతో పాటు, ఆయన మద్దతుదారులు 60 మందిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ఎంజిఆర్ వర్ధంతి సందర్భంగా బహిరంగ సభ నిర్వహించేందుకు పోలీసులు అనుమతి తిరస్కరించడంతో, దానికి నిరసనగా కరూర్ వద్ద రోడ్డును దిగ్బంధించడానికి ప్రయత్నించినందుకు వారిని పోలీసులు అరెస్టు చేశారు. అన్నాడిఎంకె బహిష్కృత నేత, ఎమ్మెల్యే టి.టి.డి దినకరన్ ప్రసంగించే సమావేశానికి అనుమతినివ్వాలని పోలీసులను సెంథిల్ కోరారు. తొలుత సెంథిల్ బాలాజీతో పాటు 46 మందిని అరెస్టు చేశామని, ఆ తర్వాత మరో 14 మంది అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు.

హోంవర్క్ చేయలేదని బాలికకు 168 చెంపదెబ్బలు

ఝూబౌ (మధ్యప్రదేశ్) : హోంవర్క్ చేయలేదనే చిన్నకారణంతో 12 ఏళ్ల బాలికను తోటి విద్యార్థులతో ఆరు రోజుల పాటు 168 చెంపదెబ్బలు కొట్టించిన సంఘటన మధ్యప్రదేశ్‌లోని ఒక నవోదయ విద్యాలయలో జరిగింది. సైన్స్ టీచర్ ఈ శిక్ష విధించారు. ఈ ఘటనపై పోలీసులకు బాలిక తండ్రి ఈ ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలోని ఝూబౌ జిల్లాలోని తాండ్ల టౌన్‌లో నవోదయ విద్యాలయలో 6వ తరగతి చదువుతున్న బాలిక హోం వర్క్ చేయలేదు. దీంతో తోటి 14 మంది విద్యార్థులు చేత రోజుకు రెండుసార్లు బాలికకు చెంపదెబ్బల శిక్షను సైన్స్ టీచర్ మనోజ్ కుమార్ వర్మ విధించారు. దీంతో ఈ నెల 11 నుంచి 16 వరకూ బాలికకు 168 చెంప దెబ్బలు కొట్టారు. దీంతో బాలిక భయానికి గురయ్యె, పాఠశాలకు వెళ్లడానికి నిరాకరిస్తోంది. అనారోగ్యానికి గురైన బాలికను ఆసుపత్రిలో చేర్చినట్లు తండ్రి శివ్‌ప్రతాప్ సింగ్ తెలిపారు. ఈ సంఘటనపై విచారణ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

కాబూల్‌లో భారీ పేలుడు

(మొదటిపేజీ తరువాయి)

చేసుకుంది. కాగా ఈ పేలుడుకు తామే బాధ్యులమని తాలిబన్ ప్రకటించింది. పేషంట్‌ను ఆస్పత్రికి తీసుకెళుతున్నానని చెప్పి మొదటి చెక్‌పాయింట్ దాటిన బాంబర్ రెండో చెక్‌పాయింట్ వద్ద తనను గుర్తించడంతో అక్కడే అంబులెన్సును పేల్చివేశాడని హోం మంత్రిత్వ శాఖ డిప్యూటీ ప్రతినిధి నస్రత్ రహిమి తెలిపారు. పేలుడు జరిగిన ప్రాంతంలో, జమురైట్ ఆస్పత్రి వద్ద క్షతగాత్రుల ఏడుపులతో, మృత దేహాలతో పరిస్థితి బీభత్సంగా వుంది. కారిడార్లలో పడుకోబెట్టిన బాధితులకు పెద్ద సంఖ్యలో డాక్టర్లు, నర్సులు చికిత్సనందిస్తున్నారు. పెద్ద శబ్దంతో పేలుడు వినిపించిందని, తమ కాంపౌండ్ కిటికీలన్నీ కంపించిపోయాయని ఎఎఫ్‌పి విలేకర్లు తెలిపారు. సంఘటన ప్రాంతంలో పెద్ద ఎత్తున పొగ లేస్తున్న ఫోటోలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యాయి. హోం శాఖ, యురోపియన్ యూనియన్, ఉన్నత శాంతి మండలి కార్యాలయాలు వున్న కీలకమైన, రద్దీగా వుండే ప్రాంతంలో ఈ పేలుడు సంభవించింది. కాబూల్ పోలీసు ప్రధాన కార్యాలయం కూడా అక్కడకు కాస్త దూరంలో వుంది. కాబూల్‌లో విలాసవంతమైన హోటల్‌పై తాలిబన్ తీవ్రవాదులు దాడి చేసిన 22మందిని హతమార్చిన ఘటన జరిగిన వారానికి ఈ పేలుడు జరిగింది. ఆ దాడిలో విదేశీయులు ఎక్కువమంది మృతి చెందారు. 'ఇది మానవాళిపై జరిగిన నేరం' అని అధ్యక్ష భవనం దాడిని ఖండించింది. తమ కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగిందని ఉన్నత శాంతి మండలి సభ్యుడు ఒకరు వ్యాఖ్యానించారు. ఈ పేలుడులో తమ వారెవరైనా మరణించారో లేదో ఇంకా తెలియరాలేదని చెప్పారు. కాగా ప్రజలను అప్రమత్తంగా వుండాల్సిందిగా ప్రభుత్వం భద్రతా హెచ్చరిక జారీ చేసింది. విదేశీయులు ఎక్కువగా సందర్శించే సూపర్ మార్కెట్లు, షాపింగ్ మాల్స్, హోటళ్ళపై తీవ్రస్థాయిలో దాడులు జరపాలని ఇస్లామిక్ స్టేట్ గ్రూపు పథకం పన్నిందంటూ అప్రమత్తంగా వుండాల్సిందిగా విదేశీయులను కోరింది.

యుపిలో తాజాగా ఘర్షణలు

లక్నో : ఉత్తర ప్రదేశ్‌లోని పశ్చిమ ప్రాంతంలోని కసంగ్‌లో శనివారం తాజాగా ఘర్షణలు చెలరేగాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆరెస్సెస్ మద్దతున్న విద్యార్థి సంఘం ఎబివిపితోపాటు విహెచ్‌పిలకు చెందిన కార్యకర్తలు నిర్వహించిన త్రిరంగ బైక్‌ర్యాలీ సందర్భంగా చోటుచేసుకున్న ఘర్షణల్లో చందన్ గుప్తా (22) అనే యువకుడు మృతి చెందాడు. నౌషాద్ అనే మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఇద్దరికీ బుల్లెట్ గాయాలయ్యాయి. ఈ ఘర్షణల్లో మృతి చెందిన చందన్ గుప్తా అంత్యక్రియలు ముగిసినతరువాత శనివారం మళ్ళీ హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్నాయి. పట్టణానికి చెందిన ప్రధాన మార్కెట్‌లో కొన్ని దుకాణాలను ఒక గ్రూపునకు చెందిన వారు తగలబెట్టారు. మరి కొందరు కొద్ది దూరంలో ఉన్న షాపులను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా రెండు బస్సులను కూడా తగలబెట్టారు.

ప్రత్యేకం

కార్మిక చట్టాలపై కత్తిగట్టిన కేంద్రం

అకారణంగా ఉద్యోగుల తొలగింపునకు వెసులుబాటు

నోటీసు ఇవ్వాలన్న నిబంధనా ఎత్తివేత

ఒప్పంద కార్మికుల చట్టాలనూ వదలని వైనం

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం త్వరలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై కసరత్తు చేస్తూనే మరోవైపు కార్మిక చట్టాల్లో ఉద్యోగ, ఉపాధి భద్రత కల్పించే నిబంధనలను ఎత్తివేసేందుకు వ్యూహం పన్నుతోంది. కార్మికశాఖ ఇప్పటికే అందుకు సంబంధించిన ప్రతిపాదనలను తన వెబ్‌సైట్‌లో పెట్టి అభిప్రాయాలను స్వీకరిస్తోంది. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదికలో కీలకపోన్యాసం చేసిన ప్రధాని నరేంద్ర మోడీ భారత్‌లో సులభతర వ్యాపారానికి మార్గం సుగమం చేశామని చెప్పారు. 'రెడ్ టేప్ తొలగించాం..రెడ్ కార్పెట్ పరిచాం' అని ఆయన పేర్కొన్న నినాద ఉద్దేశం ఇక్కడి కార్మిక చట్టాలకు తూట్లు పొడవడమేనని తెలుస్తోంది. మోడీ ప్రభుత్వం చెబుతున్న సులభతర వాణిజ్యంలో భాగంగా చేస్తున్న ఈ సవరణలన్నీ కూడా బడా కంపెనీల యజమానులకు మేలు చేసేవే తప్ప కార్మిక లోకానికి ఏమాత్రం అనుకూలం కావన్నది పరిశీలిస్తే అర్థమవుతోంది...

న్యూఢిల్లీ : నిర్ణీత(కాల)వ్యవధి లేదా ఒప్పంద ఉద్యోగుల నియామక నిబంధనలను సవరించేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కేంద్రంలో మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం తమ హయాంలోనూ అభివృద్ధి జరుగుతోందంటూ చెప్పుకుంటుండగా ప్రతిపక్షాలు, ఆర్థికవేత్తల నుంచి విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా మోడీ హయాంలో యువతకు కొత్తగా వచ్చిన ఉద్యోగాలేమీ లేవన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఉద్యోగాల కల్పనలేని అభివృద్ధి వల్ల కొన్ని బడా కార్పొరేట్ సంస్థలకే మేలు జరుగుతోంది తప్ప సామాన్యుల జీవితాల్లో మార్పేమీ లేదని ఆర్థికవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర కార్మికశాఖ వెబ్‌సైట్‌లో ఒప్పంద ఉద్యోగ నిబంధనలకు సంబంధించి కొన్ని సవరణలు ప్రతిపాదిస్తూ అభిప్రాయాలు కోరారు. సూచనలు, అభ్యంతరాలు తెలిపేందుకు ఫిబ్రవరి 9ని గడువుగా నిర్ణయించారు.

'పారిశ్రామిక ఉద్యోగాలు(స్థాయీ ఆదేశాలు) కేంద్ర(సవరణ) నిబంధనలు,2018' పేరుతో కార్మిక శాఖ వెబ్‌సైట్ ద్వారా అభిప్రాయాలు సేకరిస్తున్నారు. 1946లోనే నిర్ణీత వ్యవధి ఉద్యోగులు లేదా కార్మికుల కోసం ఉద్దేశించిన చట్టం రూపొందగా, మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దానికి 2016లోనే సవరణలను ప్రతిపాదించారు. తాజాగా నూతన చట్టం రూపకల్పన కోసం కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. పాత చట్టంలో వస్త్ర, తోళ్ల పరిశ్రమలకే పరిమితమై నిబంధనలుండగా వాటిని ఇతర రంగాలకూ విస్తరించనున్నట్టు తాజాగా ప్రతిపాదించారు. నూతన చట్టం అమలులోకి వస్తే అది పారిశ్రామికవేత్తలు, కంపెనీల యజమానులకే అనుకూలమన్నది గమనార్హం. మోడీ ప్రభుత్వం చెబుతున్న సులభతర వాణిజ్యాన్ని ప్రోత్సహించడంలో భాగంగానే కార్మికశాఖ ఈ కొత్త చట్టానికి రూపకల్పన చేసింది. ఈ చట్టం ప్రకారం ఉద్యోగులను తాము అనుకున్నదే తడవుగా తొలగించే అధికారం కంపెనీల యజమానులకు ఉంటుంది. ముందస్తు నోటీసులు ఇవ్వాలన్న నిబంధనను సవరణ చట్టంలో తొలగిస్తున్నారు. ఎలాంటి నోటీస్ లేకుండానే ఒప్పంద కార్మికులను తొలగించే వెసలుబాటును ఈ చట్టం ద్వారా కంపెనీల యజమానులకు కల్పిస్తున్నారు.

ఒప్పంద కార్మిక చట్టం ద్వారా గౌరవనీయ ఉద్యోగాల కల్పన జరగదు. ఎన్నికల ఏడాదిలో కొత్తగా ఉద్యోగాలు కల్పించినట్టు లెక్కల్లో చూపేందుకు ప్రభుత్వానికి మాత్రం అవకాశముంటుందని శ్రామిక ఆర్థికవేత్త, ప్రొఫెసర్ కెఆర్ శ్యాంసుందర్ అన్నారు. అయితే, నిర్ణీత వ్యవధి ఉద్యోగుల కనీస వేతనాలకు ఈ చట్టం ద్వారా హామీ ఇవ్వనున్నారు. వరుసగా మూడు నెలలకన్నా ఎక్కువ రోజులు పని చేసిన ఉద్యోగులకు 15 రోజుల ముందు నోటీస్ ఇస్తారు. కానీ, తొలగిస్తున్న కారణాన్ని లిఖితపూర్వకంగా ఉద్యోగికి తెలియజేయాల్సిన అవసరముండదు. భారత్‌లో నిరుద్యోగులు 3.5 శాతం ఉన్నట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. కొత్తగా ఉద్యోగాల్లో చేరేవారిలో (15-24 ఏండ్ల వయసువారిలో) మాత్రం ఇది మరింత అధికంగా ఉన్నది. వీరిలో నిరుద్యోగిత 2014లో 10 శాతం ఉండగా, అది 2019కల్లా 10.7 శాతానికి పెరగనున్నదని అంతర్జాతీయ కార్మిక సంస్థ తన తాజా నివేదికలో తెలిపింది.

సంక్షిప్తం

లండన్‌లో భారత్ అనుకూల, వ్యతిరేక వర్గాల ఘర్షణ

లండన్ : గణతంత్ర దినోత్సవం రోజున భారత హై కమిషన్ వెలుపల భారత్‌కు వ్యతిరేకంగా కొంత మంది నిరసన ప్రదర్శనలు చేశారు. ఈ విషయం తెలిసిన భారత అనుకూల బృందం అక్కడకు చేరుకుంది. దీంతో భారతదేశ వ్యతిరేక, అనుకూల సమూహాల మధ్య ఘర్షణలు చోటుచేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకోవలసి వచ్చింది. ఈ ఘర్షణలో భారత జాతీయ జెండా చినిగి, కాళ్ళ కింద నలిగింది. రెండు వైపులా నిరసనకారులు పెద్ద పెద్ద నినాదాలు చేస్తూ ఒకరినొకరు అవమానకర వ్యాఖ్యలు చేసుకున్నారు. భారతదేశానికి వ్యతిరేకంగా ' బ్లాక్ డే' నిరసనను హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు చెందిన అనుబంధ సభ్యుడు లార్డ్ నజీర్ అహ్మద్ నిర్వహించాడు. పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్లో జన్మించిన లార్డ్ అహ్మద్, ఇంగ్లాండ్లో పెరిగాడు, 2012 లో లేబర్ పార్టీ నుండి సస్పెండ్ అయ్యాడు. భారత్‌లోని వేర్పాటు వాద ఉద్యమాలకు ఇతను లండన్‌లో ప్రచారం చేస్తున్నాడు.

144 మందిపై అన్నాడిఎంకే వేటు

ఆర్కేనగర్ ఉప ఎన్నికల్లో ఓటమి చవిచూసిన తర్వాత అన్నాడీఎంకే పార్టీ జాగ్రత్త వహిస్తోంది. పార్టీ విధానాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న వారిని తొలగించే ప్రక్రియపై దృష్టి సారించింది. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న వారిని ఉపేక్షించేదిలేదని, వారిపై చర్యలు తీసుకుంటామన్న సంకేతాలు ఇస్తూనే విశ్వాసం కోల్పోయిన వారిని తొలగిస్తోంది. అలా ఇప్పటికే తిరుప్పూర్, పుదుకొట్టై, ధర్మపురి, విల్లుపురం, కడలూరు తదితర జిల్లాలకు చెందిన వారిపై చర్యలు తీసుకోగా.. శుక్రవారం 53 మందిపై వేటు పడింది. తాజాగా శనివారం మరో 144 మందికి పైగా అన్నాడీఎంకే ఆఫీస్ బేరర్లపై ఆ పార్టీ వేటు వేసింది. అలా ఈ సంఖ్య మొత్తం దాదాపు వెయ్యి దాటింది. తమిళనాడు సీఎం పళనిస్వామి, ఉపముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం శనివారం 144 మందికి పై ఆఫీస్ బేరర్లపై వేటు వేస్తున్నట్లు ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. వారంతా పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని, క్రమశిక్షణ కింద వారిపై చర్యలు తీసుకున్నట్లు అన్నాడీఎంకే సమన్వయకర్త పన్నీర్‌సెల్వం తెలిపారు. వేటు పడిన వారికి ఇక పార్టీతో ఎటువంటి సంబంధాలూ ఉండబోవని పన్నీర్ స్పష్టం చేశారు.

పారిస్‌కు వరద ముప్పు

పారిస్ : ఫ్రాన్స్‌వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పారిస్‌లోని సీనె నది పొంగి పొర్లుతోంది. వచ్చే వారమంతా కూడా ఇలాగే వర్షాలు కురిసే పరిస్థితి వున్నందున ప్రజలు అప్రమత్తంగా వుండాలని వాతావరణ అధికారులు హెచ్చరిస్తున్నారు. శనివారం పారిస్ అంతటా అప్రమత్తత ప్రకటించారు. ఎగువ నుండి వస్తున్న నీటితో సీనె నదికి కొన్ని బేస్‌మెంట్ల వద్ద పగుళ్ళు చోటు చేసుకున్నాయి. నీటితో నిండిన రహదారులు కాలువలను తలపిస్తుండడంతో నగర శివార్లలోని ప్రజలు బోట్ల ద్వారా ప్రయాణించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆస్పత్రుల్లో రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ముంచెత్తిన మంచు

చైనాలోని మధ్య, తూర్పు ప్రాంతాలను పెద్ద ఎత్తున మంచు కమ్మేసింది. దీంతో అధికారులు హై అలెర్ట్ ప్రకటించారు. విమాన,రైళ్ల రాకపోకలను రద్దు చేశారు. జాతీయ రహదారులు కూడా మూత పడ్డాయి.



నల్లజాతీయులపై వివక్షా !

వాల్‌మార్ట్‌పై కేసు వేసిన మహిళ

లాస్ ఏంజెల్స్, అమెరికా : కాలిఫోర్నియాకు చెందిన ఒక మహిళ వాల్‌మార్ట్‌పై శుక్రవారం దావా వేసింది. నల్ల జాతీయులకు విక్రయించే ఉత్పత్తులను విడిగా పెడుతున్నారంటూ కంపెనీపై ఆరోపణలు చేసింది. నల్ల జాతీయులకు అవసరమైన సౌందర్య ఉత్పత్తులన్నింటినీ తాళం వేసిన గాజు గదిలో పెట్టారని ఎస్సీ గ్రండీ (43) తెలిపింది. ఇతర జాతీయులకు ఉద్దేశించిన సౌందర్య సాధనాలను వాల్‌మార్ట్‌లో సాధారణ అరల్లోనే పెట్టారని ఆమె పేర్కొంది. ఆగ్నేయ లాస్‌ఏంజెల్స్‌కు గంట దూరంలో గల పెర్రిస్‌లోని తన ఇంటికీ సమీపంలో గల వాల్‌మార్ట్ దుకాణంలో ఈ పరిస్థితి నెలకొందని తెలిపింది. ఎందుకు ఆ ఉత్పత్తులను అలా విడిగా పెట్టారని దుకాణంలోని ఉద్యోగిని ప్రశ్నించగా, కార్పొరేట్ ప్రధాన కార్యాలయం నుండి వచ్చిన ఆదేశాలని గ్రండీకి చెప్పారని మహిళా హక్కుల అటార్నీ గ్లోరియా ఆల్‌రెడ్ విలేకర్లకు తెలిపారు. స్టోర్ మేనేజర్‌కు ఈ విషయం చెప్పగా ఆమె స్పష్టంగా స్పందించలేదని, ఎలాంటి చర్య తీసుకోలేదని చెప్పారు. తన ఇంటికి దగ్గర్లోని మరోరెండు వాల్‌మార్ట్‌లను సందర్శించగా అక్కడ ఒకదాంట్లో ఆఫ్రికన్ అమెరికన్‌లకు ఉద్దేశించి ఉత్పత్తులు సాధారణ ప్రదేశాల్లోనే వున్నాయని, కానీ వాటికి అదనపు భద్రతను ఏర్పాటు చేశారని తెలిపారు. వివక్షతతో కూడిన ఇటువంటి పద్ధతులు, వ్యాపారాలు, విధానాల ఫలితంగా వాల్‌మార్ట్‌పై దావా వేసినట్లు గ్రండీ తెలిపారు. ఆఫ్రికన్ అమెరికన్లు దొంగలనిపించేలా ఇటువంటి చర్యలు తీసుకోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఈ పద్ధతిని విరమించాలని ఆమె డిమాండ్ చేశారు.

60 ఏళ్ల గొరిల్లా మృతి



కాలిఫోర్నియా : ప్రపంచంలోనే అతి పెద్ద వయసున్న గొరిల్లా విలా (60) గురువారం శాన్ డియోగ్ జూలోని సఫారీ పార్క్‌లో మృతి చెందినట్లుగా స్థానిక మీడియా తెలిపింది. ఆఫ్రికాలోని పశ్చిమ లోతట్టు ప్రాంతమైన కాంగోలో 1957లో ఈ గొరిల్లా జన్మించిందని, శాన్‌డియోగ్ జూలోనే పెరిగిందని పేర్కొంది. గొరిల్లా మృతికి గల కారణాలు అధికారికంగా వెల్లడి కాలేదని స్పష్టం చేసింది. ఐదు తరాల గొరిల్లాల మాతృకగా విలా జీవించినట్లు సఫారి పార్క్‌లోని క్షీరదాల క్యురేటర్ రాండీ రిచేస్ పేర్కొన్నారని తెలిపింది.

ఆస్ట్రేలియా దినోత్సవంపై ప్రజాభిప్రాయ సేకరణ : ప్రధాని


కాన్‌బెరా : ఆస్ట్రేలియా దినోత్సవంపై పునరాలోచించనున్నట్లు ప్రధాని టర్నబుల్ స్పష్టం చేశారు. ఆస్ట్రేలియా జాతీయ దినోత్సవమైన శుక్రవారం భారీ సంఖ్యలో ప్రజలు దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఆదిమవాసులపై బ్రిటిష్ వారు దాడి చేసిన రోజును ఆస్ట్రేలియా దినోత్సవంగా జరుపుకోవడంపై పెద్దఎత్తున నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. రాజ్యాంగం ప్రకారం ఉమ్మడి ప్రజాభిప్రాయ సేకరణతో జనవరి 26ను జాతీయ దినోత్సవంగా గుర్తించిందని ఆస్ట్రేలియన్ లేబర్ పార్టీ (ఎఎల్‌పి) పేర్కొంది. శుక్రవారం మాజీ ఉప ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్, ఆస్ట్రేలియా దినోత్సవంపై ఐక్య వేదికగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని సూచించారు. ఆస్ట్రేలియన్ చట్టం ప్రకారం రాజ్యాంగంలో ఏ మార్పు అయినా మరోసారి ఓటు ద్వారా ప్రజాభిప్రాయాన్ని తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రముఖ వార్తా సంస్థ తెలిపింది.

బిఆర్ఐ వివాదాల కోసం

మూడు అంతర్జాతీయ కోర్టులు : చైనా

బీజింగ్ : కోట్లాది డాలర్ల పెట్టుబడులతో చేపడుతున్న బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బిఆర్ఐ) ప్రాజెక్టుకు సంబంధించిన వివాదాలను పరిష్కరించుకునేందుకు మూడు అంతర్జాతీయ కోర్టులను ఏర్పాటు చేయాలని చైనా నిర్ణయించింది. చైనాకు చెందిన సుప్రీం పీపుల్స్ కోర్టు బీజింగ్, గ్జియాన్, షెన్‌జెన్‌ల్లో అంతర్జాతీయ కోర్టులను నెలకొల్పుతుందని ప్రభుత్వ మీడియా గ్లోబల్ టైమ్స్ తెలిపింది. వాయవ్య చైనాలో ఏర్పాటు చేసే గ్జియాన్ కోర్టు సిల్క్ రోడ్‌కు సంబంధించిన కేసులను చేపడుతుంది. దక్షిణచైనాలోని షెన్‌జెన్ కోర్టు మారిటైమ్ సిల్క్ రోడ్ వివాదాలకు సంబంధించిన కేసులను చూస్తుంది.

బీజింగ్ కోర్టు వీటికి ప్రధాన కార్యాలయంగా వుంటుంది. లిటిగేషన్లను, మధ్యవర్తిత్వపు కేసులను ఈ కోర్టులు చూస్తాయి. న్యాయపరమైన తోడ్పాటును అందచేస్తాయి. వివాదాలను పరిష్కరిస్తాయి. ఈ ప్రాజెక్టు అమల్లో తలెత్తే వాణిజ్య, పెట్టుబడుల వివాదాలను న్యాయపరంగా పరిష్కరించడానికి ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. 60కి పైగా దేశాలు బిఆర్‌ఐలో పెట్టుబడులు పెట్టేందుకు సంతకాలు చేశాయని చైనా చెబుతోంది. చైనాతో యురేసియన్ దేశాల సహకారం, అనుసంధానతపైనే ప్రధానంగా బిఆర్ఐ దృష్టి పెడుతుందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తెలిపారు.



అరబ్ మీడియా అధిపతికి విముక్తి



రియాద్ : అవినీతి నిరోధక చర్యల్లో భాగంగా దాదాపు మూడు నెలల క్రితం అరెస్టు చేసిన అరబ్ శాటిలైట్ నెట్‌వర్క్ ఎంబిసి యజమాని వలీద్ అల్ ఇబ్రహీంని సౌదీ అరేబియా శుక్రవారం విడుదల చేసింది. నవంబరు 4వ తేదీన రియాద్‌లోని విలాసవంతమైన రిట్జ్ కార్లటన్ హోటల్‌లో దాదాపు 350మందిని అనుమానితులను నిర్బంధంలో వుంచారు. వీరిలో వలీద్ అల్ ఇబ్రహీం ఒకరు. కాగా విడుదలైన వెంటనే ఇబ్రహీం తన నివాసంలో సంబరాలు జరుపుకున్నారని ఎంబిసి ఉద్యోగులు ముగ్గురు తెలియచేశారు. ఆయన విడుదలవడంపై కొంతమంది ఉద్యోగులు అభినందించారు. అయితే ఆయన విడుదలకు విధించిన షరతు లేంటనేది వెల్లడి కాలేదు. తమను విడుదల చేసినందుకు ప్రతిగా కొంత మొత్తం చెల్లించేందుకు పలువురు అంగీకరించినట్లు ప్రభుత్వం తెలిపింది. ఎంబిసిలో ఇబ్రహీం వాటాను అప్పగిస్తే ఆయనను విడుదల చేస్తామని అధికారులు ఆదేశించినట్లు మీడియా వార్తలు తెలిపాయి. అయితే అధికారులు ఇంతవరకు ఈ కేసు గురించి ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. శుక్రవారం మరికొంతమంది ప్రముఖులను కూడా ప్రభుత్వం విడుదల చేసింది.

అత్యంత నేరపూరితం

ట్రంప్‌తో అక్రమసంబంధ వార్తలపై నిక్కి హేలీ



ఐక్యరాజ్య సమితి : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో తనకు సంబంధ ముందని వస్తున్న వదంతులను అమెరికా రాయబారి నిక్కీ హేలీ ఖండించారు. ఇటువంటి పుకార్లు అత్యంత ప్రమాదకరమైనవని, చికాకు కలిగిస్తాయని ఆమె పేర్కొన్నారు. అత్యధికంగా విక్రయించబడిన పుస్తకం "ఫైర్ అండ్ ఫ్యూరీ" రచయిత మైఖేల్ ఉల్ఫ్ ఈ రకమైన వదంతులకు తెర తీశారు. ఆయన ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, ట్రంప్‌కు ఒకరితో సంబంధముందని, దాని గురించి తన పుస్తకంలో వివరంగా రాశానని చెప్పారు. ట్రంప్ పాలనా యంత్రాంగంలో అత్యంత ఉన్నత స్థాయిలోని మహిళ అయిన హేలీ అధ్యక్షుడి వారసురాలిగా కనిపిస్తోందని తన పుస్తకంలో రాశారు. హేలీ మరో ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. 'ఇది పూర్తిగా అవాస్తవం" అని ఆమె స్పష్టం చేశారు. అధ్యక్ష విమానంలో, ఓవల్ కార్యాలయంలో ట్రంప్‌తో ప్రైవేటుగా చాలా సమయం గడుపుతున్నారంటూ వూల్ఫ్ తన పుస్తకంలో పేర్కొనడాన్ని కూడా హేలీ తీవ్రంగా విమర్శించారు. ఆ రాతలను ఖండించారు. ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో ఆయనతో కలిసి ఒకసారి ప్రయాణించానని, అయితే ఆ సమయంలో ఆ గదిలో నాతోపాటు చాలా మంది వున్నారని ఆమె వివరించారు. తన రాజకీయ భవితవ్యం గురించి ఓవల్ కార్యాలయంలో ట్రంప్‌తో మాట్లాడానని అంటున్నారు, నిజానికి తానెన్నడూ అలా మాట్లాడలేదని, అయినా ట్రంప్‌తో తాను ఎన్నడూ ఒంటరిగా గడపలేదని హేలీ వివరణ ఇచ్చారు.

ట్రంప్ విసిగిస్తే రాజీనామా చేస్తా

వైట్‌హౌస్ న్యాయవాది మెక్‌గన్



వాషింగ్టన్ : అధ్యక్షుడు ట్రంప్ వ్యవహార శైలితో విసుగు చెందిన వైట్‌హౌస్ న్యాయవాది డొనాల్డ్ మెక్‌గన్ పదవి నుండి వైదొలగుతానని బెదిరించాడని సంబంధిత వర్గాలు తెలిపాయి. 2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యంపై దర్యాప్తు జరుపుతున్న ప్రత్యేక న్యాయవాది రాబర్ట్ ముల్లర్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలంటూ ట్రంప్ పట్టుబట్టడంతో విసిగి వేసారిపోయిన మెక్‌గన్ గత జూన్‌లో రాజీనామా చేసేందుకు సిద్ధపడ్డారు. ట్రంప్ ఆదేశాలను పాటించేకంటే తాను రాజీనామా చేయడం మంచిదని మెక్‌గన్ అన్నట్లు ఈ విషయం తెలిసిన వ్యక్తులు పేర్కొన్నారని న్యూయార్క్‌టైమ్స్ తెలిపింది. కాగా ట్రంప్ ఈ వార్తలను శుక్రవారం ఖండించారు. ఇవన్నీ బూటకపు వార్తలని దావోస్‌లో విలేకర్లు ప్రశ్నించగా వ్యాఖ్యానించారు. రాబర్ట్ ముల్లర్‌ను తొలగిస్తే న్యాయ క్రమానికి వ్యతిరేకంగా అధ్యక్షుడు వ్యవహరిస్తున్నారనే వాదనకు బలం చేకూరు తుందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. కాగా దీనిపై వ్యాఖ్యానించడానికి మెక్‌గన్ అందుబాటులో లేరు. పైగా ఈ విషయాన్ని డిప్యూటీ అటార్నీ జనరల్ రాడ్ రోజెన్‌స్టన్‌తో ఆయన చర్చించనూ కూడా లేదు. ట్రంప్ పట్టుబడితే రాజీనామా చేస్తానని మెక్‌గన్ నేరుగా అధ్యక్షుడికి చెప్పలేదని, వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ రెయిన్స్ ప్రియెబస్‌కు చెప్పారని టైమ్స్ పేర్కొంది.

మొదటి పేజీ తరువాయి

పార్టీలకు కాదు.. పాలసీలకు వ్యతిరేకం

తన జీవితాన్ని అంకితం చేస్తానని చెప్పారు. రాయలసీమ ప్రాంతమంటే తనకు ఎంతో ఇష్టమన్నారు. అందుకే ఇక్కడ జనసేన పార్టీ తొలి కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. సీమలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వ్యవసాయ రంగ నిపుణులు, మేధావుల కమిటీ గుర్తించి, వాటి పరిష్కారం కోసం ప్రధాని మోడీని కలుస్తామన్నారు. తనకు ప్రజలు ఓటు వేసినా.. వేయకపోయినా తానెప్పుడూ ప్రజల మనిషినేనన్నారు. యువశక్తే తన రాజకీయాలకు పునాది అని, ఇతర పార్టీలతో శత్రుత్వం వల్ల ప్రజలకు ప్రయోజనం ఉండదని అన్నారు. రైతులకు అండగా ఉండి, వారి శ్రేయస్సును కోరే పార్టీలకు జనసేన మద్దతు ఉంటుందన్నారు. 2019, 2024 ఎన్నికల కోసం రాజకీయాల్లోకి రాలేదని, ప్రజల పక్షాన ప్రతిక్షణం నిలబడి ప్రశ్నించే శక్తిగా ఎదిగేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఈ ప్రయాణంలో తనపై దాడులు జరిగినా బెదిరేది లేదన్నారు. రాజకీయాల్లో వారసత్వం మంచి కాదన్నారు. వారసత్వ రాజకీయాలు పోయి కొత్తరక్తం రాజకీయాల్లోకి రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఫిబ్రవరి 21 నుంచి టెట్ పరీక్షలు

సన్నద్ధమయ్యేందుకు మరింత సమయం కావాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నుంచి అభ్యర్థనలు ఎక్కువగా వస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. జనవరి 17 నుంచి జరగాల్సిన పరీక్షను, ఫిబవరి 5 వరకు వాయిదా వేశామని, మళ్లీ ఫిబ్రవరి 21కు వాయిదా వేశామని వెల్లడించారు. మొత్తం 4,46,833 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో పేపర్-1(ఎస్జీటి)కు 1,80,249 మంది, పేపర్-2(ఎస్ఎ)కు 2,12,794 మంది, పేపర్-3(భాషా పండితులు)కు 53,290 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే ఫీజు చెల్లింపు, దరఖాస్తుల స్వీకరణ గడువు తేదీలు ఈ నెల 20,22 తో ముగిశాయి. పరీక్ష సమయాల్లో మాత్రం ఏలాంటి మార్పు లేదు. ఉదయం 9:30-12గంటల వరకు మొదటి సెషన్‌లో పేపర్-1, మధ్యాహ్న 2:30-5 గంటల వరకు రెండో సెషన్‌లో పేపర్-2 ఉంటుంది.

సేద్యానికి ప్రత్యేక చట్టం చేయాలి

కాపాడి రైతులకు న్యాయం చేయాలంటే.. వ్యవసాయానికి ప్రత్యేక చట్టం చేయడమే మార్గమని వివరించారు. దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలంటే, గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకోవాలన్నారు. త్వరలో ప్రవేశపెట్టే బడ్జెట్లో కార్పొరేట్లపై కాకుండా ప్రజా సంక్షేమానికి, వ్యవసాయానికి ప్రాధ్యామివ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

ఫిబ్రవరి 4 నుంచి నల్గొండలో సిపిఎం తెలంగాణ రాష్ట్ర మహాసభలు

సిపిఎం తెలంగాణ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ వచ్చే నెల 4 నుంచి 7వ తేదీ వరకూ పార్టీ రెండో రాష్ట్ర మహాసభలు నల్లగొండలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ సభల్లో ప్రస్తుత రాజకీయాల విధానాలకు భిన్నమైన ప్రత్యామ్నాయ రాజకీయ విధానాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లడంపై చర్చ ఉంటుందన్నారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్, బివి రాఘవులు, వి శ్రీనివాసరావు సభల్లో పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి, జూలకంటి రంగారెడ్డి, బి వెంకట్ పాల్గొన్నారు.

దళిత మహిళపై సర్పంచ్ అనుచరుడు దాడి

ప్రజాశక్తి-తోట్లవల్లూరు

స్థలం విషయంలో ఓ వ్యక్తి దళిత మహిళపై తీవ్ర దాడికి పాల్పడిన ఘటన కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలం దొడ్డపాడులో శనివారం చోటుచేసుకుంది. గ్రామంలో కరకట్టపై పద్మ అనే భవన నిర్మాణ కార్మికురాలు నివాసం ఉంటోంది. ఆ పక్కనే ఉంటున్న గడ్డపల్లి సర్పంచ్ అనుచరుడు దిమ్మిట నాగరాజు నాయకులు, అధికారుల అండతో కరకట్టపై స్థలాన్ని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ క్రమంలోనే పద్మను ఇల్లు ఖాళీ చేయాలని ఏడాదిగా బెదిరిస్తున్నాడు. ఇతని హెచ్చరికలను ఆమె ఖాతరు చేయక శనివారం తన స్థలంలో మరుగుదొడ్డి నిర్మాణానికి ఉపక్రమించింది. దీంతో నాగరాజు అడ్డుకుని, దుర్భాషలాడుతూ ఇనుపరాడ్డుతో దాడికి తెగబడ్డాడు. అడ్డు వచ్చిన ఆమె అల్లుడిపైనా దాడి చేశాడు. ప్రస్తుతం బాధితులు విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఇష్టం లేకుంటే.. నమస్కారం పెట్టి పోవచ్చు

(మొదటిపేజీ తరువాయి)

ఎంఎల్‌సి సోమువీర్రాజు చేస్తున్న విమర్శలను విలేకరులు ప్రస్తావించినప్పుడు ఆయన ఈ విధంగా స్పందించారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న చేయూతపై చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. విభజన తర్వాత రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని, కేంద్రం ఎపిని ఆదుకుంటుందని విభజన చట్టం ప్రకారం చేయాల్సినవి కూడా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో రెండంకెల వృద్ధి ఉందని ఇక ప్రత్యేక హోదా ఎందుకని కేంద్రం అభిప్రాయపడుతోందన్నారు. కాని రాష్ట్ర తలసరి ఆదాయం విషయంలో దక్షిణాది రాష్ట్రాల కంటే రూ. 30 వేల నుంచి రూ 35 వేల వరకు వెనుకబడి ఉన్నామని సిఎం పేర్కొన్నారు. కనీసం రాష్ట్ర తలసరి ఆదాయం పెరిగే వరకు, దక్షిణాది రాష్ట్రాలతో సమానంగా అభివృద్ధి చెందే వరకు ఎపిని ఆదుకోవాలని ప్రధాని మోడితో భేటీ సందర్భంలో కోరానన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీపై బిజెపి నాయకులు చేసే విమర్శలను ఆ పార్టీ అధిష్టానమే చూసుకోవాలని చెప్పారు. రాష్ట్రాన్ని ఇన్నోవేషన్ వ్యాలీగా అభివృద్ధి చేస్తాం

రాష్ట్రాన్ని ఇన్నోవేషన్ వ్యాలీగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. దావోస్ పర్యటన అంశాలను ఆయన విలేకర్లకు వివరించారు. కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) సహకారంతో శ్రీకాకుళం నుంచి కర్నూలు వరకు ఇన్నోవేషన్ వ్యాలీగా అభివృద్ధి చేస్తామన్నారు. దీంతోపాటు వ్యవసాయ రంగంలో సంక్షోభాన్ని నివారించడం, ఆ రంగ నిపుణుల సలహాలతో ఫుడ్ ప్రాసెసింగ్ అభివృద్ధి గురించి ప్రత్యేకంగా ఈ పర్యటనలో చర్చించామన్నారు. టెక్నాలజీ వినియోగం, కొత్త సాంకేతిక విధానాల ఆవిష్కరణలపై దృష్టి సారించామన్నారు. ఈ పర్యటనలో జ్యూరిచ్, హిటాచి సంస్థలతో ఎంఒయులు కుదుర్చుకున్నామని తెలిపారు. మొత్తం 25 ద్వైపాక్షిక సమావేశాల్లో పాల్గొన్నామని చెప్పారు. భారీ పెట్టుబడులు పెట్టేందుకు 50 సంస్థలు ' మెడ్‌టెక్ ఇన్నోవేషన్ సెంటర్ ' లెటర్ ఆఫ్ ఇంటెంట్ ఇచ్చాయన్నారు. ఆ కంపెనీల కోసం విశాఖలో వెయ్యి నుంచి 2 వేల ఎకరాల్లో మెడ్‌టెక్ ఇన్నోవేషన్ సెంటర్ జోన్ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో పర్యాటక, పారిశ్రామిక రంగాలను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. దావోస్‌లో ఎపి ఆకర్షణీయంగా నిలిచిందన్నారు. ఒక్క కాల్‌తో ఎలాంటి సమస్య అయినా పరిష్కారం అయ్యే సాంకేతిక విధానాన్ని ప్రవేశపెడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఫిర్యాదులు త్వరగా పరిష్కారమైతేనే ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరుగుతుందన్నారు. ప్రస్తుతం 30 శాఖలను అనుసంధానం చేశామని, త్వరలో అన్ని శాఖలను ఇందులోకి తీసుకువస్తామని చెప్పారు. ఈ పర్యటనలు, సదస్సులతో ఇప్పటివరకు ఎంతమేర పెట్టుబడులు వచ్చాయని, ఎందరికి ఉపాధి లభించిందని విలేకర్లు ప్రశ్నించగా ఒక్కసారిగా పెట్టుబడులు ఎలా వస్తాయని సిఎం ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాలతో పోల్చి చూస్తే ఎపికే ఎక్కువ పెట్టుబడులు వచ్చాయన్నారు. భాగాస్వామ్య సదస్సులు నిర్వహించడం ద్వారా ఆటోమొబైల్ రంగంలో 3.7 బిలియన్ యుఎస్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. దావోస్ పర్యటనలో అలీబాబా, మహీంద్రా, రహేజా మైండ్ స్పేస్, లిగ్జిట్ గ్రూప్, ఏవియేషన్ సంస్థ డస్సాల్ట్, శాప్ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపాయని వివరించారు.కరువు, మృత్తికాక్రమ క్షయం వంటి సమస్యలను ఎదుర్కొనేందుకు వ్యవసాయంలో త్వరలో కొత్త సాంకేతికతను ప్రవేశపెడతామని ముఖ్యమంత్రి తెలిపారు. యుపిఎల్ కంపెనీ రూపొందించిన జెల్ లాంటి పదార్థాన్ని పొలాల్లో చల్లడం ద్వారా నీటిని పీల్చుకుని కరువు సమయాల్లో పంటకు నీటి సమస్య లేకుండా చేస్తుందన్నారు. వరదల వల్ల భూసారం, పోషకాలు కొట్టుకుపోకుండా నియంత్రించే విధానం కూడా ఉందన్నారు. వీటిని తొలుత అనంతపురంలో ప్రయోగాత్మకంగా పరీక్షించేందుకు త్వరలో యుపిఎల్ సంస్థను ఆహ్వానించామన్నారు.

మూడు వారాల్లో పోలవరం డిపిఆర్

పోలవరం ప్రాజెక్టుకు మూడు వారాల్లో భూసేకరణ గురించి అథారిటీకి డిపిఆర్ అందజేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వచ్చే నెల 1 నుంచి కాంక్రీట్ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. పూర్తి చేసిన పనులకు నాబార్డ్ ద్వారా నిధులు ఇప్పించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

ఉప రాష్ట్రపతి ఎన్నికలప్పుడు జగన్‌కు ప్రత్యేక హెదా గుర్తుకు రాలేదా?

ప్రత్యేక హోదా ఇస్తే బిజెపికి మద్దతునిస్తానని జగన్ గతంలోనే చెప్పాడన్నారు. ప్రత్యేక హోదా కోసం తమ పార్టీ ఎంపీలతో రాజీనామా చేయిస్తానని జగన్ చెప్పినా మాట ప్రకారం చేయించలేదని ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇచ్చినప్పుడు ప్రత్యేక హోదా జగన్‌కు ఎందుకు గుర్తురాలేదన్నారు. బీహార్, ఒడిశా తరహాలో అవినీతిపరుల ఆస్తులన్నీ ఇకపై ప్రజలకు చెందే విధానాన్ని తీసుకురావాలన్నారు.

ప్రకృతిని ఆరాధించేందుకే సూర్య ఆరాధన

ప్రకృతిని ఆరాధించేందుకే సూర్య ఆరాధనని సిఎం వివరణ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఏరువాక, జలసిరికి హారతి వంటి కార్యక్రమాల ద్వారా వ్యవసాయం, నీటివనరులను పూజించేలా కార్యక్రమాలు చేపట్టామన్నారు. అలాగే ఆదివారం ' సూర్య ఆరాధన ' కార్యక్రమాన్ని విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో ప్రారంభిస్తామన్నారు. ఏటా రథసప్తమి లేదా ఆ తర్వాత వచ్చే ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని సిఎం స్పష్టంచేశారు. కులమతాలకు అతీతంగా అంతా ఈ కార్యక్రమంలో భాగస్వాములవ్వాలని, ప్రతిరోజు సూర్యనమస్కారాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం సందర్భంగా దేవాలయాల్లో సూర్య దేవుని పూజలు చేయించాలని దేవాదాయ శాఖను ఆదేశించామన్నారు. సూర్యుడు ప్రజలందరికీ ఒకేవిధంగా ఉపయోగపడతారు కనుక మసీదులు, చర్చిల్లో కూడా సూర్య ఆరాధన చేయాలన్నారు. మాతృమూర్తిని గౌరవించే సంప్రదాయం కొనసాగించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన ' అమ్మకు వందనం ' కార్యక్రమం విజయవంతమైందన్నారు. వచ్చే ఏడాది నుంచి ప్రయివేటు పాఠశాలల్లో కూడా ఈ కార్యక్రమాన్ని తప్పనిసరి చేస్తామన్నారు.

కొణతాల రైలు దీక్ష ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

విభజన హామీలన్ని నేరవేర్చాలని కోరుతూ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ఈ సమస్యపై ఢిల్లీలో కేంద్రమంత్రులను కలిసి వినతిపత్రాలను అందజేస్తానని చెప్పారు. ఈ దీక్షను 48 గంటల పాటు చేపట్టి, ఢిల్లీ వెళ్లిన వెంటనే అక్కడ గాంధీ విగ్రహానికి నివాళులర్పించి దీక్ష విరమిస్తానని చెప్పారు. ఈయనతో పాటు విభజన హామీల సాధన సమితికి సంబంధించిన 160 మంది ఢిల్లీ వెళ్తున్నారు. అంతకుముందు విశాఖపట్నం నుంచి శనివారం ఉదయం 8.35 గంటలకు ఢిల్లీ వెళ్లే ఎపి ఎక్స్‌ప్రెస్ రైలులో వారు బయలుదేరారు.

విశాఖ రైల్వే జోన్ కోసం కొణతాల దీక్షకు అఖిల పక్షం మద్దతు

ప్రజాశక్తి - గాంధీనగర్/అమరావతి బ్యూరో

ఉత్తరాంధ్ర చర్చా వేదిక ఆధ్వర్యంలో మాజీ పార్లమెంటు సభ్యులు కొణతాల రామకృష్ణ తలపెట్టిన రైలు దీక్షకు విజయవాడ అఖిల పక్ష పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. విశాఖపట్నం నుంచి శనివారం ఉదయం 8.35 గంటలకు ఢిల్లీ బయల్దేరిన ఆ రైలు మధ్యాహ్నం 2.35 గంటలకు విజయవాడ చేరుకుంది. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సిహెచ్.బాబూరావు. మాజీ రాజ్యసభ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మిప్రసాద్, సిపిఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్, వైసిపి నగర కన్వీనర్ మల్లాది విష్ణు, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసకుమార్, తదితరులు కొణతాలను కలిసి సంఘీభావం తెలిపారు. అనంతరం కొణతాల రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన యాక్టు 2013 ప్రకారం ఎపికి రావాల్సిన అన్ని హక్కులు తక్షణమే నెరవేర్చాలని 18 రకాల డిమాండ్లతో 40 గంటల రైల్ నిరాహార దీక్ష చేపట్టానన్నారు. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ఢిల్లీ చేరుకుని మహాత్మా గాంధీ ప్రాణాలు విడిచిన ఘాట్ వద్ద దీక్ష విరమణ చేస్తామన్నారు. అనంతరం ప్రధాని మోడీని కలిసి వినతి పత్రాన్ని అందజేస్తానని చెప్పారు. ప్రత్యేక హోదా, 2019 నాటికి పోలవరం ప్రాజెక్టును కేంద్రం మొత్తం నిధులతో పూర్తి చేయాలని, విశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్, గిరిజన యూనివర్సిటీ, విమ్స్‌ను ఎయిమ్స్‌గా మార్పు చేసి తీర్చిదిద్దడం, విశాఖలో మెట్రో రైల్ నిర్మాణం, హైకోర్టు బెంచ్ ఏర్పాటు, విశాఖ డిసిఐని ప్రైవేటీకరణ నుంచి విరమించడం, ఒడిశా రాష్ట్రంతో ఉన్న జల వివాద పరిష్కారం, కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు, రాయలసీమకు హైకోర్టు, ఆర్థిక ప్యాకేజీ, అనంతపురంలో సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనే డిమాండ్లతో ఈ దీక్ష తలపెట్టినట్లు వివరించారు.

విభజన హామీలను విస్మరించిన కేంద్రం : మధు

విభజన హామీలను కేంద్రం విస్మరించడంతోనే ఉద్యమాలు అవశ్యకత నెలకొందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు తెలిపారు. కొణతల రామకృష్ణ చేపట్టిన ఉద్యమానికి సిపిఎం పూర్తి మద్ధతు ఇస్తుందన్నారు. యావత్తు రాష్ట్ర ప్రజానీకం ఈ ఉద్యమానికి మద్ధత్తుగా నిలుస్తుందన్నారు.

విశాఖ రైల్వే జోన్ తక్షణమే ప్రకటించాలి : రామకృష్ణ

విశాఖ రైల్వే జోన్‌ను తక్షణమే ప్రకటించాలని కోరుతూ కొణతాల రామకృష్ణ చేపట్టిన రైలు దీక్షకు మద్దతు తెలుపుతున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి బడ్జెట్ సమావేశాల్లో విశాఖ రైల్వేజోన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. గతేడాది మార్చి 16న రైల్వే జోన్ అంశంపై లోక్‌సభలో కమిటీ వేశారని, ఆ కమిటీ ఏం నివేదించిందో కూడా వెల్లడించకుండా కేంద్రం కాలయాపన చేస్తోందని వివరించారు. రైల్వేజోన్ ఏర్పాటుకు విశాఖకు అన్ని అవకాశాలు ఉన్నప్పటికీ బిజెపి తన రాజకీయ స్వార్థం కోసం ప్రకటించకుండా తాత్సారం చేస్తోందన్నారు.

టెండర్ల తకరారు..!

(మొదటిపేజీ తరువాయి)

కడప జిల్లాకు చెందిన ఒక వ్యక్తికి మేలు చేసేందుకు వీలుగా ఉత్పత్తి సంస్థలకు మాత్రమే టెండర్ దాఖలు హక్కు కల్పించారన్న ప్రచారం సాగుతోంది. స్థానిక డీలర్లు తీవ్ర అసంతృప్తి చెందుతున్నారు. ఒక్కసారిగా టెండర్ విధానంలో మార్పు చేయడం వెనుక కీలక అధికారుల హస్తం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామీణాభివృద్ధిశాఖలో ఉన్నతాధికారికి, గతంలో సీనియర్ అధికారిగా పనిచేసి పదవీ విరమణ చేసిన ఇంకొకరికి కావాల్సిన వ్యక్తికి టెండర్ ఖరారు చేసేందుకే ఈ కొత్త నిబంధన తెరపైకి తీసుకొచ్చా రనే విమర్శలు వస్తున్నాయి. గతంలో కూడా ఇదే వ్యక్తికి 140 కోట్ల రూపాయల విలువైన పనులు అప్పగించినట్లు ప్రచారమవుతోంది. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ నిబంధనల మేరకే టెండర్లు ఉండాలని స్పష్టం చేయడం తోపాటు, ఉత్పత్తి సంస్థలకే టెండర్లు పరిమితం చేస్తూ ఇచ్చిన నోటిఫికేషన్‌లో పోలిథిలైన్ ఫిల్మ్ షీట్లు ఏర్పాటు చేందుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 20 వరకు ఇటువంటి షీట్లు ఉత్పత్తి చేసే సంస్థలు ఉండగా, ఒక్కటి కూడా రాష్ట్రంలో లేదు. అందువల్ల, ఆ సంస్థలకు టెండర్ ఖరారు చేసినా స్థానికంగా నిర్వహణ ఆశించిన స్థాయిలో ఉండదన్న విమర్శలు వస్తున్నాయి. కడప జిల్లాకు చెందిన వ్యక్తికి ఇతర రాష్ట్రాల్లో ఒకటి రెండు ఉత్పత్తి సంస్థలు ఉన్నా.. అవి కూడా రాష్ట్రేతర సంస్థలుగానే భావించాల్సి ఉంటుందని స్థానిక డీలర్లు అంటున్నారు. గతంలో మాదిరిగానే తమకు కూడా టెండర్ వేసే హక్కు కల్పించడం ద్వారా న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో వారు నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇలాంటి లైనింగ్ పనులు గతంలో చేపట్టిన అనుభవం తమకు ఉందని, అది కూడా ఈ రాష్ట్రంలోనే అమలు చేశామని స్థానిక డీలర్లు చెబుతున్నారు. తాజా నోటిఫికేషన్ లో మార్పులు చేసి, తమకు కూడా టెండర్లలో పాల్గొనే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఇదే డిమాండ్‌తో కృషి గ్రీన్ టెక్ అనే సంస్థ కూడా ముఖ్యమంత్రి పేషీకి వినతి పత్రాన్ని అందజేసింది. టెండర్ దాఖలుకు 31వ తేదీ వరకే గడువుందని, అందువల్ల త్వరగా దీనిపై ఒక సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆ సంస్థ కూడా కోరుతోంది.

ఆపరేషన్ 2019



'ఆపరేషన్ 2019' చిత్రంలో శ్రీకాంత్

ఆపరేషన్ దుర్యోధన...ఈ సినిమాలో శ్రీకాంత్ నటనకు లభించిన ప్రశంసలు అన్నీ ఇన్నీ కాదు. ఇప్పుడు అదే తరహాలో ఆయన హీరోగా చేసిన 'ఆపరేషన్ 2019' రాబోతుంది. బీవేర్ ఆఫ్ పబ్లిక్ అన్నది ఈ చిత్రం ఉపశీర్షిక. కరణం బాబ్జీ దర్శకత్వం. అలివేలమ్మ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీకాంత్ సమర్పిస్తున్నారు. ఫస్ట్‌లుక్‌ను శుక్రవారం, టీజర్‌ను శనివారం విడుదల చేశారు. ఆపరేషన్ దుర్యోధన'లో ఎలా అయితే గాయాలతో ఉన్న సన్నివేశం ఉంటుందో ఇక్కడ ఇందులోనూ అలాంటి సీన్‌తో టీజర్‌ను విడుదల చేశారు. రౌడీలు శ్రీకాంత్‌ను తీవ్రంగా గాయపరిచి అక్కడ నుంచి వెళ్ళారు. శ్రీకాంత్ గాయాలతో నేలపై కూర్చొని, ఉక్రోషంగా చూస్తూ టీజర్‌లో కనిపించారు.

పబ్లిక్‌ను మార్చే సినిమాలు రావాలి

ఈ చిత్రంలో శ్రీకాంత్ సరసన యజ్ఞశెట్టి నటించింది. అలివేలమ్మ ప్రొడక్షన్స్ పతాకంపై అలివేలు నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను కృష్ణరాజు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ' బీవేర్ ఆఫ్ పబ్లిక్' ఈ సినిమా క్యాప్షన్ చూసిన తర్వాత నాకు ఓ విషయం గుర్తొస్తుంది. నేను కాకినాడ నుంచి మొదట లోక్ సభ సభ్యుడిగా పోటీ చేసి మంచి మెజారిటీతో గెలిచాను. ఆ తర్వాత మా సొంతూరైన నర్సాపురం నుంచి పోటీ చేసి మళ్లీ మెజారిటీతో గెలిచాను. అక్కడ నేను చేసిన మంచి పనుల గురించి ప్రజలు ఇప్పటికీ చెప్పుకుంటుంటారు. కానీ ఆ తర్వాత రాజకీయాల్లోకి వ్యాపారవేత్తలు ప్రవేశించి ఓట్లు కొనడం ప్రారంభించారు. పబ్లిక్ కి కూడా డబ్బుపై ఆశ పెరిగింది. కాబట్టి పబ్లిక్ తో జాగ్రత్తగా ఉండాలి. వారిని మార్చే విధంగా సినిమాలు రావాలి. ఈ సినిమా టీజర్ చూస్తోంటే దర్శకుడు ఒక మంచి కాన్సెప్ట్ తో సినిమా తీసినట్లు తెలుస్తోంది. ఈ సినిమా పబ్లిక్‌ని ఎడ్యుకేట్ చేసే విధంగా ఉండబోతుందని అర్థమవుతోంది' అని అన్నారు.

ఎప్పుడు చూద్దామా? అన్నట్టు ఉంది

'ఇంటిలిజెంట్' టీజర్ ఆవిష్కరణలో బాలకృష్ణ



సి. కల్యాణ్, వి.వి.వినాయక్, బాలకృష్ణ, సాయి ధరమ్ తేజ్ తదితరులు

సాయి ధరమ్ తేజ్ హీరోగా, వి.వి. వినాయక్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఇంటిలిజెంట్' చిత్రం టీజర్‌ను నందమూరి బాలకృష్ణ శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ "వినాయక్ కాంబినేషన్‌లో ఇంతకుముందు 'చెన్నకేశవరెడ్డి' సినిమా చేశాం. మన కాంబినేషన్‌లో సినిమా ఎప్పుడు అని అడుగుతుంటాను. సినిమా విషయంలో ఆయన ఇన్వాల్వ్‌మెంట్, కలుపుగోలుతనం, ఆర్టిస్టు నుంచి సరైన పెర్ఫార్మెన్స్ రాబట్టుకోవడం ఆయనకు తెలుసు. ఇండస్ట్రీ గర్వించదగ్గ దర్శకుడు వి.వి.వినాయక్. ఆయన దర్శకత్వంలో మెగా ఫ్యామిలీ నుంచి మరో నటవారసుడు సాయిధరమ్ తేజ్ హీరోగా రూపొందిన చిత్రమిది. ఈ సినిమా టీజర్‌ని నా చేతుల మీదుగా రిలీజ్ చేయడం చాలా సంతోషంగా ఉంది. ఎందుకంటే సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ నా సొంత బేనర్‌తో సమానం. కల్యాణ్ పెద్ద హీరోలతో, చిన్న హీరోలతో ఇంకా సినిమా చేయాలి. ఈ సినిమా టీజర్ చాలా బాగుంది. మిస్టీరియస్‌గా ఉంది. టీజర్ చూసిన తర్వాత సినిమా ఎప్పుడు చూడాలా అనిపిస్తుంది. టైటిల్ కూడా చాలా బాగుంది. మెగా అభిమానులకు, ఇది నా బేనర్ కాబట్టి నా అభిమానులకు, ముఖ్యంగా యూత్‌కి ఈ సినిమా కనెక్ట్ అవుతుంది. సినిమా ఘనవిజయం సాధిస్తుంది" అని అన్నారు.

నిర్మాత సి.కళ్యాణ్ మాట్లాడుతూ " 2018 ప్రారంభంలో బాలకృష్ణ నాకు మంచి ఎనర్జీ ఇచ్చారు. ఫిబ్రవరిలో కూడా సూపర్‌హిట్ కొట్టి సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్ ఉందని నిరూపిస్తాను" అని చెప్పారు. వి.వి.వినాయక్ మాట్లాడుతూ "మేం అడగ్గానే బాలకృష్ణ రావడంతో ఈ సినిమా సూపర్‌హిట్ అయిపోయిందన్న ఫీలింగ్ వచ్చేసింది. మేమంతా ఆనందంతో ఉద్వేగంగా ఉన్నాం' అని తెలిపారు. సాయి ధరమ్ తేజ్ మాట్లాడుతూ "కొత్త టాలెంట్‌ని ఎంకరేజ్ చెయ్యడంలో బాలకృష్ణ ముందుంటారని అందరూ అంటారు. మా సినిమాకి ఆశీస్సులు అందించడానికి రావడంతో మరోసారి అది ప్రూవ్ అయ్యింది" అని అన్నారు. చిత్రం ప్రీ రిలీజ్ వేడుకను ఫిబ్రవరి 4న రాజమండ్రిలోని గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజీలో ఘనంగా నిర్వహించనున్నారు. సి. కల్యాణ్ నిర్మిస్తున్న ఈ సినిమా లావణ్య త్రిపాఠి కథానాయిక.

ఆశాభోస్లేకు యశ్ చోప్రా అవార్డ్



యశ్ చోప్రా మెమోరియల్ అవార్డ్ 2017కు ప్రముఖ గాయని ఆశాభోస్లేను ఎంపిక చేశారు. సుబ్బరామిరెడ్డి ఫౌండేషన్ తరపున ఈ పురస్కారాన్ని ఇవ్వనున్నారు. యశ్ చోప్రా మృతిచెందిన తర్వాత ఆయనతో అనుబంధం ఉన్న సుబ్బరామిరెడ్డి 2013 నుంచి ఈ పురస్కారాన్ని కళల రంగంలో ప్రముఖులకు అందిస్తున్నారు. 2017కు గాను ఆశాభోస్లేకు అందజేయనున్నారు. శనివారం ముంబైలో సమావేశమైన టి. సుబ్బరామిరెడ్డి ఫౌండేషన్ జ్యూరీ సభ్యులు బోనీకపూర్, మాధుర్ భండార్కర్, హనీ ఇరానీ, పద్మినీ కొల్హాపురి, సుబ్బరామిరెడ్డి ఆశాభోస్లే పేరును నేషనల్ యశ్ చోప్రా మెమోరియల్ అవార్డుకు ఎంపిక చేశారు. గతంలో ఈ అవార్డును లతా మంగేష్కర్, అమితాబ్ బచ్చన్, రేఖ, షారుక్ ఖాన్ అందుకున్నారు. ఈ అవార్డు ప్రదానోత్సవం ముంబైలో ఫిబ్రవరి 16న ఘనంగా జరగనుంది. మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్ రావు, లతామంగేష్కర్ చేతుల మీదుగా భోస్లే ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.



21 రోజులు చీకటి గదిలోనే

- అల్లావుద్దీన్ పాత్ర కోసం రణవీర్ సింగ్ సాహసం
- ప్రశంసల వెల్లువ



'పద్మావత్' చిత్రంలో అల్లావుద్దీన్ ఖిల్జీగా రణవీర్ సింగ్

ఇప్పటి వరకూ హీరోగా చేసిన వ్యక్తి ప్రతినాయకుడిగా చేయాలంటే కాస్తా ఆలోచించాలి. ఎందుకంటే హీరోగా అవకాశాలు రాకపోతేనే విలన్‌గా చేసేందుకు సిద్ధపడతారు. ప్రతినాయకుడిగా బాగా మెప్పించిస్తే... ఆ పాత్రలోనే ఆ వ్యక్తిని ఊహించేసుకుంటారు ప్రేక్షకులు. అందుకే హీరోగా చేసిన వారంతా ప్రతినాయకుడిగా చేసేందుకు సాహసం చేయరు. అయినా హీరోగా మెప్పిస్తున్న వ్యక్తి విలన్‌గా చేశాడు. అదేదో మామూలుగా కాదు. బాలీవుడ్ ఇండస్ట్రీయే అతను గురించి గొప్పగా చెప్పుకునేంతగా. అతనే రణవీర్ సింగ్. ఇతన్ని ఇప్పుడు హిందీ చిత్రసీమ మొత్తం ప్రశంసలతో ముంచెత్తుతోంది. ఇంతకీ ఆయన చేసిన పాత్ర ఏంటీ అంటే... ఆ పాత్రకు పరిచయం అక్కర్లేదు...అదే అల్లావుద్దీన్ ఖిల్జీ...రాజ్‌పుత్ కర్ణిసేన చేసిన వివాదం ఫలితంగా అనేక సార్లు విడుదల వాయిదా పడుతూ చివరకూ ఈనెల 25వ తేదీన ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఆ చిత్రమే 'పద్మావత్'. ఇందులో టైటిల్ రోల్‌ను దీపికా పదుకొనే, అల్లావుద్దీన్ ఖిల్జీగా రణవీర్‌సింగ్ చేశారు. దీపికాకు ఏ తరహాలో ప్రశంసలు లభిస్తున్నాయో అంతకు మించిన గుర్తింపు రణవీర్‌సింగ్‌కు లభిస్తుంది. కారణం ఆయన పాత్ర...అందులో ఆయన మెప్పించిన విధానం. ఈ విధంగా తెరపై అల్లావుద్దీన్ ఖిల్జీగా, కామ క్రూరుడుగా, రాక్షసంగా కనిపించడానికి రణవీర్ పెద్ద సాహసమే చేశాడు. అల్లా వుద్దీన్ పాత్రలో ఇమిడిపోవడానికి ఏకంగా 21 రోజులు పాటు ఒకే గదికి పరిమితమైపోయాడు రణవీర్. అదీ తనకు తానే ఓ శిక్ష వేసుకున్నట్టు ఒకే గదిలో ఉండి ఆ పాత్రలోనే బతికాడు. ఈ విషయాన్ని శనివారం ఓ ఇంగ్లీష్ పత్రికకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన చెప్పాడు. 'నా కెరీర్‌లో ఈ స్టేజ్‌లో ఈ పాత్ర చేయడం పెద్ద రిస్క్. మన దేశంలో ఏ పాత్రలో ఎవరు బాగా చేయగలిగితే ఆ పాత్రలో మనల్ని ఊహించుకుని ఉండిపోతారు. నటుడిగా చేయాల్సింది నటన తప్ప పాత్ర ఏది అన్నది కాదు అని చేశాను. దానికి ప్రతిఫలం లభించింది. ఓ నటుడిగా నేను విభిన్నమైన పాత్రలు చేయగలను అని తేలింది. అది నాకు సంతోషం. భన్సాలీ ఈ పాత్ర చేయాలని చెప్పినప్పుడు నేను ఆ పాత్ర చేయడానికి సిద్ధంగా లేను. ఈ స్టేజ్‌లో ఈ తరహా పాత్ర చేయకూడదని అనుకున్నా. కానీ నేను చేయను అని చెప్పలేను. చేస్తాను అని చెప్పలేని పరిస్థితి. ఎందుకంటే ఆయన నాకు రెండు భారీ హిట్స్ ఇచ్చారు. చిత్రసీమలో భన్సాలీ నాకు గురువు. అందుకే చేశాను. ఇదే కాదు ఆయన కోసం ఏదైనా చేయడానికి సిద్ధమే. ఈ పాత్ర కోసం నేను ఓ చీకటి గదిని ఎంపిక చేసుకున్నా. ఆ గదిలో 21 రోజులు పాటు ఒక్కడినే ఒంటరిగా ఉండిపోయాను. నాకు నేనుగా ఆ గదికి లాక్ చేసుకుని ఉండిపోయాను. ఆ పాత్రలోనే ఆ 21 రోజులు బతికాను. షూటింగ్ సెట్ సిటీలో ఉండేది. నా గది మాత్రం సిటీ దూరంగా ఎటువంటి కమ్యూనికేషన్ లేని చోట ఉండేది. ఆ పాత్రలో ఎంత బెస్ట్‌గా అయితే అంత బెస్ట్‌గా మెప్పించేందుకు తీవ్రంగా శ్రమించాను. అందులో గొంతు, శరీరం, నడక అన్నింటిలోనూ మార్పులు వచ్చేలా కృషి చేశాను. భన్సాలీకి కావాల్సిన విధంగా మారాను. నా వేషధారణ చూసి భన్సాలీ ఆనందపడ్డారు. నేను ఇటువంటి చీకటి గదికే పరిమితయ్యే అనుభవాలు గతంలో కూడా ఉన్నాయి. వాటి గురించి ఇప్పుడు వివరంగా చెప్పలేను కానీ ఆ ఎక్స్‌పీరియన్స్ నాకు ఉపయోగపడింది" అని చెప్పారు.



సుస్మితా సేన్

మళ్లీ సినిమాలు చేస్తా

మాజీ మిస్ యూనివర్స్, నటి సుస్మితా సేన్ మళ్లీ వెండితెరపై మెరవడానికి సిద్ధమని ప్రకటించింది. తన కుమార్తె అలిషాతో కలసి ఓ ఫౌండేషన్ నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకలకు హాజరైన ఆమె మాట్లాడింది. ఆరు నెలలుగా మంచి స్క్రిప్ట్ కోసం ఎదురు చూస్తున్నట్టు చెప్పింది. మీరు మళ్లీ ఎప్పుడు సినిమాల్లో నటిస్తారని అభిమానులు ఎదురు చూస్తున్నారన్న ప్రశ్నకు ఆమె బదులిస్తూ...'నేను రెండున్నరేళ్ల క్రితమే మళ్లీ సినిమాలు చేయాలని నిర్ణయించుకున్నాను. నటించడం అనేది మీటర్ కాదు. కానీ ఆరు నెలలు నుంచి మంచి స్క్రిప్ట్ కోసం ఎదురు చూస్తున్నా. నేను నటిని కావాలన్నది నా లక్ష్యం కాదు. కాకపోతే ప్రజలతో కనెక్ట్ అవడానికే ఇది చేస్తున్నా అని గతంలోనే చెప్పా" అని చెప్పింది. 2010లో వచ్చిన 'నో ప్రాబ్లమ్' చిత్రమే ఈమె చివరి సినిమా.


'శీలవతి' యదార్థ సంఘటన

జీ స్టూడియోస్ పతాకంపై షకీలా టైటిల్ పాత్రలో నటించిన చిత్రం 'శీలవతి'. సాయిరాం దాసరి దర్శకత్వంలో రాఘవ ఎమ్. గణేష్, వీరు బాసింశెట్టిలు సంయుక్తంగా నిర్మించిన సైకలాజికల్ థ్రిల్లర్ ఇది. ఈ చిత్రం ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకుంది. శనివారం ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఈ సినిమా షకీలాకు 250వ చిత్రం. కేరళలో జరిగిన ఓ యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. అన్ని పనులు పూర్తి చేసి ఏప్రిల్ ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.



'శీలవతి' ఫస్ట్‌లుక్‌ను విడుదల చేస్తున్న షకీలా, రాఘవ, గణేష్ తదితరులు

అల్లరోడు హీరో, సునీల్ కమెడియెన్





అల్లరి నరేశ్ హీరో, సునీల్ కమెడియెన్...ఈ పేరు విన్నవెంటనే ఆశ్చర్యం కలుగుతుంది. ఇద్దరూ హీరోలే కానీ హాస్యంతో కూడిన హీరో పాత్రలే చేస్తారని మనకు తెలిసి. కానీ దీనికి ముందు సునీల్ మంచి హాస్య నటుడు. హీరోగా కొన్ని సినిమాలు చేసినా అందులో ఇటీవల చేసినవి పెద్దగా ఆకట్టుకోలేదు. ఇప్పుడు మళ్లీ హాస్య నటుడిగా చేయబోతున్నాడు. ఆ చిత్రంలో అల్లరి నరేశ్ హీరోగా చేస్తున్నాడు. ఈ అల్లరోడు సినిమాలో ఎక్కువ హాస్యమే ఉంటుంది. తాజాగా భీమనేని శ్రీనివాస్ దర్శకత్వంలో నరేశ్ హీరోగా రూపొందనున్న ఈ చిత్రం శుక్రవారం సెట్స్‌పైకి వెళ్లింది. అల్లరి నరేశ్ భీమనేని కాంబినేషన్‌లో వచ్చిన 'సుడిగాడు' ఫ్లాప్ అయింది. ఇప్పుడు రెండో చిత్రం మొదలైంది. ఇది పూర్తి స్థాయి హాస్యభరిత చిత్రంగా తెరకెక్కనుందని తెలిసింది. ఈ చిత్రానికి శ్రీవాసంత్ బాణీలు సమకూరుస్తున్నాడు.



పెళ్ళైనా, పండగైనా, పార్టీ అయినా అదీ ఇదీ అనే తేడా లేకుండా ట్రెండీ టీ-షర్ట్స్ వేసుకుంటే వచ్చే లుక్కే వేరు. ట్రెండ్‌కీ, సీజన్‌కీ తగ్గట్లు మనమూ ఎప్పటికప్పుడు వేషధారణ మార్చేస్తుంటాం. ముఖ్యంగా టీనేజర్స్ అయితే మరీను. కానీ టీ-షర్ట్స్‌కి మాత్రం సీజన్ ఉండదు. ఎప్పుడు కావాలంటే అప్పుడు వేసేసుకోవచ్చు. హాంగర్‌కు తగిలించిందో, కప్‌బోర్డ్‌లో ఉంచిందో అలా హాయిగా వేసేసుకోవచ్చు. ఇంట్లో రెడీగా ఐరన్ చేసిన షర్ట్స్ ఉందో లేదో తెలీదు కానీ మనకోసం సిద్ధమన్నట్టు రెడీగా ఉండే టీ-షర్ట్ మాత్రం కచ్చితంగా ఉంటుంది. మరి వాటి ట్రెండ్సూ తెలుసుకోవాలి కదా....! ఈ వారం 'జోష్'లో వాటిపై ఓ లుక్కేద్దాం పదండి.

ట్రెండీ టీస్

టీ-షర్ట్స్‌లో గ్రాఫిక్ టీస్‌కి మంచి క్రేజ్ ఉంది. ఎప్పటికప్పుడు మంచి మంచి డిజైన్లతో యూత్‌ని ఆకర్షించే మోడల్స్‌లో ఇదీ ఒకటి. ఎబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్‌తో అర్థమయ్యీ, కానట్లుగా కనబడుతోంది. ఈ టీ-షర్ట్స్ యువతకి చక్కగా నప్పుతాయి. ఈ మోడల్ మాత్రం ఎప్పుడూ ట్రెండే. ట్రెండ్ ఫరెవర్. ఈ మధ్యకాలంలో యువత వీటిని ఎక్కువగా వాడుతున్నారు. విరివిగా వాడుతుండటంతో ఎప్పటికప్పుడు కొత్తకొత్త మోడల్స్ పుట్టుకొస్తూనే ఉన్నాయి. ఇటీవల చిన్నచిన్న షాపుల నుండీ, పెద్దపెద్ద షోరూమ్స్ వరకూ ఇవి అన్నిచోట్లా దర్శనమిస్తున్నాయి. ఎక్కువగా కాలేజ్‌కు వెళ్లే యువత వీటిని ధరించడానికి ఇష్టపడుతున్నారు. యూత్ మెచ్చింది కాబట్టే అంతకంతకూ ట్రెండ్ అవుతూ మర్కెట్లో చక్కర్లు కొడుతోంది.

ఎలా నచ్చితే అలా

ఒకప్పుడు బట్టలు ఇంటింటికీ తిరిగి అమ్మేవారు. ఇప్పటికీ అమ్ముతున్నా, అవి చాలా కొద్దిచోట్లకే పరిమితమయ్యాయి. ఈ రోజుల్లో బట్టలు కొనాలంటే షాపులూ, షాపింగ్‌మాల్స్ తెగ తిరగేస్తుంటాం. అదీ మనకి నచ్చిన మోడల్ కోసం అయితే ఎంత దూరమైనా వెళ్లిపోతాం. పట్టువదలని విక్రమార్కునిలా దానికోసం ఊరు ఊరంతా జల్లెడ పడుతూనే ఉంటాం. కొన్నికొన్ని వెంటనే దొరికేసినా, చాలాసార్లు మనకు కావాల్సిన విషయాల్లో నిరాశే ఎదురువుతుంది. కానీ ఇప్పుడు దానికో చక్కని పరిష్కారం వచ్చింది. ఇక నుంచి ఆ సమస్యతో ఇబ్బందిపడాల్సిన పనే ఉండదు. మనం కొనబోయే బట్టలను మనకు నచ్చినట్లు డిజైన్ చేసుకునే అవకాశాన్ని మనకు కలిపించే వెబ్‌సైట్లు చాలానే వచ్చేశాయి. అంతేకాదు ఇప్పటికే అవి యువతను విపరీతంగా ఆకర్షించడమూ మొదలుపెట్టాయి.




ఇష్టమైన రంగూ, నచ్చిన మోడల్, వాటిపై ఎంతో ఇష్టమైన స్లోగన్, కొటేషన్, సీనరీ, గ్రాఫిక్ వర్క్ ఏదైనా సరే... చిటికెలో పనైపోతుంది. దీంతో యువతంతా వీటిపై మరింత ఆసక్తి చూపిస్తున్నారు. ఈ పద్ధతి తొలుత విదేశాల్లో మొదలై, క్రమక్రమంగా మన మార్కెట్‌లోకీ అడుగుపెట్టింది. ఈ సేవలను అందిస్తూ ఇప్పటికే ఎన్నో రకాల ఆన్‌లైన్ వెబ్‌సైట్లు రకరకాలుగా వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. ఓసారి ఈ వెబ్‌సైట్ లింక్స్‌లోకి వెళ్లి వీటి కథేంటో మీరూ చూడొచ్చు.

www.customink.com, www.rushordertees.com, www.thesouledstore.com, inkmonk.com, www.spread-shirt.com. ఇలా ఒకటా రెండా ఎన్నో వెబ్‌సైట్లు అందుబాటులోకి వచ్చేశాయి.

మీరు పుట్టిన నెలతో టీ-షర్ట్

సంవత్సరంలోని అన్ని నెలలూ ఎలా ఉన్నా, మన పుట్టినరోజున్న నెల మాత్రం మనకు వెరీవెరీ స్పెషల్ కదా. ఆ నెల మాత్రమేనా, ఆ నెల పొడవునా మనం వేసుకునే బట్టలూ, కనిపించే లుక్ కూడా చాలా స్పెషల్‌గానే ఉంటాయి. దీనిని దృష్టిలో ఉంచుకునే కొన్ని న్యూ వెరైటీ టీషర్ట్‌లు మార్కెట్లోకి వచ్చాయి. రావడమే కాదు, బాగా ఆకర్షించేస్తున్నాయి.

ఏ నెలకు ఆ నెల... అప్పటి నెల పేరుతో ఉన్న టీషర్ట్స్ అటు బయటి మార్కెట్లోనూ, ఇటు ఆన్‌లైన్ మార్కెట్లోనూ విరివిగా అమ్ముడవుతున్నాయి. అసలు ఒకరకంగా ఇప్పుడున్న ట్రెండ్ ప్రకారమే అయితే మీ టీషర్ట్ చూసి మీరు ఏ నెలలో పుట్టారో చెప్పేయొచ్చు. ఔను మరి.. ఇప్పుడు ట్రెండీ టీషర్ట్‌లు అవే. Born in January, Born in February అని ఏ నెలలో పుడితే ఆ నెల పేరు టీషర్ట్ మీద పెట్టేసి ట్రెండ్ చేసేశారు. ఇక యంగ్‌స్టర్స్ ఎందుకు ఆగుతారు. తామూ గర్వంగా ఈ నెలలోనే నేను పుట్టాను అని చెప్పుకుంటూ తిరిగేస్తున్నారు. ఈ మధ్య సామాజిక మాధ్యమాల్లోనూ ప్రకటనలు మొదలయ్యాయి మరి. దీంతో దీని క్రేజ్ మరింత పెరిగింది. ఎంతోమంది యవత ఫేస్‌బుక్, ఇన్‌స్టోగ్రామ్‌లో ఈ టీషర్ట్స్‌తో అప్‌లోడ్స్ చేస్తున్నారు.



మళ్ళీ వెనక్కి

ఎప్పుడూ కొత్త కొత్త ట్రెండ్స్ వేసుకుని బోర్ కొట్టింది అనుకుంటే.. పాత ట్రెండ్‌నే ఫాలో అయిపోతే అదే కొత్త ట్రెండ్. ఇలా తరతరాలుగా కొనసాగుతోంది. బాగా పాత మోడల్‌కి కొద్దిపాటి మార్పులు చేసి, తిరిగి దాన్ని ట్రెండ్ చేయడం ఎప్పుడూ ఉండేదే! యువత ఇలాంటి స్టయిల్‌నూ బాగానే ఇష్టపడుతున్నారు కూడా. వారి మనసుకు నచ్చినదాన్ని ఇట్టే ట్రెండ్ చేస్తున్నారు. అయితే వెనక్కీ, లేదంటే ముందుకూ ఎలా నచ్చితే అలా ఎప్పటికప్పుడు వారికి నచ్చినట్టు వారుంటున్నారు. దీనినే 'వింటేజ్ ట్రెండ్' అంటారు. ఇవి మన తాతలూ ముత్తాతల కాలంలో ట్రెండ్స్ అన్నమాట! అప్పుడు అందుబాటులో ఉన్న డిజైన్స్, కలర్స్‌తో ఇప్పుడు మళ్ళీ ట్రెండీగా అప్ టు డేట్ చేసి, మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. మామూలు షాపులూ, షాపింగ్ మాల్స్‌లో కంటే ఇవి ఆన్‌లైన్ షాపింగ్ సైట్లలో ఎక్కువగా అందుబాటులో ఉంటున్నాయి. వీటికి మరింత అందం జోడయ్యేలా షూస్, గ్లాసెస్, రిస్ట్ వాచెస్, బ్యాండ్స్ లాంటివీ ఈ వింటేజ్ డిజైన్లలోనే అందుబాటులో ఉంచారు. ఇదంతా చూశాక, మీకూ చాలా గుర్తొచ్చేసి ఉంటాయి కదా?! మీ టీ-షర్ట్స్‌తో మీకున్న అనుబంధమూ జ్ఞాపకమొచ్చేసుటుంది. ఇంకా ఎన్నెన్ని కొత్త రకాలుగా ఇవి అందుబాటులో ఉన్నాయో తెలిసిపోయింది. మీకు బాగా నచ్చిన డిజైన్‌ను మీ అంతట మీరే డిజైన్ చేసుకునే అవకాశమూ ఉంది. ఇంకెందుకు ఆలస్యం... ఈసారెప్పుడైనా మీకు నచ్చిన మోడల్ అందుబాటులో లేకుంటే.. మీకు నచ్చిన డిజైన్ కోరుతూ ఆర్డర్ ఇచ్చేయండి. ఎంచక్కా నచ్చిన బట్టలతోనూ, మీరు పుట్టిన నెల పేరుతో ఉన్న టీషర్ట్‌లోనూ మెరిసిపోండి. ★

జోష్ తగ్గని డబ్‌స్మాష్

యువత ఏ పనినైనా ఇట్టే చేయగలరు. అదే వారికి నచ్చిన పనినైతే మరింత ఇష్టంగానూ, అంతే అందంగానూ చేయగలరు. అది రూకలు సంపాదించి పెట్టేదా.. రేపటి జీవితానికి తోడుగా నిలిచేదా.. అనే ఆలోనలు పెద్దగా ఉండవు. వ్యాపకానికీ పెద్దపీట వేస్తారు. జీవితంలో వ్యాపకాన్నీ పెద్దభాగమే చేసుకుంటారు. దానికీ కొంత సమయాన్నిస్తారు. కలల జీవితంలో కళకూ కొంత స్థానమిస్తున్నారు. వారి అభిరుచులనూ, అభిలాషలనూ ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా తామేంటో అందరికీ చెప్తున్నారు. కొత్తకొత్త యాప్స్ వాడుతూ తమ ప్రతిభకు పట్టం కడుతున్నారు. మరోవైపు వీరిని ఉద్దేశించే, సరికొత్తగా యాప్స్ తయారుచేసే పనిలోనూ డెవలపర్స్ ఉన్నారు. అలా యూత్ అంతా ఎంతగానో మెచ్చిన ఓ యాప్ సంగతి చూసొద్దాం పదండి.

వస్తూవస్తూనే ట్రెండ్!

కొన్ని యాప్స్ ట్రెండ్ అవడానికీ, జనాలలో నానడానికీ బాగా సమయం పడుతుంది. అలా ట్రెండ్ అయ్యాకా కనుమరుగైనవి ఎన్నో ఉన్నాయి. మళ్లీ జనాలు వాటి ఊసే ఎత్తరు. మర్చిపోతారు కూడా! అంతలా జనంలోకి వెళ్లడంలో అవి విఫలమయ్యాయనే చెప్పాలి. మరికొన్ని యాప్స్ బాగా నిదానంగా జనంలోకి వస్తాయి. ఒక్కొక్కరినీ, ఒక్కొక్కరినీ ఆకర్షిస్తూ, వచ్చి మరింత మందికి చేరుతాయి. అలా చేరినవీ ఎన్నో చిన్నచిన్నగానే వాడుకకు దూరమయ్యాయి. అలా వచ్చి నిలబడాలన్నా, జనంలో నానుతూ ఉండాలన్నా అందులో ఏదో మాయ ఉండాలి. అప్పుడే అది ఎంతోకాలం మన్నుతుంది. డబ్‌స్మాష్ యాప్ అలా మన్నుతూనే ఉంది. ఇప్పటికీ ఎంతోమందికి కొత్తగా చేరుతుంది. చేరిన వాళ్ల చెంత రన్ అవుతూనే ఉంది. అలా వస్తూవస్తూనే బాగా ట్రెండ్ అయిన ఈ యాప్ ఆ తర్వాత మరెన్నో కొత్తకొత్త యాప్స్ వచ్చినా తన స్థానాన్ని నిలుపుకుంటూనే వస్తోంది.

సెలబ్రెటీలనూ చేసింది

యాప్ ట్రెండ్ అవ్వడమే కాదు. ఎంతోమందిని సెలబ్రెటీలనూ చేసింది. డబ్‌స్మాష్ వీడియోలను అప్‌లోడ్ చేసి తమ ప్రతిభతో ఎంతోమంది అభిమానులనూ సంపాదించుకున్నారు. మాటకో, పాటకో తగ్గట్టు హావభావాలు పలికిస్తూ, చక్కని అభినయంతో సోషల్ మీడియాను ఏలేస్తున్నారు. ఎప్పటికప్పుడు సాధన చేస్తూ, అంతకంతకూ మెరుగుపడుతూ డబ్ చేసిన విషయమూ అర్థంకానంతగా లిప్ సింక్‌ను ఇస్తూ, చక్కని ఈజ్‌తో ఎంతోమంది ముందుకు దూసుకెళ్తున్నారు.

అభిమానతారల గొంతుతో

ప్రతిఒక్కరికీ వారు అభిమానించే తారలు ఉంటారు. వారిని అనుకరించాలని అనేకానేక ప్రయత్నాలూ చేస్తూ ఉంటారు. డ్రస్సింగ్ నుంచీ, హెయిర్ స్టయిల్ వరకూ ఎక్కడ అవకాశముంటే అక్కడ వారి వారి అభిమానతారలను అనుకరించడానికి ఇష్టపడతారు. ఇందులో ఆ అవకాశం మరీ ఎక్కువగా ఉంటుంది. మనకి నచ్చినతార సినిమాకూ, ఆ డైలాగ్స్‌కూ, ఆ పాటకూ మనం నటించేయొచ్చు. అచ్చం అతనిలానో, ఆమెలానో హావభావాలు పలికించేయొచ్చు. ఎప్పటికప్పుడు కొత్త సినిమాలు వస్తూనే ఉంటాయి. ఇంకా కొత్తకొత్తగా డైలాగులూ, సంభాషణలూ, పాటలూ ట్రెండ్ అవుతూనే ఉంటాయి. వాటిలో ఏ ఒక్కదానినీ యువత వదిలిపెట్టడం లేదు. దానికి డబ్‌స్మాష్ చేసి తమ సోషల్ మీడియా అకౌంట్‌లో షేర్ చేసి, తమ ఆసక్తిని చూపిస్తున్నారు. ఇంకొందరు బాగా క్రేజ్ వచ్చాక, కొద్దోగొప్పో అభిమానులను సంపాదించాక, వీటిని యూట్యూబ్‌కి చేర్చుతున్నారు. అలా నాలుగు రూకలనూ సంపాదిస్తున్నారు.

ఎప్పటి నుంచో ఇంత ట్రెండ్ అవుతున్న ఈ యాప్‌పై ఇంతవరకూ మీ దృష్టి పడలేదా? అయితే ఇప్పుడే ఓ లుక్కేయండి! సరదాసరదాగా మీకు నచ్చిన తారను అనుకరిస్తూ... ఒక డబ్‌స్మాష్ వీడియో చేయండి. ★





వ్యవస్థలో మార్పు రావాలి అనే ఆశయంతో యువత నుంచి వచ్చే అభిప్రాయాలను ప్రజల వద్దకు చేర్చే ప్రత్యేక కాలమ్ రైజ్ యువ(ర్) వాయిస్. మీ వాయిస్ పంపవలసినది : జోష్, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం: 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-2 లేదా joshprajasakti@gmail.com కు మెయిల్ పంపగలరు.



చిన్నారి



జత చేయండి!



పిల్లలూ..! పక్కనున్న చిత్రంలో కొన్ని వస్తువులు వాటి నీడలు ఉన్నాయి. వాటిలో ఏ నీడ దేనిదో జతచేయండి!

పొడుపు కథ

ఇసుక మైదానాలు,
ప్రయాణించేది ఒంటెలు,
దాహం తీర్చు ఒయాసిస్సులు,
పండేది ఖర్జూర ఫలాలు..?

జోక్ :

తాత : ఒరేయ్ చింటూ! షాపుకు వెళ్ళి కుచ్చులేని టూత్ బ్రష్ తీసుకురా నాయనా!

చింటు : ఎందుకు తాతా.. నీకు పళ్ళు లేవుగా..?


తాత : అందుకేరా కుచ్చులేనిది తీసుకు రమ్మన్నాను..!

హబుల్ టెలిస్కోపు ఓ అద్భుతం



పిల్లలూ..! ఖగోళ వింతలపై మనిషి ఎన్నో యుగాలుగా ఆసక్తి చూపుతూనే ఉన్నాడు. ఆకాశంలోని నక్షత్రాలలో వివిధ రకాల ఆకారాలను చూస్తూ మానవుడు ఎన్నో ఏళ్లు గడిపేశాడు. ఆకాశంలోని వింతల్ని మనం ఎప్పటికైనా చూడగలమా? అని ఎన్నోసార్లు మానవులకి సందేహం కల్గింది. కానీ పిల్లలూ..! పాతికేళ్ల క్రితం ఓ అద్భుతం జరిగింది. దాని పేరే హబుల్ టెలిస్కోపు! విశ్వ రహస్యాలను మన కళ్ల ముందు ఉంచుతోంది. కొత్త కొత్త లోకాలను చూపుతోంది. ఇది కంటికి కనిపించే కాంతితో ఫోటోలు తీస్తుంది. ఈ టెలిస్కోపు ఈ మధ్యనే బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. హబుల్ టెలిస్కోపు భూమి చుట్టూ తిరుగుతూ ఆకాశంలోకి చూసి ఎన్నో విషయాలు తెలుసుకోవటానికి దోహదపడింది. ఈ టెలిస్కోపులో పనిముట్లు అమర్చటానికి అల్మారా వంటి సదుపాయాలు ఉన్నాయి. ఈ అరలలో గ్రహాలని అన్వేషించే కెమెరా, కాంతిని కొలిచే సాధనం, మినుకుమినుకుమంటూ ప్రకాశించే కాంతిని పరిశీలించటానికి స్పెక్ట్రోగ్రాఫ్ ఉండేవి. వీటిలో కొన్నింటిని కొన్ని సంవత్సరాల క్రితం మార్చారు. ఈ టెలిస్కోపుని 1990లో అంతరిక్షంలోని కక్ష్యలో ప్రవేశపెట్టారు. పెద్దసైజులో ఉన్న ఈ టెలిస్కోపు సముద్ర మట్టానికి 600 కిలోమీటర్ల ఎత్తులో ప్రదక్షిణలు చేస్తుంది. ఒక్కొక్క ప్రదక్షిణకి 97 నిమిషాలు పడుతుంది. అంటే, సెకనుకి ఎనిమిది కిలోమీటర్ల వేగంతో ప్రయాణం చేస్తుందన్న మాట. హబుల్ టెలిస్కోపుని కక్ష్యలోకి పంపకముందు ఈ విశ్వం వయస్సు ఎంతో మనం సరిగ్గా చెప్పలేకపోయేవాళ్ళం. ఇప్పుడు మన విశ్వం వయస్సు చెప్పగలం. మన సూర్య మండలానికి బయట ఉన్న ఒక గ్రహానికి ఛాయాచిత్రం మొట్టమొదటగా తీసిన ఘనత ఈ టెలిస్కోపు దక్కించుకుంది. ★





పిల్లల్లారా.. రారండి!!



హాయ్ పిల్లలూ! మీలో చాలా టాలెంట్ ఉంది కదూ! మీకు పాటలొచ్చు. బొమ్మలొచ్చు, బోల్డన్ని ఆటలొచ్చు. మేజిక్కులొచ్చు. అలాగే కథలూ రాస్తారు కదూ?!. మాకెలా తెలుసంటారా? అసలు పిల్లలంటేనే.. క్రియేటివ్ కిడ్స్‌కదా?! చక్కగా చదువుకుంటూనే ఆటలు, పాటలతో మీరంతా అదరగొట్టేస్తారని మాకు తెలుసు. అందుకే మీరు వేసిన బొమ్మలు, కార్టూన్లు, రాసిన బుల్లిబుల్లికథలు వేసిన నాటకాలు ఇంకా మీరు కనిపెట్టిన సైన్స్ సంగతులు, మీరు చూసొచ్చిన కొత్త ప్రదేశాలగురించి చిన్నారి పేజీలో పంచుకోండి. వాటిని మీపేరుతో, మీ ఫొటోతో ప్రచురిస్తాం. నిజమా?! అని ఆశ్చర్యంపోకండి. నిజమే. అందుకే మీలోదాగి ఉన్న ఏ టాలెంట్ గురించి అయినా మాకు రాసి పంపండి. ఇంకెందుకు ఆలస్యం... పెన్ను, పెన్సిల్, బ్రష్‌తో రెడీ అయిపోండి.

చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

నేను గీసిన బొమ్మ




తుమ్మలురు ధన్విత,
7వ తరగతి,
విద్యామందిర్ పాఠశాల , కడప.

ఐపిఎల్ వేలంలో కోట్లే కోట్లు

యువ క్రికెటర్లకు భలే ఛాన్స్


- బెన్ స్టోక్స్‌కు అత్యధిక ధర
- 11 కోట్లు పలికిన రాహుల్, పాండే
- తొలిరోజు క్రిస్ గేల్, జో రూట్‌లను కొనుగోలు చేయని ఫ్రాంచేజీలు
- గంభీర్, యువరాజ్‌లకు కనిష్ట ధర



కెఎల్ రాహుల్ (11 కోట్లు) (కింగ్స్ ఎలెవన్ పంజాబ్)



మనీష్ పాండే (11 కోట్లు) హైదరాబాద్



బెన్ స్టోక్స్ 12.5 కోట్లు (రాజస్థాన్ రాయల్స్)

బెంగళూరు : ఉత్కంఠభరితంగా జరిగిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)లో ఇంగ్లండ్‌కు చెందిన బెన్ స్టోక్స్ దుమ్ము దులిపాడు. శనివారం ప్రారంభమైన మొదటి రోజు వేలంలో బెన్ స్టోక్స్ 12.5 కోట్లకు రాజ స్థాన్ రాయల్స్ చెల్లించి కొనుగోలు చేసుకుంది. ఐపిఎల్‌లో ఒక్కో ఫ్రాంచేజీ 321 కోట్లలోపు జట్టు సభ్యులందరినీ కొనుగోలు చేసుకోవాల్సి ఉంది. దీనిలో భాగంగా తొలిరోజు వేలం ముగి సింది. వేలంలో కుర్రాళ్లు అంచనాలను మించి అధిక ధరకు అమ్ముడుపోగా ఒకప్పటి మ్యాచ్ విన్నర్లు కనీస ధరను దాటిపోలేదు! ప్రతి బంతికీ సిక్సర్ బాదే బ్యాట్స్ మెన్.. అవసరమైన సమయంలో వికెట్లు తీసే బౌలర్లు.. అటు బ్యాటుతో ఇటు బంతితో రాణించే ఆల్‌రౌండర్లు.. ప్రతి బంతినీ ఒడిసిపట్టే చురుకైన కీపర్లకు మంచి ధర దక్కింది.

మొత్తం ఖర్చు రూ.321 కోట్లు

పదకొండో సీజన్‌లో వేలానికి 580 మంది ఆటగాళ్లను ఎంపిక చేయగా అందులో 361 మంది భారతీయులు. తొలిరోజు ఫ్రాంఛైజీలు అన్నీ కలిపి రూ.321.10 కోట్లు ఖర్చుచేసి 78 మంది ఆటగాళ్లను కొనుగోలు చేశాయి. అందులో 29 మంది విదేశీయులే ఉండటం గమనార్హం. వేలంలో ప్రీతిజింతా సారథ్యంలోని కింగ్స్ ఎలెవన్ పంజాబ్ పోటాపోటీగా ఆటగాళ్లను కొనుగోలు చేసింది. అండర్-19 కెప్టెన్ పృథ్వీ షాను ఢిల్లీ (1.2 కోట్లు), వైస్ కెప్టెన్ షుభ్మమ్ గిల్‌ను కలకత్తా (1.8 కోట్లు)కు కొనుగోలు చేశాయి. కలకత్తా నైట్ రైడర్స్ వదిలేసిన గౌతం గంభీర్, సిక్సర్ల హీరో యువరాజ్ సింగ్, ముంబయి ఇండియన్స్ తరపున ఆడిన హర్భజన్ సింగ్‌లను కొనుగోలు చేయడానికి ఫ్రాంచేజీలు కొనుగోలు చేయడానికి కొంత నిరాసక్తతను చూపాయి. అయితే సయ్యద్ ముస్తాక్ అలీ టీ20లో రాణించిన మనీశ్ పాండే, కరణ్ నాయర్, కెఎల్ రాహుల్‌లు మాత్రం వేలంలో దుమ్ము దులిపారు. గత ఏడాది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ఆడిన రాహుల్, కోల్‌కతాకు ఆడిన మనీశ్ పాండే కోసం గట్టి పోటీ నెలకొంది. వీరిద్దరి కోసం ప్రధానంగా పంజాబ్-హైదరాబాద్ పోటీపడ్డాయి. చివరకు రాహుల్‌ను కింగ్స్ ఎలెవన్ పంజాబ్ రూ.11కోట్లకు కైవసం చేసుకోగా.. మనీశ్ పాండేను రూ.11 కోట్లకు సన్‌రైజర్స్ హైదరాబాద్ దక్కించుకుంది.

తొలిరోజు వేలంలో వివిధ ఫ్రాంచేజీలు కొనుగోలు కొద్దిమంది క్రీడాకారుల జాబితా...

రాజస్తాన్ రాయల్స్
- బెన్ స్టోక్స్ – (12.5 కోట్లు)
- అజింక్య రహానె – (4 కోట్లు)
- స్టువర్ట్ బిన్ని – (50 లక్షలు)

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు
- క్రిస్ వోక్స్ – (7.4కోట్లు)
- బ్రెండన్ మెకల్లమ్ – (3.6 కోట్లు)
- కొలిన్ డిగ్రాండ్‌హోమ్ – (2.2 కోట్లు)
- మొయిన్ అలీ – (1.7 కోట్లు)

ఢిల్లీ డేర్ డెవిల్స్
- మ్యాక్స్‌వెల్ – (9 కోట్లు)
- గౌతం గంభీర్ – (2.8 కోట్లు)
- జేసన్ రాయ్ – (1.5 కోట్లు)
- కాలిన్ మున్రో – (1.9కోట్లు)
- పృథ్వీ షా – (1.2కోట్లు)

కింగ్స్ ఎలెవన్ పంజాబ్
- కేఎల్ రాహుల్ – (11 కోట్లు)
- ఆర్. అశ్విన్ – (7.6 కోట్లు)
- అరోన్ ఫించ్ – (6.2 కోట్లు)
- మార్కస్ స్టోనిచ్ – (6.2 కోట్లు)
- కరుణ్ నాయర్ – (5.6కోట్లు)
- డేవిడ్ మిల్లర్ – (3 కోట్లు)
- యువరాజ్ సింగ్ – (2 కోట్లు)

సన్‌రైజర్స్ హైదరాబాద్
- మనీశ్ పాండే – (11 కోట్లు)
- శిఖర్ ధావన్ – (5.2 కోట్లు)
- కేన్ విలియమ్సన్ – (3కోట్లు)
- కార్లోస్ బ్రాత్‌వైట్ – (2కోట్లు)
- షకీబ్ అల్ హసన్ – (2 కోట్లు)
- యూసుఫ్ పఠాన్ – (1.9కోట్లు)

చెన్నై సూపర్ కింగ్స్
- కేదార్ జాదవ్ – (7.8కోట్లు)
- డ్వేన్ బ్రావో – (6.4కోట్లు)
- షేన్ వాట్సన్ – (4కోట్లు)
- హర్భజన్ సింగ్ – (2 కోట్లు)
- డూప్లిసిస్ – (1.6కోట్లు)

కోల్‌కతా నైట్‌రైడర్స్
- క్రిస్ లిన్ – (9.6 కోట్లు)
- మిచెల్ స్టార్క్ – (9.4 కోట్లు)
- మిచెల్ స్టార్క్ – (9.4 కోట్లు)
- షబ్నమ్ గిల్ – (1.8 కోట్లు)

ముంబయి ఇండియన్స్
- కీరన్ పొలార్డ్ – (5.4 కోట్లు)

హమ్మయ్య గెలిచారు...

దక్షిణాఫ్రికాపై 63 పరుగులతో మూడో టెస్టులో విజయం



జోహాన్స్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో జరిగిన చివరి టెస్టులో భారత్ ఘన విజయం సాధించింది. ఉత్కంఠభరితంగా జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టును 63 పరుగుల తేడాతో ఓడించింది. దీంతో టెస్ట్ సిరీస్ ఆధిక్యాన్ని 1-2కు మాత్రమే తగ్గించగలిగింది. ఓవర్ నైట్ స్కోర్ వికెట్ నష్టానికి 17 పరుగులతో ఇన్నింగ్ ఆరంభించిన సఫారీ జటు ఆమ్లా(52) అవుటైన అనంతరం క్రమంగా వికెట్లను కోల్పోయి మ్యాచ్‌ను చేజార్చుకుంది.177 పరుగులకు ఆలౌట్ అయ్యింది. సఫారీ జట్టులో నలుగురు బ్యాట్‌మెన్ డకౌట్ అవ్వడం విశేషం. భారత బౌలర్లు మహ్మద్ షమి 5, బుమ్రా 2, ఇషాంత్ శర్మ 2 వికెట్లు తీసి కోహ్లీసేనకు ఘన విజయం అందించారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ భువనేశ్వర్ కుమార్‌కు... మ్యాన్ ఆఫ్ ది సిరీస్ ఫిలాండ్‌కు లభించాయి.

పార్థీవ్‌కు గాయం...

మూడో టెస్ట్ నాలుగోరోజు ఆటలో వికెట్ కీపర్ పార్థీవ్ పటేల్ వేలికి గాయమైంది. దీంతో అతడు మ్యాచ్ మధ్యలోనే మైదానం నుండి బయటకు వెళ్ళాడు. అతని స్థానంలో స్టాండ్‌బై వికెట్ కీపర్ దినేష్ కార్తీక్ కీపింగ్ బాధ్యతలు తీసుకున్నాడు. విజయ్, ఆమ్లా, ఎల్గర్‌లు గాయపడ్డ విషయం తెలిసిందే.

ప్రపంచ స్థాయికి అమరావతి

సిఎం చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి -విజయవాడ స్పోర్ట్స్

క్రీడల్లో అమరావతిని ప్రపంచ స్థాయికి చేరుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఇబ్రహీంపట్నం మూలపాడులోని ఎసిఎ క్రికెట్ మైదానంలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన శనివారం ప్రారంభించి మాట్లాడారు. 20 ఏళ్ల కిందట తమ ప్రభుత్వం ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ క్రీడలు నిర్వహించిందని, ఇప్పుడు అదే తరహాలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో క్రీడలకు తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని, అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా 303 ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలను తప్పనిసరి చేశామని చెప్పారు. అలాగే ఆరు క్రీడా అకాడమీలను ప్రారంభించామన్నారు. త్వరలోనే అంతర్జాతీయ స్థాయి హంగులతో మంగళగిరిలో క్రికెట్ మైదానం సిద్ధం కానుందన్నారు. ఒలింపిక్ గేమ్స్‌ను చిన్న రాష్ట్రాలు సైతం సులభంగా నిర్వహిస్తున్నాయని, వాటితో పోల్చుకుంటే మన రాష్ట్రంలో ఒలింపిక్స్ నిర్వహణకు పుష్కలమైన వాతావరణం ఉందని తెలిపారు. భవిష్యత్తులో తమ ప్రభుత్వం కచ్చితంగా ఒలింపిక్స్ నిర్వహిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మంత్రులు కొల్లు రవీంద్ర, దేవినేని ఉమామహేశ్వరరావు, ఎంపి గోకరాజు గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ జెండా లేకుండా సివిల్ సర్వీసెస్, శాప్ జెండాలు ఎగురుతున్న దృశ్యం

ఎగరని జాతీయ జెండా

ఏసిఏ క్రికెట్ మైదానంలో ప్రారంభించిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ముందుగా జాతీయ జెండావిష్కరణ చేయాలి. షెడ్యూల్‌లో భాగంగా చంద్రబాబు జాతీయ జెండాను ఎగుర వేసిన అనంతరం సివిల్ సర్వీసెస్ జెండా, శాప్ జెండాలను ఎగుర వేయాల్సి ఉంది. అయితే ముఖ్యమంత్రి జాతీయ జెండాను ఎగుర వేసే సమయంలో జెండాకు వేసిన ముడి రాకపోవడంతో ఆయన తాడును గట్టిగా లాగారు. దీంతో జాతీయ జెండా ఉన్న దిమ్మ నేలకొరిగింది. అనంతరం జాతీయ జెండాను వదిలేసి సివిల్ సర్వీసెస్, శాప్ జెండాలను ఎగుర వేసి ముందుకు సాగారు. ఈ నేపథ్యంలో శాప్ అధికారుల తీరుపై సిఎం అసహనం వ్యక్తం చేశారు.

జాతీయ స్థాయిలో గన్నవరం పేరు నిలపాలి

ప్రజాశక్తి - గన్నవరం (విజయవాడ)

జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లోనూ గెలుపొంది గన్నవరం పేరును నిలపాలని వేములపల్లి కోదండ రామయ్య కళాశాల అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్, జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ మాజీ క్రీడాకారిణి డాక్టర్ కొడాలి రాజేశ్వరి ఆకాంక్షించారు. కృష్ణాజిల్లా బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న జాతీయ స్థాయి కబడ్డీ శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ.. వికెఆర్‌లో చదువుతున్న విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించడం చూస్తుంటే చాలా ఆనందంగా ఉందన్నారు. వికెఆర్ విద్యార్థులు పామర్తి రాజేష్, కాటూరి కోటేశ్వరరావులు రాష్ట్ర జట్టులో స్థానం పొందడం విశేషమన్నారు. ఇదే కళాశాలలో చదివిన పీఈటీలు నాగరాజు, షేక్ గౌసానిలు జట్టుకు శిక్షకులుగా వ్యవహరించడం ప్రసంశనీయమని అన్నారు. అనంతరం మహిళలు, పురుషుల జట్లు ఈ నెల 28 నుంచి 30 వరకు ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లాయి. కార్యక్రమంలో సైకిల్ పోలో సంఘం జిల్లా కోశాధికారి డి.శర్వాణి పాల్గొన్నారు.

హోరాహోరీగా జాతీయస్థాయి వాలీబాల్ టోర్నీ

ప్రజాశక్తి-కార్పొరేషన్ (గుంటూరు)

గుంటూరులోని ఎన్‌టిఆర్ స్టేడియంలో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మారెళ్ల కైలాష్‌రెడ్డి మెమోరియల్ టోర్నమెంట్‌లో భాగంగా శనివారం మహిళల విభాగంలో తొలిమ్యాచ్ కేరళ పోలీసు జట్టు, పశ్చిమ బెంగాల్ జట్ల మధ్య జరిగింది. 25-19, 25-14, 25-18 తేడాతో కేరళ విజేతగా నిలిచింది. పురుషుల విభాగంలో ఎస్ఆర్ఎం, ఐసిస్ జట్లు తలపడగా 25-18, 19-25, 13-25, 19-25 పాయింట్లతో ఎస్ఆర్ఎం జట్టు విజయం సాధించింది. అనంతరం ఆంధ్రప్రదేశ్-కేరళ ఎలక్ట్రిసిటీ బోర్డు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్-సిఆర్‌పిఎఫ్ జట్లు తలపడ్డాయి. మంత్రి పత్తిపాటి పుల్లారావు, వైసీపి రాష్ట్ర నాయకులు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, నామినేటెడ్ ఎమ్మెల్యే ఫిలిప్ సి.థాచర్, ద్రోణాచార్య, అర్జున అవార్డు గ్రహీత, వాలీబాల్ జాతీయ జట్టు కోచ్ జిఇ.శ్రీధరన్, జిఎంసి కమిషనర్ చల్లా అనురాధ, మిర్చి యార్డు చైర్మన్ మన్నవ సుబ్బారావు, పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి వట్టికూటి శ్రీనివాస్, అడిషనల్ ఎస్‌పి తిరుపాల్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత అరికపూడి రమణరావు పోటీలను తిలకించారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68